
*Licensed to post with*
*payment at RMS, Hyd*




లాకప్ డెత్‌లపై
ఎన్‌హెచ్‌ఆర్‌సి సీరియస్

# ఉద్భవ

www.udbhavamagazine.com

స్త్రీ మరియు పిల్లల సంక్షేమం / స్వేచ్ఛ / హక్కుల మాసపత్రిక

Volume : 20 Issue: 4 JULY 2026 Pages: 72 Rs.10



## ఫుట్‌పాత్‌పై నడక.. పౌరుల ప్రాథమిక హక్కు

### సుప్రీంకోర్టు చారిత్రక తీర్పు

**UDBHAVA**
Edited, Printed, Published and owned by
**Dr. M. Madhava Vasu** and Printed at Saraswathi Printers,
Plot No.1, 1-24-21/4, (24-387), Sri Sai Nagar, Lothukunta,
Alwal, Secunderabad - 500 015. Telangana and
Published at Plot No.1, 1-24-21/4, (24-387),
Sri Sai Nagar, Lothukunta, Alwal,
Secunderabad - 500 015, Telangana.
Editor : Dr. M. Madhava Vasu,
RNI No: 87195 (APTEL/2005/14638)
Phone: 040-27960130 - Mobile : +91 9848861801
email: madhavvasumanchiraju@gmail.com
www.udbhavamagazine.com



# ఫుట్‌పాత్‌పై నడక.. పౌరుల ప్రాథమిక హక్కు

## వాహనాల కన్నా పాదచారుల హక్కులకే ప్రాధాన్యం
## రహదారులకు ఇరువైపులా ఫుట్‌పాత్‌లు ఉండాల్సిందే
## చారిత్రక తీర్పు వెలువరించిన సుప్రీంకోర్టు
## సమగ్ర చట్టాన్ని రూపొందించాలని కేంద్రానికి సూచన
## కర్నాటక బాలుడి మృతి కేసులో పరిహారం పెంపు

రోడ్డు ప్రమాదాలు, పాదచారుల రక్షణపై అత్యున్నత న్యాయస్థానం సుప్రీంకోర్టు చారిత్రాత్మక తీర్పును వెలువరించింది. ప్రజల భద్రతను దృష్టిలో ఉంచుకుని.. పద్ధతి ప్రకారం నిర్మించిన, ఆక్రమణలు లేని ఫుట్‌పాత్‌లపై నడవడం ప్రతి పౌరుడి యొక్క ప్రాథమిక హక్కు

## *ఆర్టికల్ 19, 21 పరిధిలోకి ఫుట్‌పాత్ హక్కు*

### *జస్టిస్ నరసింహ ధర్మాసనం*

*జస్టిస్ పి.ఎస్. నరసింహ, జస్టిస్ ఏ.ఎస్. చందూర్‌కర్‌లతో కూడిన సుప్రీంకోర్టు ద్విసభ్య ధర్మాసనం ఈ తీర్పును ఇచ్చింది. భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 19(1)(డి) ప్రకారం దేశంలో స్వేచ్ఛగా సంచరించే హక్కు, అలాగే ఆర్టికల్ 21 కల్పించిన జీవించే హక్కు పరిధిలోకి సురక్షితంగా ఫుట్‌పాత్‌పై నడిచే హక్కు కూడా వస్తుందని న్యాయమూర్తులు స్పష్టం చేశారు. మనుషులు గౌరవప్రదంగా, సురక్షితంగా జీవించడానికి ఫుట్‌పాత్‌లు ఎంతో కీలకమని, ఆ సౌకర్యం కల్పించాల్సిన కనీస బాధ్యత ప్రభుత్వ అధికారులపైనే ఉందని జస్టిస్ నరసింహ తన తీర్పు పాఠంలో పేర్కొన్నారు.*

అని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. రహదారులపై మోటారు వాహనాల రాకపోకల కంటే నడిచివెళ్లే పాదచారుల హక్కులకే మొదటి ప్రాధాన్యత ఇవ్వాలని అన్ని రాష్ట్రాలకూ తేల్చి చెప్పింది. రహదారులకు ఇరువైపులా ఫుట్‌పాత్‌లు పాదచారులకు మాత్రమేనని, వీటి నిర్వహణకు గైడ్‌లైన్స్ రూపొందించాలని కేంద్రానికి సైతం సూచించింది. తాజాగా, వీటికి సంబంధించి కీలక తీర్పును వెలువరించింది. ఇది రాజ్యాంగం కల్పించిన ప్రాథమిక హక్కుని తేల్చిచెప్పింది. రోడ్డు ప్రమాదంలో చనిపోయిన ఓ ఐదేళ్ల చిన్నారి కేసు విచారణ సందర్భంగా సుప్రీం కోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. రహదారి పక్కన ఫుట్‌పాత్‌లు ఉండాల్సిందేనని, దీనిపై పౌరులు బాధ్యులైన అధికారులపై చర్యలకు చట్టపరమైన పరిష్కారాలను ఆశ్రయించవచ్చని తెలిపింది. పౌరుడు స్వేచ్ఛగా తిరిగే హక్కును కల్పించే రాజ్యాంగంలోని ఆర్టికల్ 19(1)(డి)లో భాగంగా ఈ నడిచే హక్కు కూడా ఉంటుందని జస్టిస్ పీఎస్ నరసింహ, జస్టిస్ ఏఎస్ చందూర్‌కర్‌లతో కూడిన ధర్మాసనం తీర్పు వెలువరించింది. ఆర్టికల్ 19 (1)(a) 19(1)(b), 19(1)(c), భావప్రకటన స్వేచ్ఛను కల్పించే ఆర్టికల్ 21తో కలిపి చదవాలని కూడా ధర్మాసనం పేర్కొంది. "ఒక రహదారి ఉందంటే దాని పక్కన పాదచారుల కోసం ఫుట్‌పాత్‌ను ఏర్పాటుచేసి, సక్రమంగా నిర్వహించాల్సి బాధ్యత కచ్చితంగా ఉంది.. ఇది చట్టపరంగా అమలు చేయాల్సి బాధ్యత" అని ధర్మాసనం అభిప్రాయపడింది. రోడ్డు ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయిన ఐదేళ్ల బాలుడి పరిహారానికి సంబంధించిన కేసు విచారణ సందర్భంగా కోర్టుపై విధంగా స్పందించింది. బాలుడ్ని తన తండ్రి ఉదయం 9 గంటలప్పుడు స్కూల్‌కు నడుచుకుని తీసుకెళ్తుండగా.. ట్యాంకర్ వచ్చి ఢీకొట్టింది. ఈ

ఘటనలో తీవ్రంగా గాయపడిన ఆ చిన్నారి ప్రాణాలు కోల్పోయాడు. ఈ కేసులో మృతిచెందిన బాలుడి తండ్రికి చెల్లించే పరిహారాన్ని రూ.11,44,628కు పెంచిన సుప్రీం కోర్టు.. దీనిని రెండు నెలల్లో చెల్లించాలని ఆదేశించింది. పరిహారాన్ని తగ్గిస్తూ హైకోర్టు ఇచ్చిన ఆదేశాలను పక్కనబెట్టింది. "ప్రత్యేకంగా కేటాయించిన ఫుట్‌పాత్‌లపై నడిచే హక్కుకు భంగం కలిగితే.. పౌరులు తమ హక్కుల పునరుద్దరణ, పరిహారం కోసం బాధ్యులైన అధికారులపై చట్టపరమైన పరిష్కారాలను ఆశ్రయించవచ్చు.. నష్టపరిహారం కోరవచ్చు.. అయితే ఈ పరిహారం మోటారు వాహనాల చట్టం 1988లతో సంబంధం లేకుండా స్వతంత్రంగా ఉంటుంది" అని ధర్మాసనం పేర్కొంది. సౌకర్యవంతమైన, సురక్షితమైన ఫుట్‌పాత్ లేకపోవడం, వాటిని వాహనాల రాకపోకల కోసం వదిలేయడం అనేది చాలా కాలంగా ఎదుర్కొంటున్న సమస్య అని ధర్మాసనం వ్యాఖ్యానించింది. దేశంలో నగరాలు, పట్టణాల ప్రణాళికలు వాహనాలకు అధిక ప్రాధాన్యతనిస్తూ రూపొందించారని, దీనివల్ల పాదచారులు దుర్బలమైన స్థితిలో ఉన్నారని కోర్టు తెలిపింది. చక్రాలు కనుగొనక ముందే మానవులు నకడ ప్రారంభించారని, ఆర్టికల్ 19(1)(డి) ప్రకారం సంచార హక్కు నడిచే ప్రాథమిక హక్కేనని అది వ్యాఖ్యానించింది. ఈ హక్కు వాహనాల వినియోగానికి ముందే అందుబాటులో ఉంది కాబట్టి, సురక్షితమైన, ప్రత్యేకంగా కేటాయించిన ఫుట్‌పాత్‌లను పొందే హక్కు కచ్చితంగా అంతర్భాగమై ఉంటుందని తేల్చిచెప్పింది. ప్రస్తుతం దేశంలోని మెట్రో నగరాలు, పట్టణాల్లో ఫుట్‌పాత్‌లు సరిగ్గా లేకపోవడం, ఒకవేళ ఉన్నా అవి వ్యాపారాలు, పార్కింగ్‌లతో ఆక్రమణలకు గురికావడంపై ధర్మాసనం తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. దీనిని ఒక నాగరికతా సమస్యగా అభివర్ణించిన న్యాయస్థానం.. ఎక్కడ రోడ్లు నిర్మించినా అక్కడ ఖచ్చితంగా ఫుట్‌పాత్‌లు కూడా నిర్మించాలని, వాటిని కాపాడాల్సిన పూర్తి బాధ్యత మున్సిపల్ కార్పొరేషన్లు, స్థానిక పంచాయతీలదేనని గుర్తు చేసింది. పాదచారుల ప్రాణాల రక్షణ కోసం కేంద్ర ప్రభుత్వం తక్షణమే ఒక సమగ్రమైన జాతీయ చట్టాన్ని తీసుకురావాలని ఈ సందర్భంగా సుప్రీంకోర్టు సూచించింది.

*"ప్రత్యేకంగా కేటాయించిన ఫుట్‌పాత్‌లపై నడిచే హక్కుకు భంగం కలిగితే.. పౌరులు తమ హక్కుల పునరుద్ధరణ, పరిహారం కోసం బాధ్యులైన అధికారులపై చట్టపరమైన పరిష్కారాలను ఆశ్రయించవచ్చు.. నష్టపరిహారం కోరవచ్చు.. అయితే ఈ పరిహారం మోటారు వాహనాల చట్టం 1988లతో సంబంధం లేకుండా స్వతంత్రంగా ఉంటుంది"*

# ఫుట్‌పాత్‌లపై ఆక్రమణలు తొలగించాల్సిందే



నిబంధనలు ఉల్లంఘించే వారిని వదలొద్దు

హైదరాబాద్ అంతటా చర్యలు చేపట్టాలి

హైకోర్టువద్ద ఆక్రమణలూ తొలగించలేదు

తప్పుపట్టిన తెలంగాణ హైకోర్టు ధర్మాసనం

టౌన్‌ప్లానింగ్ నిబంధనలు ఉల్లంఘిస్తూ అక్రమ నిర్మాణాలు చేపట్టే వారిని వదిలిపెట్టొదన్న సుప్రీంకోర్టు తీర్పును హైకోర్టు మరోసారి గుర్తుచేసింది. కనీసం హైకోర్టు దగ్గర ఉన్న ఫుట్‌పాత్‌ల ఆక్రమణలను కూడా తొలగించకపోవడాన్ని తప్పుపట్టింది. వృద్ధులు, పాదచారులకు ఇబ్బంది లేకుండా ఫుట్‌పాత్‌లు ఏర్పాటు చేయాలని, ఉన్నవాటిపై ఆక్రమణలు తొలగించాలని కోరుతూ రిటైర్డ్ జర్నలిస్టు బీ సురేందర్, మరికొంతమంది దాఖలు చేసిన పిటిషన్‌పై విచారణ జరిపిన జస్టిస్ ఎన్వీ శ్రవణ్‌కుమార్ ధర్మాసనం ఈ వ్యాఖ్యలు చేసింది. అక్రమణలపై పురపాలక శాఖ అధికారులను సాధారణ పౌరులు కూడా అప్రమత్తం చేసేలా టీజీ-బీపాస్ చట్టంలో నిబంధనలు ఉన్నాయని తెలిపింది. తాము ఆదేశాలు ఇచ్చిన తర్వాత కనీసం హైకోర్టు సమీపంలో అయినా ఫుట్‌పాత్‌ల ఆక్రమణలు తొలగించలేదని ఆక్షేపించింది. 'టౌన్‌ప్లానింగ్ స్కీంను ఉల్లంఘించే వారు ఎలాంటి ఉపశమనానికి అర్హులు కారు. అక్రమ నిర్మాణాలను, అనుమతిలేని నిర్మాణాలను క్రమబద్ధీకరించేందుకు హైకోర్టులు తమ అధికార పరిధిని వినియోగించరాదు' అని సుప్రీంకోర్టు పలు కేసుల్లో ఇచ్చిన తీర్పులను ధర్మాసనం ప్రస్తావించింది.

అక్రమ నిర్మాణాలను కూల్చివేసే క్రమంలో ఎలా వ్యవహరించాలనే విషయాలను 'బుల్డోజర్ కేసు'లో స్పష్టంగా పేర్కొందని, వాటిని కచ్చితంగా పాటించాలని పేర్కొంది. ఫుట్‌పాత్‌ల ఆక్రమణల తొలగింపుపై తీసుకున్న చర్యలు వివరించేందుకు మరో రెండువారాలు సమయం ఇస్తున్నట్లు పేర్కొంది. హైకోర్టు వద్ద నుంచి మొదలు పెట్టి హైదరాబాద్ అంతా ఆక్రమణలు తొలగించాలని స్పష్టం చేసింది.

# అదే నిజమైతే దారుణమైన హక్కుల ఉల్లంఘనే!

## సాయికృష్ణ మృతిపై ఎన్‌హెచ్‌ఆర్‌సి తీవ్ర ఆగ్రహం

## డీజీపీ, సీపీకి ఎన్‌హెచ్‌ఆర్‌సీ నోటీసులు

## వారంలోగా చర్యల నివేదిక సమర్పించాలని ఆదేశం

సంచలనం సృష్టించిన విజయవాడ కృష్ణలంక సాయికృష్ణ కస్టడీ మరణంపై జాతీయ మానవ హక్కుల కమిషన్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. తెలంగాణకు చెందిన హక్కుల న్యాయవాది ఫిర్యాదుతో స్పందించిన ఎన్‌హెచ్‌ఆర్‌సీ, ఏపీ డీజీపీ, విజయవాడ పోలీస్ కమిషనర్‌లకు నోటీసులు జారీ చేసి, వారం రోజుల్లో సమగ్ర నివేదికను సమర్పించాలని ఆదేశించింది. ప్రాథమిక విచారణలో అక్రమ నిర్బంధం, హింస నిజమేనని సిట్ నిర్ధారించడంపై కమిషన్ తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. ఆరోపణలు నిజమైతే ఇది రాజ్యాంగం ప్రసాదించిన జీవించే హక్కుపై జరిగిన తీవ్రమైన దాడిగా అభివర్ణించింది. సాయికృష్ణ మృతదేహాన్ని కాల్చివేసి బూడిదను నదిలో కలపడం, కృష్ణలంక పోలీస్ స్టేషన్ సీసీటీవీ ఫుటేజీని కావాలనే డిలీట్ చేయడంపై ఎన్‌హెచ్‌ఆర్‌సీ తీవ్ర అభ్యంతరం తెలిపింది. సిట్ దర్యాప్తు ప్రస్తుత స్థితి, నమోదు చేసిన ఎఫ్ఐఆర్, బాధ్యులైన అధికారుల వివరాలతో కూడిన సమగ్ర నివేదికను వారం రోజుల్లోగా అందజేయాలని ఆదేశించింది. గాదె సాయికృష్ణ మృతిపై సమగ్ర నివేదిక సమర్పించాలని జాతీయ మానవహక్కుల కమిషన్ ఆదేశించింది. ఈ మేరకు డీజీపీ, విజయవాడ పోలీస్ కమిషనర్‌కు నోటీసులు జారీ చేసింది. సాయికృష్ణను కృష్ణలంక పోలీసు స్టేషన్ సిబ్బంది అక్రమంగా అపహరించారని.. కస్టడీలో చిత్రహింసలకు గురిచేశారని, ఆ కారణంగా




ఆయన మరణించాడని తమకు ఫిర్యాదు అందినట్లు తెలిపింది. 'ఈ నేరాన్ని దాచేందుకు కొందరు పోలీసు అధికారులు మృతదేహాన్ని ద్విచక్ర వాహనంపై శ్మశానానికి తీసుకెళ్లి.. కాల్చి అవశేషాలను నదిలో కలిపినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. కృష్ణలంక సీఐ నాగరాజు, ఈ వ్యవహారంలో పాత్ర ఉన్న ఇతరులను కఠినంగా శిక్షించాలని కోరారు. పోలీసు స్టేషన్ సీసీటీవీ ఫుటేజీని భద్రపరచాలని.. ఈ వ్యవహారంలో స్వతంత్ర దర్యాప్తు జరిపించాలని అభ్యర్థించారు. ఈ ఘటనపై మీడియాలో వచ్చిన వార్తలను కమిషన్ పరిగణనలోకి తీసుకుంది.

పోలీసులపై వచ్చిన ఆరోపణలు.. అధికార దుర్వినియోగం, లా ఎన్‌ఫోర్స్‌మెంట్ సంస్థలపై నమ్మకం కోల్పోవడాన్ని ప్రతిబింబిస్తున్నాయి. సంరక్షకులు కుట్రదారులయ్యారు. వారి చర్యలు దేశీయ చట్టాల ఉల్లంఘనే కాకుండా.. భారత్ కట్టుబడి ఉన్న అంతర్జాతీయ మానవ హక్కుల ఒప్పందాలకు విరుద్ధం అని కమిషన్ అభిప్రాయపడింది. ఆరోపణల తీవ్రత దృష్ట్యా డీజీపీకి, విజయవాడ పోలీసు కమిషనర్‌కు నోటీసులు జారీచేయాలని ఆదేశించింది. వారు వారంలోగా సమగ్ర చర్యల నివేదికను సమర్పించాలని తేల్చిచెప్పింది. 'ఆ నివేదికలో సిట్ దర్యాప్తు ప్రస్తుత స్థితి, సంబంధిత పోలీసు అధికారులపై నమోదు చేసిన ఎఫ్ఐఆర్ వివరాలను పేర్కొనాలి. సాయికృష్ణ అక్రమ నిర్బంధం, కస్టడీ హింస, మరణం, మృతదేహం తరలింపునకు బాధ్యులైన పోలీసు అధికారుల వివరాలు చెప్పాలి. సర్కిల్ ఇన్‌స్పెక్టర్ నాగరాజు, ఇతరులపై తీసుకున్న శాఖాపరమైన, క్రిమినల్ చర్యల స్థితిగతులను నివేదికలో తెలియజేయాలి. కృష్ణలంక పోలీసు స్టేషన్ నుంచి తొలగించిన సీసీటీవీ ఫుటేజీ రికవరీకి, బాధితుడి మృతదేహ అవశేషాలను కనుగొనడానికి తీసుకున్న చర్యలను వివరించాలి. మృతుడి తల్లి గాదె విజయలక్ష్మి, ఇతర సాక్షుల భద్రతకు తీసుకున్న చర్యలు, మృతుడి కుటుంబానికి అందించిన మధ్యంతర పరిహారం లేదా సహాయం వివరాలను నివేదికలో పేర్కొనాలి' అని ఎన్‌హెచ్ఆర్‌సీ ఆదేశించింది.

# సాయికృష్ణది కస్టోడియల్ డెత్

## రిమాండ్ రిపోర్ట్‌లో నిర్ధారించిన సిట్



సాయికృష్ణ

గాదె సాయికృష్ణ మిస్సింగ్ కేసులో సిట్ దర్యాప్తు కొనసాగుతోంది. ప్రభుత్వాస్పత్రిలో సీఐ నాగరాజుకు వైద్య పరీక్షలు పూర్తికావడంతో 2వ ఏజేఎస్ కోర్టులో పోలీసులు హాజరుపర్చారు. ఈ సందర్భంగా కోర్టుకు సిట్.. రిమాండ్ రిపోర్టును సమర్పించింది. రిమాండ్ రిపోర్టులో సిట్ కీలక విషయాలను వెల్లడించింది. సాయికృష్ణది కస్టోడియల్ డెత్ అని, డెడ్‌బాడీని డెస్ట్రాయ్ చేశారని రిమాండ్ రిపోర్ట్‌లో పేర్కొంది. నాన్ బెయిలబుల్ వారెంట్ ఉన్నా కోర్టులో హాజరుపర్చలేదని సిట్ వెల్లడించింది.

'సాయికృష్ణను నాన్ బెయిలబుల్ వారెంట్‌లో తీసుకువచ్చి మాయం చేశారు. మే 5 నుంచి జూన్ 19 మధ్య కృష్ణలంక పోలీస్ స్టేషన్ పరిధిలో ఈ ఘటన జరిగింది. సాయికృష్ణ తల్లి విజయలక్ష్మి ఇచ్చిన ఫిర్యాదుతో విచారణ చేపట్టాం. 17 మంది సాక్షులను విచారణ చేశాం. ఫోరెన్సిక్ బృందం సాయంతో సీసీటీవీ కెమెరా ఫీడ్ స్వాధీనం చేసుకున్నాం. సాయికృష్ణ మిస్సింగ్ కేసులో హిమజ అనే స్టేషన్ సిబ్బందిని విచారించాం. కృష్ణలంక పోలీస్టేషన్‌లో సీసీటీవీ ఫుటేజ్ డేటా సిస్టమ్‌లో లేదు. సాయికృష్ణ మృతదేహాన్ని పోలీస్ స్టేషన్‌లోనే చూసినట్లు... మే5 నుంచి మే8 మధ్య సాయికృష్ణని కృష్ణలంక పీఎస్‌లో చూసినట్టు ఎస్ఐ వాంగ్మూలం ఇచ్చారు' అని రిమాండ్ రిపోర్ట్‌లో సిట్ పేర్కొంది.

'సాక్ష్యాలను నాశనం చేయడానికి, పోలీసు కస్టడీలో లేకుండా పోవడానికి సీఐ నాగరాజే కారణం. సీసీటీవీ ఫుటేజ్ డేటా (1-5-26 నుంచి 1-6-26 వరకు) డీవీఆర్‌లో లేకుండా చేశారు. ఫోరెన్సిక్



సిఐ నాగరాజు

బృందానికి పరీక్ష కోసం డీవీఆర్‌లను పంపించాం. సాయికృష్ణ మరణించాడని తెలిసినా కూడా కృష్ణలంక పోలీస్ సిబ్బంది ఆ సమాచారం మేజిస్ట్రేట్‌కు చేరవేయలేదు. సాయికృష్ణ మరణించాడని అతని తల్లి స్టేషన్‌కు వెళితే సీఐ నాగరాజు దూషించాడు. హైకోర్టులో సాయికృష్ణ తల్లి హెబియస్ కార్పస్ పిటిషన్ వేసినా కోర్ట్ ముందు వాస్తవాలను వెల్లడించలేదు. హైకోర్ట్ ముందు నిజాలు దాచారు , కోర్ట్‌ను తప్పుదోవ పట్టించారు. ఈ పరిణామాలన్నీ గమనించాక సైంటిఫిక్ ఎవిడెన్స్ చెరిపివేయడం ద్వారా సాయికృష్ణను హత్య చేశాడని గుర్తించాం. సాయికృష్ణ మిస్సింగ్ కేసులో ఆధారాలు పూర్తిగా ధ్వంసం చేశారు. అన్ని అంశాలు తెలుసుకోవాలంటే నిందితుడైన నాగరాజును విచారించాల్సి ఉంది. జూన్ 2 కంటే ముందే సాయికృష్ణ మరణించాడని మేము విశ్వస్తున్నాం. కస్టడీలో ఉండగా గాయాలపాలై మరణించాడని అన్ని ఆధారాలు స్పష్టంగా చెబుతున్నాయి' అంటూ రిమాండ్ రిపోర్ట్‌లో సిట్ వెల్లడించింది.

# కస్టడీ మరణం.. అత్యంత ఘోరమైన నేరం

### లాకప్‌లో హింస పోలీసుల 'అధికారిక విధి' కాదు

### చట్టాన్ని చేతుల్లోకి తీసుకుంటే ఎలాంటి రక్షణ ఉండదు

### నిందితులైన పోలీసులను శిక్షించేందుకు అనుమతి అవసరం లేదు

### కస్టోడియల్ మరణాలపై మధ్యప్రదేశ్ హైకోర్టు ఘాటు వ్యాఖ్యలు

కస్టోడియల్ మరణాలపై మధ్యప్రదేశ్ హైకోర్టు సంచలన తీర్పునిచ్చింది. నిందితులను కస్టడీలో కొట్టి చంపడం పోలీసుల 'అధికారిక విధి' కాదని తేల్చి చెప్పింది. నిందితులైన పోలీసులను శిక్షించేందుకు ప్రభుత్వం నుంచి ముందస్తు అనుమతి అవసరం లేదని ధర్మాసనం స్పష్టం చేసింది. ఈ మేరకు



*థర్డ్ డిగ్రీ ప్రయోగించడం, రికార్డులు ఫోర్జరీ చేయడం పోలీసుల విధి నిర్వహణ కిందికి రావు. ప్రభుత్వ ఉద్యోగుల ముందస్తు అనుమతి నిబంధన ఈ కేసులో వర్తించదు. భోపాల్ ఎయిమ్స్ ఆస్పత్రి పోస్టుమార్టం నివేదికలో బాధితుడిపై పోలీసుల హింస నిజమేనని తేలిందని కోర్టు ప్రస్తావించింది. చట్టాన్ని చేతుల్లోకి తీసుకునే పోలీసులకు రక్షణ కవచాలు ఉండవని స్పష్టం చేసింది.*

ఇండోర్ జిల్లా కోర్టు ఉద్యోగి పంకజ్ వైష్ణవ్ కస్టోడియల్ డెత్ కేసులో పోలీసుల పిటిషన్‌ను కొట్టివేస్తూ జస్టిస్ గజేంద్ర సింగ్ సంచలన ఆదేశాలిచ్చారు. ఈ సందర్భంగా కస్టోడియల్ మరణాలపై హైకోర్టు ధర్మాసనం ఘాటు వ్యాఖ్యలు చేసింది. సభ్య సమాజంలో కస్టోడియల్ మరణాలు అత్యంత ఘోరమైన నేరాలని మధ్యప్రదేశ్ హైకోర్టు అభిప్రాయపడింది. థర్డ్ డిగ్రీ ప్రయోగించడం, రికార్డులు ఫోర్జరీ చేయడం పోలీసుల విధి నిర్వహణ కిందికి రావని ఈ సందర్భంగా పేర్కొంది. ప్రభుత్వ ఉద్యోగుల ముందస్తు అనుమతి నిబంధన ఈ కేసులో వర్తించదని వెల్లడించింది. భోపాల్ ఎయిమ్స్ ఆస్పత్రి పోస్టుమార్టం నివేదికలో బాధితుడిపై పోలీసుల హింస నిజమేనని తేలిందని కోర్టు ప్రస్తావించింది. చట్టాన్ని చేతుల్లోకి తీసుకునే పోలీసులకు రక్షణ కవచాలు ఉండవని స్పష్టం చేసింది. విచారణకు ముందస్తు అనుమతి అవసరం లేదన్న కోర్టు తీర్పుతో నిందితులైన పోలీసులపై విచారణకు మార్గం సుగమమైంది. ఇండోర్‌లోని జిల్లా కోర్టులో క్లాస్-4 ఉద్యోగిగా పంకజ్ వైష్ణవ్ (24) పని చేసేవారు. 2015 డిసెంబర్‌లో ఓ స్కూటర్ దొంగతనం చేసినట్లు వైష్ణవ్‌పై ఆరోపణలు వచ్చాయి. ఈ మేరకు డిసెంబర్ 19న ఇండోర్‌లోని ఎంఐజీ పోలీస్ స్టేషన్‌కు అతన్ని తీసుకెళ్లారు. అదే రోజు రాత్రి పోలీసుల అదుపులో ఉండగానే వైష్ణవ్ ప్రాణాలు కోల్పోయాడు. విచారణ సందర్భంగా వైష్ణవ్‌ను పోలీసులు విపరీతంగా కొట్టడంతోనే మృతిచెందినట్లు ఆరోపణలు గుప్పుమన్నాయి. ఈ కేసు సంచలనం సృష్టించగా.. సీఐడీ అధికారులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఇద్దరు కానిస్టేబుళ్లతో పాటు అప్పటి స్టేషన్ హౌస్ ఆఫీసర్, ఇన్‌స్పెక్టర్ ఎం.ఎ.సయ్యద్‌పై ఛార్జ్‌షీట్ దాఖలు చేశారు. ఈ కేసుపై ట్రయల్ కోర్టు విచారణ చేపట్టింది. క్రిమినల్ ప్రొసీజర్ కోడ్‌లోని సెక్షన్ 197 కింద రక్షణ కల్పించాలన్న పోలీసుల అభ్యర్థనను కోర్టు తిరస్కరించింది. దీనిపై నిందితులు హైకోర్టును ఆశ్రయించారు. ప్రభుత్వ విధుల్లో భాగంగానే విచారణ చేశారని, ప్రభుత్వం నుంచి ముందస్తు అనుమతి లేకుండా విచారణ జరపలేరని పోలీసులు తరపు న్యాయవాది వాదించారు. అయితే ట్రయల్ కోర్టు ఇచ్చిన ఉత్తర్వులనే తాజాగా హైకోర్టు సమర్థించింది.

# 17 శాతం పెరిగిన సైబర్ నేరాలు

నేషనల్ క్రైమ్ రికార్డ్స్ బ్యూరో (ఎన్‌సిఆర్‌బి) తన వార్షిక 'క్రైమ్ ఇన్ ఇండియా - 2024' నివేదికను విడుదల చేసింది. ఈ నివేదిక ప్రకారం దేశవ్యాప్తంగా మొత్తం నేరాలు తగ్గినప్పటికీ, సైబర్ నేరాలు, ఆంధ్రప్రదేశ్ మరియు తెలంగాణ రాష్ట్రాలకు సంబంధించిన కొన్ని కీలక అంశాలు వెల్లడయ్యాయి. 2024లో భారతదేశంలో 58.85 లక్షల కాగ్నిజబుల్ (దర్యాప్తు చేయదగిన) నేరాలు నమోదయ్యాయి. 2023తో (62.41 లక్షలు) పోలిస్తే వీటి సంఖ్య తగ్గింది. అయితే దేశవ్యాప్తంగా 1,01,928 సైబర్ నేరాల కేసులు భారీగా పెరిగాయి. 2023తో పోలిస్తే (86,420 కేసులు) ఇవి దాదాపు 17% పెరిగాయి. మహిళలపై నేరాలు 1.5% తగ్గాయి. తెలుగు రాష్ట్రాల విషయానికి వస్తే తెలంగాణలో నేరాల రేటు (లక్ష జనాభాకు నమోదయ్యే కేసులు) గణనీయంగా పెరిగింది. దేశంలోనే అత్యధిక నేరాల రేటు ఉన్న రాష్ట్రాలలో తెలంగాణ ఒకటిగా నిలిచింది. సైబర్ నేరాల ఉచ్చులో పడుతున్న వారి సంఖ్య తెలంగాణలో అధికంగా ఉంది. ఆంధ్రప్రదేశ్‌లో మొత్తం 1,16,076 కేసులు నమోదయ్యాయి. ముఖ్యంగా ఫేక్ న్యూస్ (తప్పుడు వార్తలు) వ్యాప్తి చెయ్యడంలో మరియు కొన్ని హింసాత్మక కేసుల్లో ఏపీ మొదటి స్థానంలో ఉన్నట్లు ఎన్‌సిఆర్‌బి నివేదిక స్పష్టం చేసింది.

లైంగిక దోపిడీనే లక్ష్యంగా జరుగుతున్న మహిళల అక్రమ రవాణాకు సంబంధించి దేశవ్యాప్తంగా నమోదైన కేసుల్లో తెలంగాణ అగ్రస్థానంలో ఉందని ఎన్‌సీఆర్‌బి వెల్లడించింది. 2024లో రాష్ట్రవ్యాప్తంగా 423 కేసులు నమోదైనట్లు తెలిపింది. వ్యభిచార కూపాల్లోకి దించేందుకు మహిళలను మాయమాటలతో తీసుకువచ్చి, బెదిరించి లైంగిక దోపిడీకి గురిచేస్తున్నట్లు వెల్లడైంది. నేషనల్ క్రైమ్ రికార్డ్స్ బ్యూరో గణాంకాలతో తెలంగాణలో 'హ్యూమన్ ట్రాఫికింగ్' మరోసారి చర్చనీయాంశమైంది.

ఎన్‌సీఆర్‌బీ రిపోర్ట్ ప్రకారం, దేశవ్యాప్తంగా వివిధ జిల్లాల్లో యాంటీ హ్యూమన్

ట్రాఫికింగ్ యూనిట్స్ (ఏహెచ్‌టీయూ) ఏర్పాటయ్యాయి. 20 రాష్ట్రాల్లో 819 ఏహెచ్‌టీయూలు ఉన్నాయి. మిగిలిన రాష్ట్రాల్లో ఈ యూనిట్లు అందుబాటులోకి రావాల్సి ఉంది. ఈ విభాగాల సహకారంతో 2024లో 2,135 మానవ అక్రమ రవాణా కేసులు నమోదయ్యాయి. ఇందులో అత్యధికంగా తెలంగాణలోనే నమోదయ్యాయి. ఒడిశాలో 2024లో అత్యధికంగా 1,039 మంది బాధితులున్నట్లు కేసులు నమోదవగా 971 మందిని కాపాడినట్లు ఎన్‌సీఆర్‌బీ డేటా చెబుతోంది.

మహారాష్ట్రలో 892 మంది బాధితులకు గాను 885 మంది, తెలంగాణలో 814 మంది బాధితులకు గాను 812 మంది, బిహార్‌లో 639 మంది బాధితులకు గాను 639 మంది, ఆంధ్రప్రదేశ్‌లో 313 మంది బాధితులకు గాను 313 మందిని కాపాడినట్లు లెక్కలు చెబుతున్నాయి. భారత్‌లో మానవ అక్రమ రవాణా కేసుల్లో పట్టుకున్న బాధితుల్లో భారత పౌరులతో పాటు నేపాల్, బంగ్లాదేశీయులు కూడా ఉన్నారు. త్రిపురలో అత్యధికంగా 232 మంది బంగ్లాదేశీయులను పట్టుకున్నట్లు ఎన్‌సీఆర్‌బీ డేటా చెబుతోంది. మానవ అక్రమ రవాణాలో ఎక్కువ మంది మహిళలే ఉన్నట్లు గణాంకాలు చూపుతున్నాయి. వ్యభిచారంలోకి దించేందుకు ఎక్కువగా మహిళలను అక్రమ రవాణా చేస్తున్నట్లు స్పష్టమవుతోంది. మానవ అక్రమ రవాణాకు సంబంధించి 2024లో భారత్‌లో 2,135 కేసులు నమోదవ్వగా, 6,018 మంది బాధితులను ఆయా రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల పోలీసులు, యాంటీ హ్యూమన్ ట్రాఫికింగ్ యూనిట్స్ సిబ్బంది గుర్తించారు. వీరిలో 5,839 మందిని రక్షించినట్లు ఎన్‌సీఆర్‌బీ డేటా చెబుతోంది.

అందులో వెట్టి చాకిరి కోసం 1,493 మందిని తరలిస్తున్నట్టు, 2,347 మందిని లైంగిక దోపిడీ చేసేందుకు, వ్యభిచార కూపంలోకి లాగేందుకు అక్రమ రవాణా చేస్తున్నట్లుగా గుర్తించారు. అలా వ్యభిచార కూపంలోకి తరలిస్తుండగా మహారాష్ట్రలో 829 మందిని, తెలంగాణలో 770 మందిని గుర్తించారు. పోర్నోగ్రఫీ, బిచ్చమెత్తించడం, మత్తు పదార్థాల రవాణా, అవయవాల దోపిడీ వంటి కారణాలతోనూ కేసులు నమోదయ్యాయి. 2024లో భారత్‌లో నమోదైన 2,135 కేసుల్లో 1,823 కేసుల్లో చార్జిషీట్ దాఖలు చేసినట్లు ఎన్‌సీఆర్‌బీ గణాంకాలు చెబుతున్నాయి. కానీ, కేవలం 43 కేసుల్లోనే నిందితులకు శిక్ష పడగా, 543 కేసులను కోర్టులు కొట్టివేశాయి. మరో 586 కేసులు విచారణ దశలో ఉన్నాయని రిపోర్ట్ స్పష్టం చేస్తోంది. అంటే కేవలం 7.3 శాతం కేసుల్లోనే శిక్షలు పడినట్లు తెలుస్తోంది.

దేశంలో 2024లో మానవ అక్రమ రవాణా కేసుల్లో అరెస్టయిన వ్యక్తులు 5,904మంది, చార్జిషీట్లు 4,695, శిక్ష పడిన వ్యక్తులు 110మంది, నిర్దోషులుగా

విడుదలైనవారు 1,558మంది. కాగా, తెలంగాణలో అత్యధికంగా 1,212 మందిని అరెస్టు చేసి, 1010 మందిపై పోలీసులు చార్జిషీట్ దాఖలు చేయగా, కోర్టులో కేవలం ఆరుగురికే శిక్ష పడింది. మహిళలపై నేరాలకు సంబంధించి భారత్‌లో 2024లో మహిళలపై నమోదైన మొత్తం నేరాలు 4,41,534 కాగా 2023లో నేరాల సంఖ్య (4,48,211)తో పోల్చితే 1.5 శాతం తగ్గింది. భర్త లేదా బంధువుల చేతుల్లోనే మహిళలకు వేధింపులు - 1,20,227 కేసులు (27.2 శాతం), కిడ్నాప్/అపహరణ 67,829 (15.4 శాతం), పోక్సో 67,809 (15.4 శాతం), మహిళల మర్యాదకు భంగం కలిగించే నేరాలు 48,303 (10.9 శాతం) నమోదయ్యాయి.

# తెలంగాణలో రోజుకు 108 ఆర్థిక నేరాలు

తెలంగాణలో రోజుకు సగటున 108 ఆర్థిక నేరాలు నమోదవుతున్నాయని నేషనల్ క్రైం రికార్డ్స్ బ్యూరో (ఎన్సీఆర్బీ) 2024 గణాంకాలు చెబుతున్నాయి. దేశవ్యాప్తంగా నమోదవుతున్న వాటిలో 18 శాతం తెలంగాణలోనే నమోదవుతున్నట్లు ఈ నివేదికలో తేలింది. మిగిలిన రాష్ట్రాల కంటే తెలంగాణలో అవగాహన కార్యక్రమాలు ఎక్కువగా నిర్వహిస్తున్న కారణంగా పోలీస్ స్టేషన్లలో నమోదవుతున్న కేసులు ఎక్కువగా ఉండటం దీనికి ఓ కారణంగా చెప్పవచ్చు.

ఎన్‌సిఆర్‌బి లెక్కల ప్రకారం, దేశంలో 2024లో 2,14,379 ఆర్థిక నేరాలు జరిగాయి. ఇందులో ఇతర రాష్ట్రాల కంటే తెలంగాణలో అత్యధికంగా 39,127 ఆర్థిక నేరాలు నమోదయ్యాయి. అత్యధికంగా హైదరాబాద్, సైబరాబాద్, మల్కాజిగిరి కమిషనరేట్లలోనే ఎక్కువగా ఆర్థిక నేరాలు రిపోర్ట్ అవుతున్నట్లు చెబుతున్నారు పోలీసులు. హైదరాబాద్ పరిధిలో రూ.75 లక్షలకు మించిన మోసాల్లో ఆర్థిక నేరాల విభాగం కింద కేసులు నమోదు చేస్తున్నట్లు పోలీసులు చెబుతున్నారు. ఆర్థిక నేరాల్లో ఎక్కువగా ఫోర్జరీ, చీటింగ్, ఫ్రాడ్ కేసులే రిపోర్ట్ అవుతున్నట్లు ఎన్సీఆర్బీ నివేదిక చెబుతోంది. దేశవ్యాప్తంగా నమోదైన ఆర్థిక నేరాల్లో 1,92,382 నేరాలు ఈ మూడు కేటగిరీల్లోనే ఉన్నాయి. తెలంగాణ విషయానికి వస్తే 38,312 నేరాలు ఈ కేటగిరీలోనే నమోదయ్యాయి. ఇందులో రియల్ ఎస్టేట్ మోసాలు ఎక్కువగానే ఉన్నాయి. ప్రీ-లాంచ్ ఆఫర్ల పేరుతో ముందుగానే డబ్బులు కట్టించుకుని, తిరిగి సమయానికి ఫ్లాట్లు అప్పగించకపోవడంతో బాధితులు తాము మోసపోయామని గుర్తించి పోలీసులను ఆశ్రయిస్తున్నారు. ఆర్థిక నేరాల్లో ఛార్జి షీట్ రేటు మాత్రం చాలా తక్కువగా ఉంటోంది. 2024లో ఛార్జి షీటు రేటు 39.8 శాతంగా ఉంది.

ఇదే సమయంలో దేశవ్యాప్తంగా ఛార్జి షీటు రేటు 53.3 శాతంగా ఉంది.

తెలంగాణలో 2024లో ఆర్థిక నేరాల్లో మొత్తం అరెస్టు అయిన వారు 9542 మంది కాగా, వారిలో మహిళలు 934 మంది, పురుషులు 8608 మంది ఉన్నారు. రాష్ట్రాలవారీగానే కాకుండా దేశంలో మెట్రో నగరాల పరంగా చూసినా సరే, ఆర్థిక నేరాలు హైదరాబాద్‌లో ఎక్కువగా రిపోర్ట్ అవుతున్నాయి. ఎన్సీఆర్బీ లెక్కల ప్రకారం, మెట్రో నగరాల జాబితాలో ఆర్థిక నేరాలు ఎక్కువగా నమోదవుతున్న నగరాల్లో హైదరాబాద్ రెండో స్థానంలో ఉంది. ఈ జాబితాలో ముంబయిది మొదటి స్థానం. హైదరాబాద్ నగరంలో రోజుకు సగటున 15 ఆర్థిక నేరాలు నమోదవుతున్నాయి. కొందరు పోంజీ, మల్టీలెవెల్ మార్కెటింగ్ వంటి మోసాల బారిన పడుతున్నట్లు చెబుతున్నారు పోలీసులు.

## సోషల్ మీడియా ఫేక్ న్యూస్‌లో ఏపీ టాప్!

దేశవ్యాప్తంగా నేరాల గణాంకాలను వెల్లడించిన ఎన్‌సిఆర్‌బి-2024 నివేదికలో ఆంధ్రప్రదేశ్‌కు సంబంధించిన పలు సంచలన అంశాలు వెలుగులోకి వచ్చాయి. ముఖ్యంగా సోషల్ మీడియాలో ఫేక్ న్యూస్ వ్యాప్తి చెందుతున్న వేళ సైబర్ నేరాలు, హింసాత్మక ఘటనలు పెరగడం ఆందోళన కలిగిస్తోంది. 2024 సంవత్సరంలో దేశవ్యాప్తంగా 58.86 లక్షల గుర్తించదగిన నేరాలు నమోదయ్యాయి అని, ఇవి గత ఏడాదితో పోలిస్తే 6% తగ్గుదలను సూచిస్తున్నాయని నివేదిక వెల్లడించింది. బాగా పెరిగిన సైబర్ నేరాలు అయితే సైబర్ నేరాలు బాగా పెరిగాయని పేర్కొంది. 2024 సంవత్సరంలో సైబర్ నేరాల కింద మొత్తం ఒక లక్ష ఒక వెయ్యి 928 కేసులు నమోదు కాగా, అంతకుముందు సంవత్సరంతో పోలిస్తే ఇవి చాలా ఎక్కువగా ఉన్నాయని పేర్కొంది. 2023 సంవత్సరంలో 86 వేల 420 సైబర్ నేరాలు నమోదైనట్లు వెల్లడించింది. 2024 సంవత్సరంలో సోషల్ మీడియాలో ఫేక్ న్యూస్ కేసుల నమోదులో ఆంధ్రప్రదేశ్ దేశంలోనే అగ్రస్థానంలో నిలిచింది. రాష్ట్రంలో మొత్తం 203 ఫేక్ న్యూస్ కేసులు నమోదు కాగా, తెలంగాణలో 139 కేసులు నమోదయ్యాయి. సోషల్ మీడియా వేదికగా తప్పుడు ప్రచారం, అపోహలు, ద్వేషపూరిత పోస్టులు పెరుగుతున్నాయని నివేదిక సూచిస్తోంది. ఏపీలో భారీగానే సైబర్ నేరాల కేసులు అలాగే సైబర్ నేరాలు కూడా రాష్ట్రంలో గణనీయంగా పెరిగాయి. 2024లో ఆంధ్రప్రదేశ్‌లో 2,528 సైబర్ క్రైమ్ కేసులు నమోదయ్యాయి. గత ఏడాదితో పోలిస్తే ఇవి సుమారు 8 శాతం అధికమని వెల్లడించింది. ఆన్‌లైన్ మోసాలు, బ్యాంకింగ్ ఫ్రాడ్స్, సోషల్ మీడియా హ్యాకింగ్ వంటి కేసులు అధికంగా నమోదైనట్లు సమాచారం. మరోవైపు రాష్ట్రంలో మొత్తం నమోదైన నేరాల సంఖ్య కూడా భారీగా పెరిగింది. మానవ అక్రమ రవాణా కేసుల్లో

ఆంధ్రప్రదేశ్ దేశంలో మూడో స్థానంలో 2024లో ఏపీలో మొత్తం 11,16,076 కేసులు నమోదు కావడం గమనార్హం. ముఖ్యంగా హింసాత్మక నేరాలు, మహిళలపై దాడులు, దోపిడీలు పెరిగినట్లు నివేదిక పేర్కొంది. ఇక మానవ అక్రమ రవాణా కేసుల్లో ఆంధ్రప్రదేశ్ దేశంలో మూడో స్థానంలో నిలవడం మరింత కలవరపెడుతోంది. ఈ గణాంకాలు రాష్ట్రంలో నేర నియంత్రణ, సైబర్ భద్రత, సోషల్ మీడియా పర్యవేక్షణపై మరింత దృష్టి పెట్టాల్సిన అవసరాన్ని సూచిస్తున్నాయని నిపుణులు అభిప్రాయపడుతున్నారు.

# సైబర్ నేరస్థులు 'పరాన్నజీవులు'

## సుప్రీంకోర్టు తీవ్ర వ్యాఖ్యలు



సైబర్ నేరస్థులు అమాయక ప్రజలను మోసంచేసి కోట్లాది రూపాయలు కాజేసే పరాన్నజీవులని సుప్రీంకోర్టు తీవ్ర వ్యాఖ్యలు చేసింది. ఇలాంటి నేరాలకు పాల్పడుతున్న వారిపై చట్టాలను మరింత కఠినతరం చేయాల్సిన అవసరముందని అభిప్రాయపడింది. ఈ మేరకు ఓ సైబర్ ఫ్రాడ్ కేసులో నిందితుడికి బెయిల్ నిరాకరించి, సదరు పిటిషన్‌ను తిరస్కరిస్తూ ఈ వ్యాఖ్యలు చేసింది న్యాయస్థానం. ఈ పిటిషన్ విచారణ సందర్భంగా.. సీజేఐ సూర్యకాంత్ నేతృత్వంలోని ధర్మాసనం సైబర్ నేరాలపై పెరుగుతున్న ముప్పుపై ఆందోళన వ్యక్తం చేసింది. ప్రజలను ఆకర్షించి భారీ లాభాలొస్తాయని నమ్మబలికి వారిని మోసగించే వ్యక్తులు సమాజానికి ప్రమాదకరమంది. 'మీరు పరాన్నజీవులు.. పెట్టుబడిదారుల నుంచి డబ్బు తీసుకుని మోసం చేస్తున్నారు. మీలాంటి వారు జైల్లో ఉండటమే సమాజానికి శ్రేయస్కరం. సైబర్ నేరస్థుల విషయంలో మరింత కఠినంగా వ్యవహరించాలి. ఇలాంటి నేరాలు ఎప్పుడూ పాన్ ఇండియా స్థాయిలో జరుగుతూ ఉంటాయి. గుజరాత్‌లో ఒకరు, ఆ తర్వాత ముంబై మరొకరి నుంచి.. ఇలా అందరి నుంచి డబ్బులు వసూలు చేస్తారు' అని ధర్మాసనం పేర్కొంది. ఈ సందర్భంగా కోర్టుకు అందించిన వివరాలను ప్రస్తావిస్తూ.. గతేడాది చివరి నాటికి దేశంలో డిజిటల్ మోసాల కారణంగా రూ.3 వేల కోట్లకు పైగా నష్టం వాటిల్లినట్టు పేర్కొంది న్యాయస్థానం. సైబర్ నేరాల తీవ్రతను ఇది విస్పష్టంగా తెలియజేస్తోందని వ్యాఖ్యానించింది.

# లింగ సమానత్వానికి మరో 134 ఏళ్ళు

ప్రపంచవ్యాప్తంగా లింగ సమానత్వాన్ని సాధించడానికి ప్రస్తుత వేగం ప్రకారం మరో 134 సంవత్సరాలు పడుతుందని గ్లోబల్ డేటా అంచనా వేస్తుంది. ఆర్థిక, సామాజిక, రాజకీయ రంగాలలో ఇంకా ఎంతో పురోగతి సాధించాల్సి ఉంది. తాజా ప్రపంచ గణాంకాలు, వరల్డ్ బ్యాంక్ మరియు ఐక్యరాజ్యసమితి నివేదికల ప్రకారం.. ప్రపంచంలో మహిళలు చట్టపరమైన, ఆర్థిక, మరియు రాజకీయ అడ్డంకులు ఎదుర్కొంటున్నారు. ప్రస్తుత అభివృద్ధిని బట్టి చూస్తే, ప్రపంచవ్యాప్త లింగ సమానత్వం మరో 134 సంవత్సరాల దూరంలో ఉంది. మహిళల ఆర్థిక సాధికారత ఇంకా బలహీనంగానే ఉంది. ప్రపంచవ్యాప్తంగా మహిళలు మొత్తం కార్మిక ఆదాయంలో కేవలం 21% మాత్రమే సంపాదిస్తున్నారు. భారత్‌లో మహిళల శ్రామిక శక్తి భాగస్వామ్యం దాదాపు 15.7% వద్దే కొనసాగుతోంది. ప్రపంచ ఆర్థిక వేదిక (WEF) నివేదిక: 148 ఆర్థిక వ్యవస్థల్లో లింగ సమానత్వాన్ని విశ్లేషించగా, ఆరోగ్యాలు, విద్య, ఉపాధి, రాజకీయ రంగాల్లో సమానత్వం కోసం అంతర్జాతీయ సంస్థలు నిరంతరం కృషి చేస్తున్నాయిూాణ+ లక్ష్యాలు: సస్టైనబుల్ డెవలప్‌మెంట్ గోల్స్ (ూాణ+ 5) ప్రకారం.. లింగ అంతరాన్ని తగ్గించడం మరియు మహిళలు, బాలికలకు సమాన అవకాశాలు, హక్కులు కల్పించడం స్థిరమైన అభివృద్ధికి అత్యవసరం.అంతర్జాతీయ మహిళా దినోత్సవం (×ఔణ) థీమ్:మహిళల హక్కులు మరియు న్యాయం కోసం ఐక్యరాజ్యసమితి ప్రత్యేక కార్యాచరణను చేపట్టింది. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా “గివ్ టు గెయిన్” (+ఱఙవ్ శీ +ఋఱఅ) క్యాంపెయిన్ ద్వారా ప్రపంచవ్యాప్తంగా మహిళలకు అవకాశాలు, మద్దతునిచ్చే వ్యవస్థలను ప్రోత్సహిస్తున్నారు.ఆర్థిక వ్యవస్థలో అసమానతలకు గల కారణాలు మరియు మహిళల ఉపాధి అంతరాల గురించి మరింత లోతైన విశ్లేషణ కోసం:

లక్ష్యం 5: లింగ సమానత్వాన్ని సాధించడం మరియు మహిళలు, బాలికలందరినీ సాధికారత కల్పించడం

లింగ సమానత్వాన్ని సాధించడం మరియు మహిళలు, బాలికలందరికీ సాధికారత కల్పించడం అనేది కేవలం చేయవలసిన సరైన పని మాత్రమే కాదు, సుస్థిర అభివృద్ధికి ఇది అత్యవసరం. లక్ష్యం 5 లింగ అంతరాన్ని తగ్గించడం మరియు అందరికీ సమాన అవకాశాలను కల్పించడంపై దృష్టి పెడుతుంది.

లింగ సమానత్వం అనేది ఒక ప్రాథమిక మానవ హక్కు మాత్రమే కాదు, శాంతియుత, సుసంపన్నమైన మరియు సుస్థిరమైన ప్రపంచానికి అవసరమైన పునాది కూడా. గత దశాబ్దాలుగా పురోగతి సాధించినప్పటికీ, 2030 నాటికి లింగ సమానత్వాన్ని సాధించే దిశగా ప్రపంచం సరైన మార్గంలో లేదు.

ప్రపంచ జనాభాలో మహిళలు, బాలికలు సగం మంది ఉన్నారు, కాబట్టి ప్రపంచ సామర్థ్యంలో కూడా సగం వారే. కానీ లింగ అసమానత ప్రతిచోటా కొనసాగుతూ సామాజిక పురోగతిని స్తంభింపజేస్తోంది. లైంగిక హింస, దోపిడీ, వేతనం లేని సంరక్షణ, గృహకార్యాల అసమాన విభజన, ప్రభుత్వ కార్యాలయాల్లో వివక్ష - ఇవన్నీ ఇప్పటికీ భారీ అడ్డంకులుగా మిగిలి ఉన్నాయి.

ప్రపంచవ్యాప్తంగా కార్మిక మార్కెట్‌లో సగటున మహిళలు ఇప్పటికీ 30 శాతం నిర్వాహక పదవులను మాత్రమే ఆక్రమించి ఉన్నారు మరియు పురుషుల కంటే మహిళలు దాదాపు రెండున్నర రెట్లు ఎక్కువ గంటలు వేతనం లేని గృహ మరియు సంరక్షణ పనులలో గడుపుతున్నారు.

2023 నాటి పురోగతి రేటు ప్రకారం, బాల్య వివాహాలను అంతం చేయడానికి సుమారు 300 సంవత్సరాలు, చట్టపరమైన రక్షణలోని లోపాలను పూడ్చి వివక్షాపూరిత చట్టాలను తొలగించడానికి 286 సంవత్సరాలు, కార్యాలయాల్లో అధికారం మరియు నాయకత్వ పదవులలో మహిళలకు సమాన ప్రాతినిధ్యం కల్పించడానికి 140 సంవత్సరాలు, మరియు జాతీయ పార్లమెంటులలో సమాన ప్రాతినిధ్యం సాధించడానికి 47 సంవత్సరాలు పడుతుందని అంచనా.

లక్ష్యం 5 సాధనకు ఉన్న వ్యవస్థాగత అడ్డంకులను తొలగించడానికి రాజకీయ నాయకత్వం, పెట్టుబడులు మరియు సమగ్ర విధాన సంస్కరణలు అవసరం. లింగ సమానత్వం అనేది అన్ని రంగాలకు వర్తించే లక్ష్యం మరియు జాతీయ విధానాలు, బడ్జెట్‌లు మరియు సంస్థలలో ఇది ప్రధాన దృష్టి కేంద్రంగా ఉండాలి.

మనం ఎంత పురోగతి సాధించాం?

ప్రపంచవ్యాప్తంగా మహిళల హక్కుల సాధనలో గణనీయమైన పురోగతి నమోదైంది. వివక్షాపూరిత చట్టాలను తొలగించి, లింగ సమానత్వ చట్టాలను ఏర్పాటు చేసేందుకు

2019 నుండి 2024 మధ్య 99 సానుకూల చట్టపరమైన సంస్కరణలు అమలు చేయబడ్డాయి. లింగ సమానత్వాన్ని ప్రోత్సహించడానికి చేసిన అంతర్జాతీయ నిబద్ధతలు కొన్ని రంగాలలో మెరుగుదలలను తీసుకువచ్చాయి: ఇటీవలి సంవత్సరాలలో బాల్య వివాహాలు, మహిళల జననాంగ విచ్ఛేదనం (ఫ్‌జీ+వీ) తగ్గాయి, మరియు రాజకీయ రంగంలో మహిళల ప్రాతినిధ్యం మునుపెన్నడూ లేనంత ఎక్కువగా ఉంది. కానీ, ప్రతి మహిళ, బాలిక పూర్తి లింగ సమానత్వాన్ని అనుభవించే, వారి సాధికారతకు ఉన్న అన్ని చట్టపరమైన, సామాజిక, ఆర్థిక అడ్డంకులు తొలగిపోయిన ప్రపంచం అనే వాగ్దానం మాత్రం నెరవేరలేదు.

లింగ సంబంధిత ఇతర సవాళ్లు ఏమైనా ఉన్నాయా?

అవును. ప్రపంచవ్యాప్తంగా, 43.7 శాతం వివాహిత మహిళలకు వారి లైంగిక మరియు పునరుత్పత్తి ఆరోగ్యం మరియు హక్కులపై నిర్ణయాధికారం లేదు. 15-49 సంవత్సరాల మధ్య వయస్సు గల మహిళల్లో 35 శాతం మంది శారీరక మరియు/లేదా లైంగిక సన్నిహిత భాగస్వామి హింసను లేదా భాగస్వామి కాని వారి నుండి లైంగిక హింసను అనుభవించారు. ప్రపంచవ్యాప్తంగా, 23 కోట్లకు పైగా బాలికలు మరియు మహిళలు ఏదో ఒక రూపంలో స్త్రీ జననాంగ విచ్ఛేదనం /కోతను అనుభవించారు, దీనివల్ల దీర్ఘకాలిక రక్తస్రావం, ఇన్ఫెక్షన్ (ుxఐతో సహా), ప్రసవ సమస్యలు, వంధ్యత్వం మరియు మరణం సంభవించే ప్రమాదం ఎక్కువగా ఉంటుంది.

ఈ రకమైన హింస కేవలం మహిళలు, బాలికలకు మాత్రమే హాని కలిగించదు; ఇది వారి మొత్తం జీవన నాణ్యతను దెబ్బతీసి, సమాజంలో వారి క్రియాశీల భాగస్వామ్యానికి ఆటంకం కలిగిస్తుంది.

లింగ సమానత్వం ఒక ప్రాథమిక మానవ హక్కు. పేదరికాన్ని తగ్గించడం నుండి బాలికలు మరియు బాలుర ఆరోగ్యం, విద్య, రక్షణ మరియు శ్రేయస్సును ప్రోత్సహించడం వరకు, ఆరోగ్యకరమైన సమాజంలోని అన్ని రంగాలకు లింగ సమానత్వాన్ని పెంపొందించడం చాలా కీలకం.

స్త్రీ జననాంగ విచ్ఛేదనం వంటి సాంస్కృతిక ఆచారాలను అరికట్టడానికి, అలాగే మహిళలు మరియు బాలికల హక్కులను పరిమితం చేస్తూ, వారి పూర్తి సామర్థ్యాన్ని సాధించకుండా అడ్డుకునే హానికరమైన చట్టాలను మార్చడానికి మీరు అవగాహన ప్రచారాలకు నిధులు సమకూర్చవచ్చు.

స్పాట్‌లైట్ ఇనిషియేటివ్ అనేది ఙఖ/ఖచీ భాగస్వామ్యంతో, మహిళలు మరియు బాలికలపై అన్ని రకాల హింసను నిర్మూలించడంపై దృష్టి సారించిన ఒక ప్రపంచవ్యాప్త,

బహుళ-సంవత్సరాల కార్యక్రమం -- ఇది మహిళలు మరియు బాలికలపై అన్ని రకాల హింసను అంతం చేయడానికి ప్రపంచంలోనే అతిపెద్ద లక్షిత ప్రయత్నం.

## వాస్తవాలు మరియు గణాంకాలు

2024లో, లింగ సమానత్వానికి చట్టపరమైన అడ్డంకులు కొనసాగుతున్నాయి: సర్వే చేసిన 131 దేశాలలో 61 (47%) దేశాలు ఇప్పటికీ పురుషులతో సమానమైన ఉద్యోగాలు చేయకుండా మహిళలను పరిమితం చేస్తున్నాయి, 38 దేశాలు (29%) ఎటువంటి మినహాయింపులు లేకుండా కనీస వివాహ వయస్సును 18గా నిర్ణయించాయి, మరియు 63 దేశాలు (48%) అంగీకారం లేకపోవడం ఆధారంగా అత్యాచారాన్ని నిర్వచిస్తున్నాయి.

20--24 ఏళ్ల వయసున్న యువతులలో దాదాపు ఐదుగురిలో ఒకరు (19%) 18 ఏళ్లు నిండకముందే వివాహం చేసుకున్నారు లేదా సహజీవనం చేస్తున్నారు. ప్రధానంగా దక్షిణాసియాలో సాధించిన పురోగతి కారణంగా ప్రపంచవ్యాప్తంగా బాల్య వివాహాలు తగ్గినప్పటికీ, అవి ఉప-సహారా ఆఫ్రికాలో (31%) అత్యధికంగా ఉన్నాయి, ఇక్కడ 2030 నాటికి బాలికా వధువుల సంఖ్య పెరుగుతుందని అంచనా వేయబడింది.

ప్రపంచవ్యాప్తంగా, 23 కోట్ల మందికి పైగా బాలికలు మరియు మహిళలు స్త్రీ జననాంగ విచ్ఛేదనకు గురయ్యారు, ప్రతి సంవత్సరం 40 లక్షల మంది బాలికలు ఈ హానికరమైన దురాచారానికి గురవుతున్నారు. 2030 నాటికి స్త్రీ జననాంగ విచ్ఛేదనను నిర్మూలించాలంటే, గత దశాబ్దపు వేగం కంటే 27 రెట్లు వేగంతో పురోగతిని సాధించాల్సి ఉంటుంది.

సమాచారం అందుబాటులో ఉన్న దాదాపు 80 శాతం దేశాలలో, సగం కంటే తక్కువ మంది మహిళలకు మాత్రమే వ్యవసాయ భూమిపై యాజమాన్యం లేదా సురక్షితమైన హక్కులు ఉన్నాయి. ఈ భూములు గ్రామీణ మహిళలకు సాధికారత కల్పించడానికి మరియు వ్యవసాయ-ఆహార వ్యవస్థలను బలోపేతం చేయడానికి అత్యంత కీలకమైనవి.

1 జనవరి 2025 నాటికి, జాతీయ పార్లమెంటులలో మహిళలు 27.2 శాతం సీట్లను కలిగి ఉన్నారు; ఇది 2015 నుండి 4.9 శాతం పాయింట్లు పెరిగింది, కానీ 2024 నుండి కేవలం 0.3 పాయింట్లు మాత్రమే పెరిగింది.

5వ లక్ష్యాన్ని సాధించడంలో ఉన్న వ్యవస్థాగత అడ్డంకులను తొలగించడానికి రాజకీయ నాయకత్వం, పెట్టుబడులు మరియు సమగ్ర విధాన సంస్కరణలు అవసరం. లింగ సమానత్వం అనేది అన్ని రంగాలకు వర్తించే లక్ష్యం మరియు జాతీయ విధానాలు, బడ్జెట్‌లు మరియు సంస్థలలో ఇది ప్రధాన దృష్టి కేంద్రంగా ఉండాలి.

# గృహిణుల సేవలు అమూల్యం

## వారి శ్రమ విలువ నెలకు రూ.30,000 కన్నా ఎక్కువే

## వారే దేశ నిర్మాతలు: సుప్రీం కోర్టు



గృహిణులను దేశ నిర్మాతలుగా గుర్తించాలని.. ఒకవేళ ఆమె అందించే గృహ సంరక్షణ సేవలను నష్టపోతే ద్రవ్య రూపంలో కనీసం నెలకు రూ.30 వేలుగా లెక్కగట్టాలని సుప్రీంకోర్టు వ్యాఖ్యానించింది. ఇంట్లో ఉండే గృహిణులు.. సంపాదించే వారిపై ఆధారపడి బతుకుతారనుకోవడం ముమ్మాటికీ తప్పేనని స్పష్టం చేసింది. ఓ రోడ్డు ప్రమాదంలో భార్యను కోల్పోయిన వ్యక్తి తమకు నష్ట పరిహారాన్ని పెంచాలంటూ సుప్రీంకోర్టును ఆశ్రయించగా.. జస్టిస్ సంజయ్ కరోల్, జస్టిస్ ఎన్.కోటీశ్వర్ సింగ్‌ల ధర్మాసనం విచారణ చేపట్టింది. గృహిణులు ఇంటి పనిచేస్తూ, కుటుంబ సభ్యులు, పిల్లలను చూసుకుంటూ దేశాభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తారని కోర్టు పేర్కొంది. 'సాధారణంగా సంపాదించే భర్త లేదా ఇతర కుటుంబ సభ్యులపై గృహిణులు ఆధారపడతారని సమాజం అనుకుంటుంది. కానీ.. వాస్తవానికి ఇల్లు సజావుగా నడవడం ఆమెపైనేఆధారపడి ఉంటుంది. అసలు దేశ నిర్మాతలు వారే. జీతం లేకుండా మహిళలు చేసే ఇంటి పనులు దేశ జీడీపీలో 15-17% వాటాకు సమానమనే అంచనాలున్నాయి' అని తెలిపింది. గృహిణి అందించే గృహ సంరక్షణ, సేవలకు నెలకు కనీసం రూ.30 వేలుగా పరిగణించి నష్ట పరిహారాన్ని లెక్కించాలని ఈ సందర్భంగా ఆదేశించింది. పంజాబ్‌కు చెందిన ఓ మహిళ 2001లో ఓ రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు. దీనిపై ఆమె భర్త, ముగ్గురు పిల్లలు మోటార్ యాక్సిడెంట్ క్లెయిమ్స్ ట్రిబ్యునల్‌ను ఆశ్రయించగా.. రూ.2.42 లక్షల పరిహారం ఇవ్వాలని ఆదేశించింది. ఆ తర్వాత పంజాబ్-హరియాణ హైకోర్టుకు వెళ్లగా.. పరిహారాన్ని రూ.8.43 లక్షలకు పెంచింది. అయినా తమకు న్యాయం జరగలేదని బాధితులు సుప్రీంకోర్టును ఆశ్రయించారు.

# అప్పీలుపై తీర్పుకు నాలుగు దశాబ్దాలా..?

## అలహాబాద్ హైకోర్టుపై సుప్రీంకోర్టు ఆగ్రహం..

ఒక హత్య కేసులో జీవిత ఖైదు శిక్ష పొందిన వ్యక్తి దాఖలు చేసిన అప్పీలుపై తీర్పు ఇవ్వడానికి అలహాబాద్ హైకోర్టు 40 ఏళ్లకు పైగా సమయం తీసుకోవడంపై సుప్రీంకోర్టు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసింది. ఈ సుదీర్ఘ ఆలస్యాలు కలవరపాటుకు గురి చేస్తున్నాయని, పేరుకుపోతున్న కేసులను పరిష్కరించేందుకు ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారని హైకోర్టును సుప్రీంకోర్టు ప్రశ్నించింది. ఉత్తర్‌ప్రదేశ్‌కు చెందిన విజయ్ సింగ్ 1983 నవంబర్‌లో తన తమ్ముడి హత్య కేసులో అరెస్టయ్యాడు. అప్పుడు విజయ్ వయసు 28 సంవత్సరాలు. ట్రయల్ కోర్టు అతడిని దోషిగా తేల్చి జీవిత ఖైదు విధించింది. ఈ తీర్పును సవాల్ చేస్తూ అతడు అలహాబాద్ హైకోర్టులో అప్పీలు చేశాడు. అయితే ఆ అప్పీలుపై తుది నిర్ణయం రావడానికి నాలుగు దశాబ్దాలకు పైగా సమయం పట్టింది. ఈ ఏడాది ఫిబ్రవరిలో అతడి అప్పీలును అలహాబాద్ హైకోర్టు కొట్టేసింది. ప్రస్తుతం ఈ కేసును సుప్రీంకోర్టు విచారిస్తోంది. మొత్తం ఈ 43 ఏళ్ల కాలంలో విజయ్ మూడు నెలలు మాత్రమే జైలులో ఉన్నాడు. మిగిలిన సమయం అంతా తన అప్పీలుపై తీర్పు కోసం ఎదురుచూస్తూ బయటే గడిపాడు. ప్రస్తుతం సుప్రీంకోర్టు విచారణ సమయంలో కూడా అతడికి బెయిల్ కొనసాగుతోంది. అప్పీలుపై విచారణ కోసం అలహాబాద్ హైకోర్టు ఏకంగా 41 ఏళ్ల సమయం తీసుకోవడంపై సుప్రీంకోర్టు ఆందోళన వ్యక్తం చేసింది.

# పెళ్లికి ముందు శారీరక బంధం.. 'క్యారెక్టర్'కు కొలమానం కాదు

## ఇద్దరు మేజర్ల ఇష్టపూర్వక బంధాన్ని ఏ చట్టమూ నిషేధించలేదు
## నిర్దోషిగా విముక్తి పొందినా ఉద్యోగాన్ని నిరాకరించడం ఏకపక్షమే
## తక్షణమే ఆ అభ్యర్థికి పోలీస్ కానిస్టేబుల్ ఉద్యోగం ఇవ్వండి
## తెలంగాణ యువకుడి కేసులో.. పోలీసు బోర్డుకు సుప్రీం ఆదేశం

పెళ్లికి ముందు ఇద్దరు మేజర్లు ఇష్టపూర్వకంగా శారీరక సంబంధం పెట్టుకోవడం వారి

'క్యారెక్టర్'కు కొలమానం కాదని సర్వోన్నత న్యాయస్థానం తేల్చిచెప్పింది. సమకాలీన సమాజంలో మారుతున్న సామాజిక వాస్తవాలను నియామక బోర్డులు గుర్తించాలని హితబోధ చేసింది. ప్రతి ప్రేమకథా పెళ్లితోనే ముగియాలని నియమమేమీ లేదని.. బంధం విఫలమైనంత మాత్రాన ఒకరు మరొకరిని మోసం చేసినట్లు కాదని స్పష్టం చేసింది. లోక్‌అదాలత్‌లో ఇరుపక్షాలు రాజీ పడినంత మాత్రాన.. దానిని నేరాంగీకారంగా (తప్పు చేశానని ఒప్పుకొన్నట్లుగా) భావించడం నియామక బోర్డు అజ్ఞానమేనని మందలించింది. ఒక విఫలమైన ప్రేమ వ్యవహారం నేపథ్యంలో నమోదైన క్రిమినల్ కేసు ఆధారంగా.. కానిస్టేబుల్‌గా ఒక అభ్యర్థి ఎంపికను రద్దు చేయడంపై సుప్రీంకోర్టు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసింది. సదరు అభ్యర్థికి తక్షణమే ఇవ్వాలని తెలంగాణ రాష్ట్ర స్థాయి పోలీస్ రిక్రూట్‌మెంట్ బోర్డును ఆదేశించింది. తెలంగాణకు చెందిన గాజుల తిరుపతి అనే వ్యక్తి పోలీస్ కానిస్టేబుల్ ఉద్యోగానికి సెలెక్ట్ అయ్యాడు. అయితే, గతంలో అతనిపై ఐపీసీ సెక్షన్లు 417, 420, 506 కింద ఒక క్రిమినల్ కేసు నమోదై ఉండటంతో రిక్రూట్‌మెంట్ బోర్డు అతని నియామకాన్ని రద్దు చేసింది. తిరుపతి తనను పెళ్లి చేసుకుంటానని నమ్మించి నాలుగేళ్లు తనతో బంధంలో ఉండి, ఆ తర్వాత వేరే అమ్మాయిని పెళ్లి చేసుకున్నాడని అతని ఇంటి పక్కన ఉండే యువతి 2014లో కేసు పెట్టింది. ఈ కేసుకు సంబంధించి 2015లో.. ఇద్దరి మధ్య లోక్ అదాలత్‌లో రాజీ కుదిరింది. ఉద్యోగానికి దరఖాస్తు చేసినప్పుడే తనపై ఉన్న ఈ కేసు వివరాలన్నింటినీ తిరుపతి అప్లికేషన్ ఫామ్‌లో నిజాయితీగా రాశాడు. ఏ విషయాన్నీ దాచలేదు. అయినా సరే, అతను మోసానికి పాల్పడ్డాడని రిక్రూట్‌మెంట్ బోర్డు అధికారులు భావించి, అతనిని పక్కన పెట్టేశారు. దీంతో అతను హైకోర్టును ఆశ్రయించగా.. సింగిల్ జడ్జి అనుకూలంగా తీర్పునిచ్చారు. ఆ తీర్పును పోలీస్ రిక్రూట్‌మెంట్ బోర్డు డివిజన్ బెంచ్‌లో సవాల్ చేసింది. డివిజన్ బెంచ్.. సింగిల్ జడ్జి తీర్పును తప్పుబట్టింది. బోర్డు నిర్ణయాన్ని సమర్థించింది. ఈ క్రమంలో తిరుపతి.. గత ఏడాది ఆగస్టు 20న సుప్రీంకోర్టును ఆశ్రయించాడు. జస్టిస్ మనోజ్‌మిశ్రా, జస్టిస్ మన్మోహన్‌లతో కూడిన ద్విసభ్య ధర్మాసనం ఇటీవలే ఈ పిటిషన్‌పై విచారణ జరిపింది. దీనికి సంబంధించిన తీర్పు ప్రతిని రిజిస్ట్రీ.. సుప్రీంకోర్టు అధికారిక వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేసింది.

ఈ తీర్పులో ధర్మాసనం పలు కీలక అంశాలను పొందుపరచింది. కేసుల నుంచి నిర్దోషిగా విడుదలైనప్పటికీ.. ఒక అభ్యర్థి ఉద్యోగానికి అర్హుడా? కాదా? అని చూసే హక్కు నియామక బోర్డులకు ఉంటుందని.. అలాగని ఆ నిర్ణయాలు ఇష్టారాజ్యంగా ఉండకూడదని స్పష్టం చేసింది. కేసు కొట్టేసినా లేదా రాజీ పడినా, సదరు అభ్యర్థి నిజంగానే తప్పు చేశాడని చెప్పడానికి బలమైన ఆధారాలు ఉండాలని స్పష్టం చేసింది. ఈ కేసులో తిరుపతి, ఆ

అమ్మాయి ఇద్దరూ మేజర్లని, పైగా నాలుగేళ్లుగా ప్రేమలో ఉన్నారని కోర్టు గుర్తు చేసింది. అతడిపై అత్యాచారం ఆరోపణలు లేవని, లోక్ అదాలత్‌లో వాళ్లు ఎవరి బలవంతం లేకుండానే రాజీ పడినట్లుగా అర్థమవుతోందని గుర్తుచేసింది. లోక్ అదాలత్‌లో రాజీ పడ్డారంటేనే తప్పు ఒప్పుకొన్నట్లు అని బోర్డు అనుకోవడం పూర్తిగా తప్పు అని ధర్మాసనం అభిప్రాయపడింది. మారుతున్న సామాజిక పరిస్థితులను నియామక బోర్డులు గుర్తించాలని సూచించింది. "ఇలాంటి పెళ్లికి ముందరి బంధాలు రానురానూ సర్వసాధారణంగా మారిపోతున్నాయి. పెళ్లికాని ఇద్దరు మేజర్లు ఇష్టపడి శారీరక సంబంధం పెట్టుకున్నంత మాత్రాన, వాళ్ల క్యారెక్టర్ మంచిది కాదనే తప్పుడు అంచనాకు రాకూడదు. ఇద్దరు మేజర్లు తమకు నచ్చిన బంధంలో ఉండటాన్ని దేశంలో ఏ చట్టమూ నిషేధించలేదు. అలాగే, ప్రతి ప్రేమ బంధమూపెళ్లితోనే ముగియాలనే నియమమేమీ లేదు. బ్రేకప్ అయినంత మాత్రాన ఒకరు ఇంకొకరిని మోసం చేశారని అనుకోలేం. తను మోసపోయానని చెప్పాల్సింది ఆ అమ్మాయే కదా? కానీ ఆమె కేసును ముందుకు తీసుకెళ్లకుండా రాజీ పడిపోయినప్పుడు ఇక మోసం జరిగిందని ఎలా అంటారు?" అని ధర్మాసనం ప్రశ్నించింది. గతంలో గొడవలు, హింసకు పాల్పడి కోర్టు బయట రాజీ పడిన వారికి ఉద్యోగాలు నిరాకరించిన సందర్భాలు ఉన్నాయని, కానీ ఇది అలాంటి కేసు కాదని గుర్తుచేసింది. ఇది ఇద్దరి మధ్య ఉన్న వ్యక్తిగత విషయమని, అమ్మాయే ఆరోపణలు వెనక్కి తీసుకున్నాక అసలు మోసం జరిగిందనడానికి సాక్ష్యమే లేదని వ్యాఖ్యానించింది. ఒక ఉద్యోగి నియామకాన్ని నిరాకరించే ముందు, నేరం జరిగిందనడానికి, ఆ నేరంతో అభ్యర్థికి సంబంధం ఉందనడానికి బలమైన ఆధారాలు ఉండాలని ధర్మాసనం స్పష్టం చేసింది. నియామక బోర్డు (స్క్రీనింగ్ కమిటీ) తీసుకున్న నిర్ణయం తప్పు అని తేల్చి చెప్పింది. అభ్యర్థి నియామకాన్ని రద్దు చేస్తూ హైకోర్టు డివిజన్ బెంచ్ ఇచ్చిన తీర్పును పక్కనబెట్టింది. సింగిల్ జడ్జి గతంలో ఇచ్చిన తీర్పును పునరుద్ధరిస్తూ, తక్షణమే సదరు అభ్యర్థికి కానిస్టేబుల్‌గా పోస్టింగ్ ఇవ్వాలని తెలంగాణ పోలీస్ రిక్రూట్‌మెంట్ బోర్డును ధర్మాసనం ఆదేశించింది.

# చిన్నారుల అక్రమ రవాణా అడ్డుకట్టకు సరోగసీ కేంద్రాలను నియంత్రించాల్సిందే

పిల్లల అక్రమ రవాణా నిరోధానికి సంబంధించిన కేసులో విచారణ చేపడుతున్న సుప్రీంకోర్టు.. సరోగసీ, ఐవీఎఫ్ కేంద్రాల నియంత్రణపై దృష్టి సారించింది. ఈ కేసులో అమికస్ క్యూరీగా వ్యవహరిస్తున్న సీనియర్ అడ్వకేట్ అపర్ణా భట్ చేసిన సూచనలను

పరిశీలించింది. మానవ అక్రమ రవాణాను నిరోధించేలా సరోగసీ, ఐవీఎఫ్ కేంద్రాల కోసం ప్రత్యేక మార్గదర్శకాలు (ఎస్ఓపీ) లేవని ఆమె ఈ సందర్భంగా కోర్టు దృష్టికి తీసుకెళ్లారు.

సరోగసీ, ఐవీఎఫ్ క్లినిక్స్ నియంత్రణ కోసం తీసుకొచ్చిన ఏఆర్టీ చట్టంలో అనేక నిబంధనలు ఉన్నప్పటికీ, చిన్నారుల అక్రమ రవాణాను అడ్డుకునేందుకు ప్రత్యేక ప్రోటోకాల్ లేదని అపర్ణా భట్ పేర్కొన్నారు. ప్రస్తుతం అమల్లో ఉన్న నిబంధనలు ప్రధానంగా వైద్య ప్రమాణాలు, మౌలిక వసతులకే పరిమితమయ్యాయని వివరించారు. ఈ నేపథ్యంలో నిబంధనలను మరింత కట్టుదిట్టం చేసేందుకు రిటైర్డ్ సుప్రీంకోర్టు న్యాయమూర్తి నేతృత్వంలో ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేయాలని సూచించారు. కమిటీ సూచనలతో సమగ్ర విధానాన్ని రూపొందించాలని ప్రతిపాదించారు. ఈ అంశంపై కేంద్ర ప్రభుత్వం తన అభిప్రాయాన్ని తెలియజేయాలని సుప్రీంకోర్టు ఆదేశించింది. తదుపరి విచారణను ఆగస్టు 19కి వాయిదా వేసింది.

## ఉన్నత విద్యను దాచిపెట్టి  ఉద్యోగం పొందితే చట్టవిరుద్ధం: సుప్రీం

తక్కువ స్థాయి విద్యార్హతలున్న కొలువులకు సంబంధించి, ఎక్కువ చదువుకున్న విషయాన్ని దాచిపెట్టి, ఉద్యోగాల్లో చేరితే అది చట్టవిరుద్ధమేనని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. ప్రత్యేకించి తక్కువ విద్యార్హతలున్నవారి కోసం ప్రకటించిన ఉద్యోగాలను ఎక్కువ విద్యార్హత ఉన్నవారు సంపాదిస్తే అది తక్కువ విద్యార్హతలున్న, నిరుపేద అభ్యర్థుల అవకాశాలను దెబ్బతీసినట్లే అవుతుందని పేర్కొంది. డిగ్రీ పాసైన ఓ యువకుడు, ఆ విషయాన్ని దాచిపెట్టి పదోక్లాసు మాత్రమే పాసయ్యానంటూ చెప్పి సిండికేట్ బ్యాంకులో తాత్కాలిక ప్రాతిపదికన అటెండర్ ఉద్యోగాన్ని సంపాదించాడు. గుర్తించిన బ్యాంకు అధికారులు, ఆ యువకుడిని ఉద్యోగం నుంచి తొలగించారు. దీనిపై ఆ యువకుడు మద్రాసు హైకోర్టును ఆశ్రయించగా అతడికి అక్కడ అనుకూలంగా తీర్పు వచ్చింది. దీన్ని తాజాగా జస్టిస్ హసానుద్దీన్ అమానుల్లా, జస్టిస్ ఆర్ మహదేవ్‌లతో కూడిన సుప్రీం ధర్మాసనం కొట్టివేసింది. సదరు ఉద్యోగిని తొలగిస్తూ బ్యాంకు మేనేజ్‌మెంట్ తీసుకున్న నిర్ణయాన్ని అత్యున్నత న్యాయస్థానం సమర్థించింది.. ఎక్కువ చదువుకున్నవారు, తక్కువ విద్యార్హతలున్న ఉద్యోగాల కోసం పోటీపడితే తక్కువగా చదువుకున్నవారికి అసలు అవకాశాలే దొరకవు అని ధర్మాసనం పేర్కొంది.

## నల్లగొండ శిశుగృహలో చిన్నారుల పరిస్థితిపై నివేదిక ఇవ్వండి తెలంగాణ హైకోర్టు ఆదేశం

అక్రమ దత్తత రాకెట్ నుంచి రక్షించి నల్లగొండ శిశుగృహలో ఉంచిన చిన్నారుల

పరిస్థితిపై నివేదిక సమర్పించాలని సూర్యాపేట, నల్లగొండ జిల్లాల లీగల్ సర్వీసెస్ అథారిటీ కార్యదర్శులకు హైకోర్టు ఆదేశాలు జారీచేసింది. అక్రమంగా దత్తత చేసుకున్నప్పటికీ ఓ పాపను తమకు ఇప్పించాలని కోరుతూ నల్గొండ మండలం చిన్న సూరారం గ్రామానికి చెందిన ముత్తినేని వెంకన్న దంపతులు చేస్తున్న న్యాయపోరాటంలో భాగంగా ఈ ఆదేశాలు ఇచ్చింది. వారి పిటిషన్‌ను గతంలో సింగిల్ జడ్జి కొట్టేయడంతో డివిజన్ బెంచ్‌ను ఆశ్రయించారు. దీనిపై చీఫ్ జస్టిస్ అపరేశ్‌కుమార్, జస్టిస్ మొహియుద్దీన్‌ల ధర్మాసనం విచారణ చేపట్టింది. మంగళవారం విచారణకు నల్లగొండ జిల్లా చైల్డ్ ప్రొటెక్షన్ ఆఫీసర్ కే గణేశ్ ప్రత్యక్షంగా హాజరై రికార్డులు సమర్పించారు. సోషల్ ఇన్వెస్టిగేషన్ రిపోర్ట్ సమాచారం సరిగా లేదని ధర్మాసనం అసహనం వ్యక్తం చేసింది. ఈ నేపథ్యంలో నల్లగొండ శిశుగృహలో ఉన్న చిన్నారుల పరిస్థితిపై నివేదిక ఇవ్వాలని నల్గొండ, సూర్యాపేట జిల్లాల లీగల్ సర్వీసెస్ అథారిటీ కార్యదర్శులకు ఆదేశాలు జారీచేసింది. తదుపరి విచారణను జూలై 8కి వాయిదా వేసింది.

# మానసిక జబ్బు పేరుతో సీరియల్ కిల్లర్‌పై జాలి చూపలేం

## ఉన్మాది ఆనంద్‌కుమార్ కేసులో సుప్రీం వ్యాఖ్యలు

జైలు నుంచి విడుదలైన వెంటనే విచక్షణ కోల్పోయి వరుస హత్యలకు పాల్పడే క్రూరత్వాన్ని 'బైపోలార్ డిజార్డర్' (మానసిక జబ్బు) సాకుతో సమర్థించుకోలేరని సుప్రీంకోర్టు తేల్చిచెప్పింది. ముగ్గురిని ఒకేసారి కిరాతకంగా హత్య చేసిన ఉన్మాది ఆనంద్ కుమార్ కేసు విచారణ సందర్భంగా ఘాటు వ్యాఖ్యలు చేసింది. నిందితుడిలో ఉన్మాద తీవ్రత స్పష్టంగా కనిపిస్తోందని పేర్కొంది. 'కిల్లింగ్ స్ప్రీ' (వరుస హత్యల పరంపర)ను తేలికగా తీసుకోలేమని స్పష్టం చేసింది. శిక్ష నుంచి మినహాయింపు ఇవ్వాలని కోరుతూ తూర్పుగోదావరి జిల్లాకు చెందిన ఏడిద ఆనంద్‌కుమార్ దాఖలు చేసిన పిటిషన్‌ను జస్టిస్ సతీష్ చంద్రశర్మ, జస్టిస్ సంజీవ్ సచ్‌దేవా ధర్మాసనం కొట్టివేసింది. పిటిషనర్ తరఫు న్యాయవాది వాదనలు వినిపిస్తూ.. ఆనంద్‌కుమార్ బుద్ధిపూర్వకంగా హత్యలు చేశాడా? మానసిక జబ్బు వల్ల చేశాడా? అనే దానిపై భిన్న అభిప్రాయాలు ఉన్నాయన్నారు. అతని శిక్షను రద్దు చేయాలని విజ్ఞప్తి చేశారు. దీనిపై ధర్మాసనం తీవ్రంగా స్పందిస్తూ 'అతను ఒక హత్య చేసి జైలుకు వెళ్లాడు. బయటకు రాగానే మరో ముగ్గురిని హత్య చేసి ఉన్మాదానికి పాల్పడ్డారు. ఇలాంటి

కేసుల్లో మనమూ అంతే కఠినంగా ఉండాలి. జాలికి అవకాశమే లేదు” అని వ్యాఖ్యానించింది. పిటిషనర్‌కు మానసిక జబ్బు ఉన్నట్లు మీరు ఆధారాలతో నిరూపించలేకపోయారని పేర్కొంది. ముగ్గురిని హత్య చేసినప్పుడు అతను ఎలాంటి చికిత్సలో లేడని వ్యాఖ్యానించింది. వాస్తవాలు తీవ్రంగా ఉన్నాయని, కోర్టులో వాదనలు వినిపిస్తున్నంత సాధారణ పరిస్థితి అక్కడి లేదని అర్థమవుతోందని తేల్చిచెప్పింది.

తూర్పుగోదావరి జిల్లా కోరుకొండ గ్రామానికి చెందిన ఆనంద్‌కుమార్ 2004లో జరిగిన ఓ హత్య కేసులో శిక్ష అనుభవించి, జైలు నుంచి విడుదలయ్యాడు. ముద్దాయి చిన్నతనంలోనే అతని ఒక అన్నయ్య, ఇద్దరు అక్కలు అనారోగ్యంతో చనిపోయారు. ఏడిద విజయ లలిత (వదిన), పొరుగువారైన గెడ్డం నాగభూషణం, ఖండవల్లి కుమారిలు చేసిన చేతబడి వల్లే వారు చనిపోయారని ముద్దాయికి అతని తల్లి చెప్పేది. దీంతో ఆనంద్ వారిపై పగ పెంచుకున్నాడు. ఈ క్రమంలో 2015 డిసెంబరు 24న ఇనుప పైపుతో తన అన్న కూతురిని కొట్టాడు. అడగడానికి వచ్చిన వదిన తలపై పైపుతో బాది హతమార్చాడు. కాపాడటానికి వచ్చిన ఇంటిపక్కనే ఉండే నాగభూషణంపైనా దాడి చేసి ప్రాణాలు తీశాడు. మరికొందరిని తీవ్రంగా గాయపరిచాడు. పక్క వీధిలో ఉండే కుమారి తలపైనా పైపుతో బలంగా కొట్టాడు. ఆమె ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మరణించింది. ఈ కేసును విచారించిన జిల్లా అదనపు కోర్టు 2017లో ముద్దాయికి జీవిత ఖైదు విధించింది. అయితే, తనకు ‘బైపోలార్ డిజార్డర్’ ఉందని, చట్టప్రకారం శిక్ష నుంచి మినహాయింపు ఇవ్వాలని ఆనంద్‌కుమార్ హైకోర్టును ఆశ్రయించాడు. విచారణ జరిపిన ధర్మాసనం.. ముద్దాయికి మానసిక దూకుడు ఉన్నప్పటికీ, తను ఏం చేస్తున్నాడనే పూర్తి స్పృహతో, ప్లాన్ ప్రకారమే ఈ హత్యలు చేశాడనే విషయం వైద్య సాక్ష్యాల ద్వారా స్పష్టమవుతోందని పేర్కొంది. సాంకేతిక కారణాల వల్ల ఐపీసీ సెక్షన్ 397ను తొలగించినప్పటికీ.. హత్య (సెక్షన్ 302), దాడి (సెక్షన్ 324) కింద జీవితఖైదు శిక్షను ఖరారు చేస్తూ తుది తీర్పునిచ్చింది. దీన్ని ఆనంద్ కుమార్ ఈ ఏడాది మే 25న సుప్రీంకోర్టులో సవాల్ చేశాడు.

# జడ్జీలు ప్రేక్షకులు కాదు.. న్యాయం జరిగేలా మార్గనిర్దేశం చేయాలి: మద్రాస్ హైకోర్టు

కోర్టు విచారణల నిర్వహణ తీరుపై మద్రాస్ హైకోర్టు సంచలన వ్యాఖ్యలు చేసింది. విచారణ సమయంలో న్యాయమూర్తులు కేవలం మౌనంగా ఉండే ‘స్ఫింక్స్’లా లా

కూర్చోకూడదని స్పష్టం చేసింది. ఆయా కేసుల విచారణలో న్యాయమూర్తులు చురుగ్గా పాల్గొనాలని, లాయర్లు వాదనలు వినిపిస్తున్నప్పుడు వారితో సంభాషణ జరపాలని హైకోర్టు పేర్కొంది. కేవలం వినడం మాత్రమే కాకుండా, అవసరమైన సందర్భాల్లో ప్రశ్నలు అడిగి స్పష్టత తీసుకోవడం న్యాయప్రక్రియలో ముఖ్యమని తెలిపింది.

న్యాయమూర్తులు ప్రేక్షకుల్లా కాకుండా, న్యాయం సాధనలో క్రియాశీలక పాత్ర పోషించాల్సిన అవసరం ఉందని మద్రాస్ హైకోర్టు అభిప్రాయపడింది. విచారణ సమయంలో జడ్జీలు ఎలాంటి హావభావాలు లేకుండా పూర్తిగా మౌనంగా ఉండటం సరైన పద్ధతి కాదని న్యాయస్థానం స్పష్టం చేసింది. 'స్ఫింక్స్'లా నిశ్శబ్దంగా కూర్చోవడం వల్ల కేసులోని వాస్తవాలు వెలుగులోకి రాకపోవచ్చని అభిప్రాయపడింది. లాయర్లు వాదనలు వినిపిస్తున్నప్పుడు న్యాయమూర్తులు చురుకుగా పాల్గొని, తమ సందేహాలను వెంటనే నివృత్తి చేసుకోవాలని న్యాయస్థానం సూచించింది. వాదనల సమయంలో న్యాయమూర్తులు, లాయర్ల మధ్య పరస్పర చర్చ ఉండాలని.. ఇది న్యాయవ్యవస్థలో కీలక భాగమని మద్రాస్ హైకోర్టు పేర్కొంది. ఇది కేసులోని నిజాలు స్పష్టంగా బయటకు రావడానికి సహాయపడుతుందని తెలిపింది. ఇరుపక్షాల వాదనలు వినడమే కాకుండా, న్యాయమూర్తులు తక్షణ ప్రశ్నల ద్వారా కేసును మరింత సమగ్రంగా అర్థం చేసుకోవాలని న్యాయస్థానం సూచించింది. మద్రాస్ హైకోర్టు వ్యాఖ్యలు ప్రస్తుతం న్యాయవర్గాల్లో ఆసక్తికర చర్చకు దారితీస్తున్నాయి. కోర్టు రూమ్ ప్రొసీడింగ్స్ ఎలా ఉండాలి, న్యాయమూర్తుల పాత్ర ఎంత క్రియాశీలంగా ఉండాలనే అంశంపై పలువురు భిన్నాభిప్రాయాలు వ్యక్తం చేస్తున్నారు. మొత్తంగా, న్యాయం త్వరగా, స్పష్టంగా జరిగేందుకు జడ్జీల యాక్టివ్ భాగస్వామ్యం అవసరమని హైకోర్టు ఇచ్చిన సందేశం ప్రాధాన్యం సంతరించుకుంది.

# మైనర్లతో శారీరక సంబంధం క్షమార్హం కాదు: కేరళ హైకోర్టు

టీనేజ్‌లో సాగే ప్రేమకథలు, మైనర్లతో కూడిన శారీరక సంబంధాలపై కేరళ హైకోర్టు కీలక తీర్పు వెలువరించింది. పరస్పర అంగీకారంతో ప్రేమించుకున్నప్పటికీ, మైనర్లతో లైంగిక సంబంధాలు పెట్టుకుంటే 'పోక్సో' చట్టం నుంచి ఎలాంటి మినహాయింపు లభించదని న్యాయస్థానం స్పష్టం చేసింది. అయితే, టీనేజర్ల మనస్తత్వం, ఆ వయసులో వచ్చే హార్మోన్ల మార్పులను పరిగణనలోకి తీసుకుంటూ.. నిందితుడి భవిష్యత్తు పూర్తిగా నాశనం

కాకూడదనే ఉద్దేశంతో శిక్షా కాలాన్ని తగ్గిస్తూ వినూత్న నిర్ణయం తీసుకుంది.

2017లో 19 ఏళ్ల ఒక యువకుడు, 14 ఏళ్ల మైనర్ బాలికను ప్రేమ పేరుతో తీసుకెళ్లాడు. ఈ కేసును విచారించిన ట్రయల్ కోర్టు సదరు యువకుడికి 10 ఏళ్ల కఠిన కారాగార శిక్ష విధించింది. దీనిపై నిందితుడు హైకోర్టును ఆశ్రయించగా, జస్టిస్ పీ.జీ. అజిత్‌కుమార్ నేతృత్వంలోని ధర్మాసనం ఈ కేసులో కీలక వ్యాఖ్యలు చేస్తూ తీర్పును వెలువరించింది. మైనర్ల 'అంగీకారానికి' చట్టబద్ధత లేదని చెప్పిన కోర్టు.. 'మేము ఇద్దరం ప్రేమించుకున్నాం.. ఇష్టపూర్వకంగానే కలిసున్నాం' అని చెబితే చట్టం ఒప్పుకోదని స్పష్టం చేసింది. చట్టం ప్రకారం మైనర్ల అంగీకారానికి ఎటువంటి చట్టబద్ధత లేదని, కాబట్టి అది కచ్చితంగా పోక్సో చట్టం కింద నేరమే అవుతుందని తేల్చి చెప్పింది. టీనేజ్‌లో ఉండే ఉడుకు రక్తం, శరీరంలో వచ్చే హార్మోన్ల మార్పుల వల్లే యువత విచక్షణ కోల్పోయి, ఆవేశంలో ఇలాంటి తప్పుడు నిర్ణయాలు తీసుకుంటుందని కోర్టు అభిప్రాయపడింది. ఇదే సందర్భంలో నిందితుడు ప్రొఫెషనల్ క్రిమినల్ కాదని కోర్టు గుర్తించింది. జైలు శిక్ష కారణంగా అతని జీవితం, భవిష్యత్తు పూర్తిగా నాశనం కాకూడదని భావించిన న్యాయస్థానం.. ట్రయల్ కోర్టు విధించిన 10 ఏళ్ల కఠిన కారాగార శిక్షను 4 ఏళ్లకు తగ్గిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది.

# 'ట్రాన్స్‌జెండర్ చట్టం' విచారణలపై సుప్రీం స్టే

ట్రాన్స్‌జెండర్ వ్యక్తుల (హక్కుల పరిరక్షణ) సవరణ చట్టం-2026లోని నిబంధనలను సవాల్ చేస్తూ వివిధ హైకోర్టుల్లో దాఖలైన పిటిషన్ల విచారణలపై సుప్రీంకోర్టు స్టే విధించింది. దేశంలోని వివిధ హైకోర్టుల్లో ఈ చట్టాన్ని సవాల్ చేస్తూ పెండింగ్‌లో ఉన్న అన్ని పిటిషన్లను ఏకీకృతం చేసి సుప్రీంకోర్టుకు బదిలీ చేయాలని కోరుతూ కేంద్రం దాఖలు చేసిన పిటిషన్‌ను విచారించడానికి సర్వోన్నత న్యాయస్థానం అంగీకరించింది. అంతకుముందు కేంద్రం తరఫున సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా వాదిస్తూ.. వేర్వేరు హైకోర్టులు ఈ అంశాన్ని విడివిడిగా విచారిస్తే భిన్నమైన లేదా పరస్పర విరుద్ధమైన తీర్పులు వచ్చే ప్రమాదముందని.. అందుకే అన్ని కేసులను సుప్రీంకోర్టుకే బదిలీ చేయాలని కోరారు. ట్రాన్స్‌జెండర్ వ్యక్తుల (హక్కుల పరిరక్షణ) సవరణ చట్టం-2026పై మానవ హక్కుల కార్యకర్తలు, ఎల్‌జీబీటీక్యూం కమ్యూనిటీ వర్గాలు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేస్తున్నాయి. సుప్రీంకోర్టు తన చారిత్రాత్మక నల్సా తీర్పులో సమర్థించిన 'లింగ స్వీయ గుర్తింపు' అనే నిబంధనను కొత్త చట్టంలో తొలగించడమే దీనికి కారణం.. కొత్త చట్టం మేరకు లింగ గుర్తింపు కోసం వైద్య లేదా పాలన పరమైన ధ్రువీకరణ తప్పనిసరి. అయితే ఇది తమ

గౌరవానికి, గోప్యతకు, శారీరక స్వేచ్ఛా హక్కులకు భంగం కలిగించడమేనని పిటిషనర్లు వాదిస్తున్నారు.

# తీవ్రమైన అక్రమాలకు పాల్పడితేనే ఉద్యోగం నుంచి తొలగించాలి: సుప్రీంకోర్టు

ఒక ఉద్యోగి తీవ్రమైన తప్పులు చేసినప్పుడు, అక్రమాలకు పాల్పడినప్పుడు మాత్రమే ఉద్యోగం నుంచి తొలగించడం సబబని సుప్రీంకోర్టు వ్యాఖ్యానించింది. డిస్మిస్ చేయడం అనేది ఒక ఉద్యోగి జీవితాన్ని రోడ్డున పడేసే అత్యంత కఠినమైన శిక్ష అని పేర్కొంది. తప్పు తీవ్రతతో పాటు సదరు ఉద్యోగి సుదీర్ఘ సర్వీసు, వయసు, సంస్థకు ఎలాంటి నష్టం వాటిల్లిందనే అంశాలను బేరీజు వేసుకున్నాకే నిర్ణయం తీసుకోవాలని సూచించింది. విచారణ పెండింగ్‌లో ఉన్న కాలంలో విధించే సస్పెన్షన్‌ను.. డిస్మిసల్‌తో పాటు అదనపు శిక్షగా మార్చడం ఎంతమాత్రం సరికాదని సుప్రీంకోర్టు తేల్చిచెప్పింది. 11 ఏళ్ల సుదీర్ఘ న్యాయపోరాటం తర్వాత మహారాష్ట్ర విద్యుత్తు పంపిణీ సంస్థకు చెందిన ఒక మహిళా ఉద్యోగికి ఊరటనిస్తూ కోర్టు ఈ కీలక ఉత్తర్వులు జారీ చేసింది. మహారాష్ట్ర విద్యుత్తు పంపిణీ సంస్థలో 1985లో సురేఖ ఉద్యోగంలో చేరారు. బదిలీల వ్యవహారంలో ఆ సంస్థపై ఆమె న్యాయపోరాటం చేసి గెలిచారు. దీనికి కక్ష సాధింపుగా సంస్థ ఆమెపై అంతర్గత విచారణ జరిపి, 2006లో సస్పెండ్ చేసింది. 2017లో ఆమెను ఉద్యోగం నుంచి తొలగించింది. పైగా, 11 ఏళ్ల సస్పెన్షన్ కాలాన్ని కూడా శిక్షగా మారుస్తూ ఆమెకు రావాల్సిన ఆర్థిక ప్రయోజనాలను నిలిపివేసింది. దీనిపై సురేఖ సుప్రీంకోర్టును ఆశ్రయించారు. ఆ పిటిషన్‌పై సుధీర్ఘ విచారణ అనంతరం ధర్మాసనం కీలక తీర్పునిచ్చింది. అవినీతికి, అధికారుల మాట వినకపోవడానికి మధ్య ఎంతో వ్యత్యాసం ఉందని న్యాయస్థానం గుర్తు చేసింది. బాధితురాలిపై వచ్చిన ఆరోపణలు కేవలం క్రమశిక్షణా రాహిత్యానికి సంబంధించినవేనని.. అవినీతి, లంచగొండితనం, నిధుల దుర్వినియోగం లాంటి తీవ్రమైన నేరాలు కావని కోర్టు అభిప్రాయపడింది. అందువల్ల ఉద్యోగం నుంచి తీసేయడం ఘోరమైన శిక్ష అవుతుందని పేర్కొంది. అలాగే, దాదాపు 11 ఏళ్ల పాటు ఉన్న సస్పెన్షన్ కాలాన్ని అదనపు శిక్షగా పరిగణించడాన్ని తప్పుబట్టింది. సర్వీస్ రూల్స్ అనుమతిస్తే తప్ప, ఒకే తప్పునకు రెండు వేర్వేరు శిక్షలను కలిపి ఇవ్వడానికి వీల్లేదంది. ఈ సస్పెన్షన్ కాలాన్ని మొదటి 6నెలలు, ఆ తర్వాత మిగిలిన 10.4 ఏళ్లుగా విభజించి.. ఆమెకు అందాల్సిన ఆర్థిక ప్రయోజనాలను చెల్లించాలని ధర్మాసనం ఆదేశించింది.

# బాధ్యతలు విస్మరించిన తల్లికి కుమారుడి సంరక్షణకు అనర్హురాలు

### బాలుడి కస్టడీ వివాదంపై పుణె కోర్టు

ఓ చిన్నారి కస్టడీ కేసులో పుణె కోర్టు సంచలన తీర్పునిచ్చింది. భర్త విషయంలో బాధ్యతలు విస్మరించిన భార్య తన పిల్లల సంరక్షణకు అనర్హురాలంటూ కోర్టు అభిప్రాయపడింది. ఈ సందర్భంగా తల్లి వద్ద ఉంటే పిల్లాడి భవిష్యత్తు సురక్షితం కాదని స్పష్టం చేసింది. ఈ మేరకు తల్లికి షాక్ ఇస్తూ చిన్నారి కస్టడీని తండ్రికి అప్పగిస్తూ ఆదేశాలు జారీ చేసింది. ఈ సందర్భంగా పిల్లల సంరక్షణ విషయంలో కేవలం 'తల్లి' అనే హోదా ఒక్కటే సరిపోదని న్యాయస్థానం వ్యాఖ్యానించింది. భర్త, అత్తమామల పట్ల క్రూరంగా ప్రవర్తించే వివాహితకు పిల్లలను కస్టడీ ఇవ్వలేమని పేర్కొంది. వైవాహిక బాధ్యతలను, కుటుంబ విధులను పూర్తిగా విస్మరించిన మహిళ.. బాధ్యతారహిత ప్రవర్తన బాలుడి మానసిక ఎదుగుదలపై ప్రభావం చూపుతుందని కోర్టు అభిప్రాయపడింది. చట్టం ప్రకారం పిల్లల సర్వతోముఖాభివృద్ధే అత్యంత ముఖ్యమైన విషయమని చెప్పుకొచ్చింది. నిరంతరం గొడవలు పెట్టుకునే వాతావరణంలో చిన్నారులు సురక్షితంగా పెరగలేరని తెలిపింది. ఈ మేరకు అన్ని ఆధారాలను పరిశీలించిన తర్వాత బాలుడి సంరక్షణ బాధ్యతను తండ్రికి అప్పగించింది. తల్లికి కస్టడీ నిరాకరిస్తూ కేవలం నిర్ణీత సమయాల్లో మాత్రమే కుమారుడిని చూసుకునేందుకు అనుమతినిచ్చింది. ఈ సందర్భంగా పిల్లలను భాగస్వామిపై పగ తీర్చుకోవడానికి ఆయుధాలుగా వాడుకోలేరంటూ పుణె న్యాయస్థానం వ్యాఖ్యానించింది.

# బాలికపై అత్యాచారం కేసులో ముద్దాయికి జీవిత ఖైదు

బాలికపై లైంగిక దాడి కేసులో ముద్దాయికి జీవిత ఖైదుతో పాటు రూ.50 వేలు జరిమానా విధిస్తూ పోక్సో న్యాయస్థానం తీర్పు చెప్పింది. కేసుకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. 2022వ సంవత్సరంలో కంచరపాలెం పోలీసులకు ఫిర్యాదీ తెలిపిన వివరాల ప్రకారం... ఐదో తరగతి చదువుతున్న తన పదకొండేళ్ల కుమార్తెతో ఆమె ఇంటికి సమీపానున్న బంధువుల ఇంట్లో ఫంక్షన్‌కు వెళ్లింది. దుస్తులపై రంగు నీళ్లు పడడంతో శుభ్రం చేసుకునేందుకు బాలిక ఇంటికి వెళ్లింది. ఆ సమయంలో వరుసకు బాబాయి అయ్యే వ్యక్తి ఇంట్లో చొరబడి బాలికపై అత్యాచారానికి పాల్పడ్డాడు. బాలిక సోదరుడు రావడంతో నిందితుడు అక్కడ నుంచి పరారయ్యాడు. జరిగిన విషయం బాలిక తన తల్లికి చెప్పగా

పోలీసులకు అందిన ఫిర్యాదు మేరకు కేసును నమోదు చేశారు. నేరం రుజువు కావడంతో ముద్దాయికి జీవిత ఖైదుతో పాటు రూ.50 వేలు జరిమానా విధిస్తూ పోక్సో న్యాయస్థానం జడ్జి తీర్పు చెప్పారు. బాధితురాలికి ప్రభుత్వం రూ.2 లక్షలు నష్టపరిహారంగా అందించాలని తీర్పులో పేర్కొన్నారు.

# విడాకులకు 'కూలింగ్ పీరియడ్' తప్పనిసరి కాదు

## రాజీకి అవకాశం లేకుంటే ఆ సెక్షన్‌ను మినహాయించవచ్చు

## ఆంధ్రప్రదేశ్ హైకోర్టు స్పష్టీకరణ

విడాకుల మంజూరు విషయంలో ఓ కేసు విచారణ సందర్భంగా హైకోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. వైవాహిక జీవితంలో తలెత్తిన వివాదాలను పరిష్కరించుకొని తిరిగి కలిసి జీవించలేమని భార్యాభర్తలు నిర్ణయానికి వచ్చి, పరస్పర అంగీకారంతో విడాకులు కోరుతున్నప్పుడు ఆరు నెలలు కాలం (కూలింగ్ పీరియడ్) వేచి ఉండాల్సిన అవసరం లేదని స్పష్టం చేసింది. ఇరుపక్షాల మధ్య వివాదాలను పరిష్కరించుకున్నారని, రాజీకి అవకాశం లేదని కోర్టు సంతృప్తి చెందితే కూలింగ్ పీరియడ్‌ను మినహాయించవచ్చని సుప్రీంకోర్టు పలు తీర్పుల్లో స్పష్టం చేసిందని గుర్తుచేసింది. భార్యా భర్తలు తమ నిర్ణయాన్ని పునఃసమీక్షించుకొని, తిరిగి కలిసి ఉండే అవకాశాలను అన్వేషించడానికి సహేతుక సమయం ఇవ్వడమే హిందూ వివాహ చట్టంలోని సెక్షన్ 13(బి)(2) ముఖ్య ఉద్దేశమని పేర్కొంది. దంపతులు చాలాకాలం నుండి వేర్వేరుగా ఉంటూ, సమస్యలన్నీ పరిష్కరించుకొని విడిపోవాలని నిర్ణయించుకున్నప్పుడు.. కూలింగ్ పీరియడ్ విధించడం వల్ల ఇరుపక్షాల మధ్య మానసిక వేదన మరింత పెరగడమే తప్ప, ఎలాంటి ప్రయోజనం ఉండదని పేర్కొంది. కూలింగ్ పీరియడ్ గడువు ముగియక ముందే విడాకులు మంజూరుపై విచారణ జరపాలన్న పిటిషనర్ల అభ్యర్థనను నిరాకరిస్తూ ఒంగోలు ఫ్యామిలీ కోర్టు ఇచ్చిన ఉత్తర్వులను రద్దు చేసింది. వారి పిటిషన్‌ను స్వీకరించి, విడాకుల మంజూరు ప్రక్రియను సాధ్యమైనంత త్వరగా పూర్తి చేయాలని ఫ్యామిలీ కోర్టును ఆదేశించింది. ఈ మేరకు న్యాయమూర్తి జస్టిస్ నిమ్మగడ్డ వెంకటేశ్వర్లు ఇటీవల తీర్పు ఇచ్చారు. ప్రకాశం జిల్లా ఒంగోలుకు చెందిన దంపతులు పరస్పర అంగీకారంతో విడాకులు కోరుతూ ఈ ఏడాది

జనవరిలో స్థానిక ఫ్యామిలీ కోర్టులో దరఖాస్తు చేశారు. విచారణ జరిపిన కోర్టు నిర్ణయం వెల్లడించేందుకు ఆర్నెల్ల 'కూలింగ్ పీరియడ్' విధిస్తూ వాయిదా వేసింది. అయితే ఇరుపక్షాల మధ్య ఆస్తి పంపిణీ, కుమార్తె సంరక్షణ, శాశ్వత భరణం చెల్లింపు, భర్తపై పెట్టిన క్రిమినల్ కేసు ఉపసంహరణ తదితర అం శాల్లో ఒప్పందం కుదిరిన నేపథ్యంలో విడాకుల కేసు విచారణను ముందుకు జరపాలని అనుబంధ పిటిషన్ వేశారు. అయితే కూలింగ్ పీరియడ్ తప్పనిసరని స్పష్టం చేస్తూ ఫ్యామిలీ కోర్టు ఆ పిటిషన్‌ను కొట్టివేసిం ది. ఈ ఉత్తర్వులను సవాల్ చేస్తూ దంపతులు హైకోర్టులో క్రిమినల్ రివిజన్ పిటిషన్ వేశారు. భార్యాభర్తలు విడిపోవాలని నిర్ణయించుకొని, వారి మధ్య సమస్యలన్నింటినీ పరిష్కరించుకున్నప్పుడు.. కూలింగ్ పీరియడ్‌ను మినహాయించే విచక్షణాధికారం కోర్టులకు ఉందని వారి తరపు న్యాయవాది అయేషా అజ్మ వాదించారు. దీన్ని పరిగణనలోకి తీసుకున్న న్యాయమూర్తి.. హిందూ వివాహ చట్టంలోని సెక్షన్ 13(బి)(2) ప్రకారం కూలింగ్ పీరియడ్ తప్పనిసరి కాదని, అది కేవలం సూచనాత్మకమైనదని సుప్రీంకోర్టు పలు తీర్పుల్లో స్పష్టం చేసిందని గుర్తుచేశారు. ప్రస్తుత కేసులో ఇరుపక్షాల మధ్య జరిగిన వివాదాల పరిష్కారం స్వచ్ఛందంగా జరిగినట్లు స్పష్టవుతోందన్నారు. ఈ నేపథ్యంలో ఒంగోలు ఫ్యామిలీ కోర్టు ఇచ్చిన ఉత్తర్వులను రద్దు చేస్తున్నట్లు ప్రకటించారు.

# బాలికపై అత్యాచారం కేసులో కరాటే మాస్టర్‌కు 20 ఏళ్ల జైలు

## సాక్ష్యాల తారుమారుకు యత్నించిన మహిళా ప్రిన్సిపల్‌కు మూడేళ్ల జైలు

మూడేళ్ల బాలికపై లైంగికదాడికి పాల్పడ్డ యువకుడికి రాజేంద్రనగర్ పోక్సో కోర్టు 20ఏళ్ల జైలు శిక్ష, రూ.20వేల జరిమానా విధించింది. ఈ మేరకు కోర్టు న్యాయమూర్తి టి. శ్రీనివాస్ తీర్పునిచ్చారు. 2019లో జరిగిన ఈ ఘటనకు సంబంధించి వెలువరించిన తీర్పు వివరాలను గురువారం స్పెషల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ బి వెంకటేశ్వర్ రెడ్డి వెల్లడించారు. మియాపూర్ దీప్తి శ్రీనగర్‌కు చెందిన కుర్ర కిరణ్ సాయి (24) స్థానికంగా ఓ ప్లే స్కూల్‌లో జిమ్నాస్టిక్స్ అండ్ కరాటే కోచ్‌గా పనిచేస్తున్నాడు. అదే ప్లే స్కూల్‌లో చేరిన మూడున్నరేళ్ల

చిన్నారికి మాయమాటలు చెప్పి బిల్డింగ్‌పైకి తీసుకెళ్లాడు. జిమ్నాస్టిక్ రూమ్‌లో బాలికపై లైంగిక దాడికి పాల్పడ్డాడు. పాప బిగ్గరగా ఏడవడంతో అక్కడి నుంచి తీసుకొచ్చి వదిలేసి పరారయ్యాడు. ఆ తర్వాత ఇంటికి వెళ్లిన చిన్నారి తాను స్కూల్‌కు వెళ్లనంటూ మారాం చేసింది. తనపై జరిగిన దారుణాన్ని వాళ్ల అమ్మమ్మతో బాలిక చెప్పడంతో ఘటన వెలుగులోకొచ్చింది. ఈ విషయమ్మీద పాప తల్లిదండ్రులు స్కూల్‌కు వెళ్లి ప్రిన్సిపల్ దీపికను నిలదీయగా అలాంటిదేమీ జరగలేదని బుకాయించింది. కరాటే మాస్టర్ చేసిన తప్పు తెలిసి కూడా విషయం దాచిపెట్టింది.

దాంతో బాధితులు పోలీసులకు పిర్యాదు చేశాడు. రంగంలోకి దిగిన పోలీసులు నిందితుడిని అరెస్టు చేశారు. విచారణలో ప్రిన్సిపల్‌కు అన్ని తెలిసీ సాక్ష్యాధారాలను తారుమారు చేసేందుకు ప్రయత్నించిందని గుర్తించారు. చార్జిషీట్ ఫైల్ చేసిన పోలీసులు న్యాయస్థానానికి సమర్పించారు. రాజేంద్రనగర్ పోక్సో న్యాయస్థానంలో కేసు బుధవారం విచారణకు రావడంతో సాక్ష్యాధారాలను, కేసు పూర్వాపరాలను పరిశీలించిన న్యాయమూర్తి, నిందితుడు కిరణ్ సాయిని దోషిగా నిర్ధారించి తీర్పు వెలువరించారు. బాలిక కుటుంబానికి రూ. 3 లక్షలు నష్ట పరిహారం ఇవ్వాలని న్యాయమూర్తి తీర్పునిచ్చారని పబ్లిక్ ప్రాసిక్యూటర్ వెంకటేశ్వర్‌రెడ్డి తెలిపారు.

# వ్యక్తిగత లబ్ధి కోసం ఆర్‌టిఐని వాడుకుంటే జైలుకే




సమాచార హక్కు చట్టం (ఆర్‌టిఐ యాక్ట్) ప్రాథమిక ఉద్దేశాన్ని పక్కనబెట్టి, కొందరు దీనిని కేవలం బ్లాక్‌మెయిలింగ్‌కు, వ్యక్తిగత లబ్ధికి సాధనంగా వాడుకుంటుండటంపై దేశ అత్యున్నత న్యాయస్థానం సుప్రీంకోర్టు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. పారదర్శకత, జవాబుదారీతనం కోసం తీసుకొచ్చిన ఈ చట్టాన్ని స్వార్థ ప్రయోజనాల కోసం దుర్వినియోగం చేసే వారిపై కఠిన చర్యలు తప్పవని న్యాయస్థానం

హెచ్చరించింది. తాను ఒక ఆర్‌టీఐ కార్యకర్తను అని చెప్పుకుంటూ, అధికారులను, ప్రైవేటు వ్యక్తులను భయభ్రాంతులకు గురిచేసి డబ్బులు వసూలు చేస్తున్నాడనే తీవ్రమైన బ్లాక్‌మెయిలింగ్ ఆరోపణలు ఎదుర్కొంటున్న ఒక వ్యక్తి దాఖలు చేసిన పిటిషన్‌ను న్యాయస్థానం పూర్తిగా తోసిపుచ్చింది. అంతేకాకుండా సదరు నకిలీ కార్యకర్తకు ముందస్తు బెయిల్ ఇచ్చేందుకు కూడా అత్యున్నత న్యాయస్థానం ఖరాకండిగా నిరాకరించింది. ఈ సందర్భంగా సుప్రీంకోర్టు ధర్మాసనం కీలక వ్యాఖ్యలు చేస్తూ.. సమాజంలో నిజాయితీ గల ఆర్‌టీఐ కార్యకర్తలు వ్యవస్థలోని లోపాలను ఎండగడుతుంటే, కొందరు మాత్రం 'ఆర్టీఐ' అనే ముసుగు వేసుకుని సమాంతర దోపిడీ వ్యవస్థను నడుపుతున్నారని ఆందోళన వ్యక్తం చేసింది. ఇలాంటి అక్రమార్కుల వల్ల చట్టం యొక్క పవిత్రత దెబ్బతినడమే కాకుండా, నిజమైన సామాజిక కార్యకర్తల ప్రతిష్ట కూడా మసకబారుతోందని కోర్టు అభిప్రాయపడింది. ప్రభుత్వ కార్యాలయాల నుండి సమాచారాన్ని సేకరించి, ఆపై లోపాలను సాకుగా చూపిస్తూ బెదిరింపులకు పాల్పడే సంస్కృతి పెరిగిపోతోందని, దీనికి అడ్డుకట్ట వేయాల్సిన బాధ్యత దర్యాప్తు సంస్థలపై ఉందంది. వ్యక్తిగత ప్రయోజనాలు లేదా కక్షసాధింపు చర్యల కోసం దాఖలయ్యే పిటిషన్లను ప్రజా ప్రయోజన వ్యాజ్యాలుగా భావించలేమని స్పష్టం చేస్తూ, చట్టాన్ని దుర్వినియోగం చేసే బ్లాక్‌మెయిలర్ల పట్ల ఎలాంటి సానుభూతి చూపబోమని సుప్రీంకోర్టు ఈ తీర్పు ద్వారా గట్టి సందేశాన్ని ఇచ్చింది.

# బాల్యవివాహాల నిరోధానికి పెళ్లి కార్డులపై వధూవరుల పుట్టినతేదీలు

## మహారాష్ట్ర ప్రభుత్వం సంచలన నిర్ణయం



బాల్య వివాహాలను సమర్థవంతంగా అరికట్టేందుకు మహారాష్ట్ర ప్రభుత్వం సరికొత్త నిబంధనను తీసుకురావాలని పరిశీలిస్తోంది. ఇకపై రాష్ట్రంలో జరిగే ప్రతి వివాహానికి సంబంధించి, పెళ్లి పత్రికలపై వధూవరుల పుట్టిన తేదీలను తప్పనిసరిగా ముద్రించేలా కొత్త రూల్ తీసుకురావాలని ప్రభుత్వం యోచిస్తోందని మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి అదితి తత్కరే అధికారికంగా వెల్లడించారు. ఈ కొత్త నిబంధన ద్వారా బాల్య వివాహాల రేటును రాబోయే ఐదేళ్లలో 10 శాతానికి దిగువకు తీసుకురావాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. ఈ వినూత్నమైన ఆలోచనను అమలు చేయడానికి మహారాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే రాజస్థాన్ రాష్ట్ర నమూనాను అధ్యయనం చేస్తోందని మంత్రి తెలిపారు. రాజస్థాన్‌లో ఇప్పటికే పెళ్లి పత్రికలపై వధూవరుల పుట్టిన తేదీలను ముద్రించే విధానం అమల్లో ఉంది, దీనివల్ల వధూవరుల వయసు అందరికీ స్పష్టంగా తెలిసిపోతుంది. ఇలా పుట్టిన తేదీలను కచ్చితంగా పత్రికలపై ముద్రిస్తే గ్రామీణ స్థాయిలో దొంగ సర్టిఫికెట్లతో లేదా వయసు దాచిపెట్టి చేసే బాల్య వివాహాలకు చాలా వరకు అడ్డుకట్ట వేయవచ్చని అధికారులు బలంగా భావిస్తున్నారు. రాజస్థాన్ ప్రభుత్వం ఈ విధానాన్ని ఎలా అమలు చేస్తోందో అధ్యయనం చేసి, అవసరమైన న్యాయ సలహాలు తీసుకుని మహారాష్ట్రలో కూడా ఈ రూల్‌ను కఠినంగా అమలు చేయాలని ప్రభుత్వం యోచిస్తోంది. బాల్య వివాహాలు అనేది కేవలం ఒక్క రాష్ట్రానికే పరిమితమైన సమస్య కాదు, దేశవ్యాప్తంగా చాలా ప్రాంతాల్లో ఇంకా ఈ దురాచారం కొనసాగుతూనే ఉంది. మహారాష్ట్ర ప్రభుత్వం తీసుకోబోతున్న ఈ సాహసోపేతమైన నిర్ణయం పట్ల దేశవ్యాప్తంగా సానుకూల స్పందన వ్యక్తమవుతోంది.




# గిగ్, డెలివరీ రంగాల్లోకి తెలంగాణ మహిళలు

## 'స్త్రీ రైడ్' కార్యక్రమాన్ని ప్రారంభించిన డీజీపీ సీవీ ఆనంద్

## తొలి విడతలో 55 మందికి డ్రైవింగ్ శిక్షణ, ఉపాధి కల్పన

## ఈ-బైక్, ఈ-ఆటోల పంపిణీ


గిగ్, డెలివరీ రంగాల్లో హైదరాబాద్‌లో ఇకపై మహిళలు కూడా కనిపించనున్నారు. రవాణా, డెలివరీ రంగాల్లో మహిళల ప్రాతినిధ్యాన్ని పెంచేందుకు రాష్ట్ర మహిళా భద్రతా విభాగం, రవాణా శాఖ సంయుక్తంగా "స్త్రీ రైడ్" అనే కార్యక్రమాన్ని చేపట్టాయి. మహిళలకు వాహనాలు నడపడం నేర్పించి వారికి స్వయం ఉపాధి కల్పించడమే లక్ష్యంగా చేపట్టిన ఈ స్త్రీ రైడ్ ప్రాజెక్టును రాష్ట్ర డీజీపీ సీవీ ఆనంద్ ప్రారంభించారు. డీజీపీ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో 55 మంది మహిళలకు ఈ- బైక్, ఈ- ఆటోలను అందజేశారు. మహిళల ఉపాధి, సాధికారతకు ప్రభుత్వం పూర్తిస్థాయి మద్దతిస్తుందని డీజీపీ ఆనంద్ స్పష్టం చేశారు. మహిళా రైడర్లు ఇకపై స్విగ్గి, జోమాటో లాంటి ఫుడ్ డెలివరి ప్లాట్‌ఫామ్స్‌లో పని చేస్తారని తెలిపారు. నాలుగు నెలల్లో వీరి సంఖ్యను మూడు రెట్లు




పెంచాలని లక్ష్యంగా పెట్టుకున్నామని చెప్పారు. గిగ్ వర్కర్లు అంటే ఇన్నాళ్లూ పురుషులే ఉండేవారని ఇప్పుడు ఈ రంగంలోకి మహిళలు కూడా ప్రవేశించారని ఆనంద్ పేర్కొన్నారు. రవాణా, డెలివరీ రంగాల్లో మహిళలకు ఉపాధి కల్పించే క్రమంలో మహిళల నుంచి డ్రైవర్లుగా ఉండటానికి గతంలో దరఖాస్తులు ఆహ్వానించామన్నారు. అందులో ఎంపిక చేసిన 55 మందికి డ్రైవింగ్ శిక్షణ ఇచ్చి లైసెన్సులు ఇప్పించామని వివరించారు. భవిష్యత్తులో తెలంగాణ అంతటా లాజిస్టిక్, కార్గో, డెలివరీ సర్వీసులలో మహిళా డ్రైవర్లుకు అవకాశం ఇస్తామని చెప్పారు. గతంలో హైదరాబాద్‌లో లా అండ్ ఆర్డర్ పోలీసు స్టేషన్‌లో ఒక్క మహిళా ఎస్‌హెచ్‌ఓ కూడా ఉండేవారు కాదని, తాను హైదరాబాద్ సీపీగా బాధ్యతలు తీసుకున్న తర్వాత మహిళా ఇన్‌స్పెక్టర్లను పోలీసు స్టేషన్లకు ఎస్‌హెచ్‌ఓలుగా నియమించానని సీపీ ఆనంద్ వివరించారు. కార్యక్రమంలో మహిళా భద్రతా విభాగం డీజీ చారుసిన్హా. శాంతి భద్రతల విభాగం డీజీపీ మహేష్ భగవత్, ఎస్‌పీఎఫ్ డీజీపీ స్వాతి లక్రా ఇతర అధికారులు పాల్గొన్నారు.







# 15 ఏళ్లు దాటితేనే సోషల్ మీడియాకు అనుమతి

## యూఏఈ కీలక నిర్ణయం

పిల్లలకు సోషల్ మీడియాను అనుమతించే విషయంలో యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ (UAE) కీలక నిర్ణయం తీసుకుంది. సోషల్ మీడియా వినియోగానికి కనీస వయసును 15 సంవత్సరాలుగా నిర్ణయిస్తూ కొత్త నిబంధనను అమల్లోకి తీసుకువచ్చింది. ఈ నిబంధనను అమలు చేసిన తొలి అరబ్ దేశంగా యూఏఈ నిలిచింది. కొత్త నిబంధనల ప్రకారం 15 ఏళ్లలోపు పిల్లలు వ్యక్తిగత సోషల్ మీడియా ఖాతాలను సృష్టించుకోవడం, నిర్వహించడం లేదా వాటిలో పోస్టులు చేయడం, కామెంట్లు పెట్టడం, గ్రూపుల్లో చేరడం వంటి కార్యకలాపాలు చేయలేరు. పిల్లలను ఆన్‌లైన్ ప్రమాదాల నుంచి రక్షించడమే ఈ చర్యల ప్రధాన ఉద్దేశమని యూఏఈ ప్రభుత్వం తెలిపింది. ఈ నిబంధనలు యూఏఈలో కార్యకలాపాలు నిర్వహిస్తున్న అన్ని సోషల్ మీడియా సంస్థలకు వర్తిస్తాయి. వయస్సు

నిర్ధారణ కోసం డిజిటల్ ఐడీలు, ఏఐ ఆధారిత ధ్రువీకరణ వ్యవస్థలను ఉపయోగించాలని ప్రభుత్వం ఆదేశించింది. కేవలం వినియోగదారులు చెప్పే వయస్సును మాత్రమే ఆధారంగా తీసుకోవడం ఇకపై కుదరదని స్పష్టం చేసింది. ప్రపంచవ్యాప్తంగా పిల్లల మానసిక ఆరోగ్యం, సోషల్ మీడియా వినియోగంపై ఆందోళనలు పెరుగుతున్న నేపథ్యంలో ఇప్పటికే పలు దేశాలు ఇలాంటి నిర్ణయాలు తీసుకున్నాయి. ఆస్ట్రేలియా, బ్రిటన్, మలేసియా తదితర దేశాలు కూడా చిన్నారుల సోషల్ మీడియా వినియోగంపై కఠిన నిబంధనలను అమలు చేస్తున్నాయి. మరికొన్ని దేశాలు ఈ దిశగా అడుగులు వేసేందుకు సిద్ధమవుతున్నాయి.

## వచ్చే ఏడాది నుంచి బ్రిటన్‌లోనూ అమలు

పిల్లలను సోషల్ మీడియాలోని హానికరమైన కంటెంట్ నుంచి రక్షించేందుకు బ్రిటన్ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. 16 ఏళ్లలోపు పిల్లలు సోషల్ మీడియా యాప్స్ ఉపయోగించకుండా త్వరలో నిషేధం విధించనున్నట్లు ప్రధాని కీర్ స్టార్మర్ ప్రకటించారు. ఒక దేశ ప్రధానిగా, తండ్రిగా పిల్లల ఆరోగ్యం, సంతోషం కోసం ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. ప్రపంచంలోనే అత్యంత శక్తిమంతమైన టెక్ కంపెనీలను నియంత్రించడం అంత సులభం కాదని, కానీ సమాజ హితం కోసం ఈ మార్పు అవసరమని స్పష్టం చేశారు. వచ్చే ఏడాది వేసవి కాలం నాటికి ఈ చట్టాన్ని అమలులోకి తీసుకురానున్నట్లు ఆయన వెల్లడించారు. కొత్త నిబంధనల ప్రకారం.. వాట్సాప్ వంటి పర్సనల్ మెసేజింగ్ యాప్‌లకు ఈ నిషేధం నుంచి మినహాయింపు ఇవ్వనున్నారు. అయితే, అపరిచితులు సులభంగా పిల్లలను కాంటాక్ట్ చేసే అవకాశం ఉన్న ఆన్‌లైన్ గేమింగ్ సర్వీసులు, లైవ్ స్ట్రీమింగ్ ప్లాట్‌ఫారమ్‌లపై మాత్రం కచ్చితమైన వయస్సు ధ్రువీకరణ విధానాన్ని తీసుకురానున్నారు.



# బీహార్‌లో మహిళపై సామూహిక అత్యాచారం

బీహార్‌లోని బెగుసరాయ్‌లో దారుణ ఘటన వెలుగు చూసింది. సభ్య సమాజం తలదించుకునేలా మహిళపై దుండగులు సామూహిక అత్యాచారానికి పాల్పడ్డారు. నిర్మానుష్య ప్రదేశానికి తీసుకెళ్లి అత్యంత దారుణంగా లైంగిక దాడి చేశారు. అత్యాచారం చేయడమే కాకుండా ఆమె మర్మాంగంలో పలు రకాల వస్తువులు పెట్టి వికృతంగా ప్రవర్తించారు. వారి చేష్టలతో తీవ్రంగా గాయపడిన మహిళ పోలీసులను ఆశ్రయించింది. ఘటనపై కేసు నమోదు చేసి నిందితుల కోసం పోలీసులు తీవ్రంగా గాలిస్తున్నారు.

ఈ ఘటన జూన్ 11 అర్ధరాత్రి చకియా పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఆ రోజు రాత్రి సుమారు 11:30 గంటలకు బాధితురాలు మూత్ర విసర్జన కోసం బాత్రూమ్‌కి వెళ్లింది. అదే సమయంలో ఇంట్లోకి ప్రవేశించిన ఐదుగురు దుండగులు ఆమె భర్తను ఓ గదిలో బంధించారు. మహిళ బయటకు రాగానే గట్టిగా పట్టుకుని, నోటికి గుడ్డ కట్టారు. అనంతరం సమీపంలోని నిర్మానుష్య ప్రదేశానికి లాక్కెళ్లారు. ఒకరి తర్వాత మరొకరు అత్యాచారానికి పాల్పడ్డారు. ఆమె కేకలు వేయడానికి ప్రయత్నించగా బ్లేడ్‌తో తీవ్రంగా గాయపరిచారు. లైంగిక దాడి తర్వాత దుండగులు అక్కడి నుంచి పరారయ్యారు. స్పృహలోకి వచ్చిన తర్వాత బాధితురాలు తన బంధువులకు ఫోన్ చేసింది. వారు వచ్చి మహిళను, ఆమె భర్తను రక్షించారు. బాధితురాలి భర్త వెంటనే పోలీసులకు ఫోన్ చేశారు. వారి సూచనల మేరకు చికిత్స నిమిత్తం బరౌని ఆస్పత్రికి వెళ్లారు. అనంతరం బరౌని నుంచి సదర్ ఆస్పత్రికి ఆమెను పోలీసులు తరలించారు. చికిత్స తర్వాత బాధితురాలిని ఇంటికి పంపించారు. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. అయితే, మర్మాంగంలో విపరీతంగా నొప్పి రావడంతో సదర్ ఆస్పత్రికి బాధిత మహిళ మళ్లీ వెళ్లింది. వైద్య పరీక్షలో భాగంగా ఆమె మర్మాంగంలో వస్తువులను గుర్తించిన వైద్యులు షాక్ అయ్యారు.

మరోవైపు అత్యాచార ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు డీఎస్పీ ఆనంద్ కుమార్ పాండే తెలిపారు. నిందితులను త్వరలోనే అరెస్టు చేస్తామని, గత సంఘటనపైనా ఆరా తీస్తున్నట్లు పేర్కొన్నారు. ఇందులో పోలీసుల నిర్లక్ష్యం ఉన్నట్లు తేలితే శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని చెప్పారు.

# అనుమానంతో ఇంట్లో సీసీ కెమెరాలు వేధింపులు తట్టుకోలేక భార్య ఆత్మహత్య

మహారాష్ట్రలో దారుణ సంఘటన చోటుచేసుకుంది. ఓ వ్యక్తి తన భార్య మీద అనుమానంతో ఇంట్లో, బయట సీసీ కెమెరాలు ఏర్పాటు చేశాడు. భార్య ప్రతి కదలికను గమనిస్తూ వేధింపులకు గురి చేశాడు. భర్త వేధింపులు తట్టుకోలేకపోయిన భార్య ఆత్మహత్య చేసుకుని ప్రాణాలు తీసుకుంది. పెళ్లై రెండు నెలలు కాకముందే ఈ విషాదం చోటుచేసుకోవటం గమనార్హం. సంఘటనకు సంబంధించి పోలీసులు తెలిపిన పూర్తి వివరాల్లోకి వెళితే.. థానేకు చెందిన నితిన్ తిల్కర్ అనే వ్యక్తికి విశాఖ తిల్కర్ అనే యువతితో ఏప్రిల్ 30వ తేదీన పెళ్లైంది. పెళ్లైన తర్వాత కొన్ని రోజులు నితిన్ తన భార్యను ఎంతో ప్రేమగా చూసుకున్నాడు. ఆ తర్వాత మెల్లగా తన పాడు బుద్ది బయటపెట్టాడు. చిన్న చిన్న విషయాలకు ఆమెతో గొడవపడేవాడు. భార్య మీద అనుమానంతో ఇంట్లో, బయట సీసీటీవీ కెమెరాలు ఏర్పాటు చేశాడు. ఆమె ప్రతి కదలికను గమనిస్తూ వచ్చాడు. భార్య ఎవరితోనైనా మాట్లాడితే నితిన్ ఆమెను దారుణంగా కొట్టేవాడు. అత్తింటి వారు కూడా ఆమెను వేధింపులకు గురి చేయటం మొదలెట్టారు. పక్కింటి మహిళతో మాట్లాడిందన్న కారణంతో అత్తింటి వారు విశాఖను దారుణంగా కొట్టారు. భర్త, అత్తింటి వారి వేధింపులు భరించలేకపోయిన విశాఖ ఆత్మహత్య చేసుకుని ప్రాణాలు తీసుకుంది. విశాఖ తల్లిదండ్రులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు. విశాఖ తల్లి మాట్లాడుతూ.. 'కట్నంలో భాగంగా మేము ఇస్తామన్న బహుమతులు ఇవ్వకపోవటంతో విశాఖను ఆమె అత్తింటి వారు వేధింపులకు గురి చేశారు. విశాఖ నాకు ఫోన్ చేసి వేధింపుల గురించి చెప్పుకుని ఏడ్చింది. విశాఖను ఇంటికి తిరిగి తీసుకురావటానికి ఏర్పాట్లు జరుగుతున్న సమయంలోనే ఈ విషాదం జరిగింది' అంటూ కన్నీళ్లు పెట్టుకుంది.

## ఐఏఎఫ్ అధికారి భార్య బలవంతపు మతమార్పిడి కేసులో మరో నిందితుడి అరెస్టు

నాగ్‌పూర్‌లో (మహారాష్ట్ర) ఇటీవల వెలుగు చూసిన బలవంతపు మతమార్పిడి కేసులో పోలీసులు తాజాగా మరో నిందితుడిని అరెస్టు చేశారు. హజ్రత్ మౌలానా అనే 24 ఏళ్ల యువకుడిని మధ్యప్రదేశ్‌లో అదుపులోకి తీసుకున్నారు. తనను బలవంతంగా మతం మార్చారంటూ ఒక ఐఏఎఫ్ అధికారి భార్య ఇటీవల సంచలన ఆరోపణలు చేసిన విషయం

తెలిసిందే. తనతో పాటు గతంలో కలిసి చదువుకున్న అయాజ్, అతడి స్నేహితులు ఈ దారుణానికి పాల్పడ్డారని ఆమె ఆరోపించారు. లైంగిక దాడి, బ్లాక్‌మెయిల్‌కు పాల్పడ్డారని ఫిర్యాదు చేశారు. ఈ ఘటనకు సంబంధించిన వీడియోలు కూడా సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. ఈ కేసులో ప్రధాన నిందితుడిగా ఉన్న అయాజ్ మదారే (26), అతడి స్నేహితుడు అమీన్ షేఖ్‌లను పోలీసులు ఇప్పటికే అరెస్టు చేశారు. బలవంతపు మతమార్పిడి, వివాహం కేసులో హజ్రత్ మౌలానా పాత్ర కూడా ఉన్నట్టు జాతీయ మీడియాలో కథనాలు వెలువడ్డాయి. ఎఫ్ఐఆర్‌లోని అంశాల ప్రకారం, ఒక హోటల్‌లో అయాజ్ ఈ దారుణానికి పాల్పడ్డట్టు మహిళ ఆరోపించారు. తన డ్రింక్‌లో మత్తుమందు కలిపి ఇచ్చాడని చెప్పారు. తాను స్పృహలోకి వచ్చేసరికి నిందితుడు అసభ్యకరమైన వీడియోలు రికార్డు చేశాడని చెప్పారు. వాటిని తన భర్తకు, ఇతరులకు పంపిస్తానంటూ బ్లాక్ మెయిల్ చేశాడని ఆరోపించారు. తనపై లైంగిక దాడికి పాల్పడటంతో పాటు రూ.4 లక్షల డబ్బు వసూలు చేశాడని కూడా చెప్పారు. ఆ తరువాత మరో సందర్భంలో హజ్రత్, ఇతరులు తనను ఒక చోటకు తీసుకెళ్లి బలవంతంగా అయాజ్‌తో పెళ్లి చేశారని కూడా ఆరోపించారు.

# మహిళపై పాత క్లాస్‌మేట్ అకృత్యాలు.. ప్రైవేట్ ఫొటోలు, వీడియోలతో భయపెట్టి..

పాత క్లేస్‌మేట్‌ను నమ్మి ఓ మహిళ దారుణంగా మోసపోయింది. మహిళ ప్రైవేట్ ఫొటోలు, వీడియోలు తీసిన ఆ పాత క్లాస్‌మేట్ బెదిరింపులకు దిగాడు. ఆమెపై పలుమార్లు అత్యాచారం చేయటమే కాకుండా.. లక్షల రూపాయల సొమ్ము కాజేశాడు. చివరకు పాపం పండి కటకటాల పాలయ్యాడు. ఈ సంఘటన మహారాష్ట్రలో ఆలస్యంగా వెలుగుచూసింది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. నాగ్‌పూర్‌కు చెందిన ఓ మహిళ తన పాత క్లాస్‌మేట్ అయాజ్ మదారేను కలవడానికి 2025 ఫిబ్రవరి 8వ తేదీన ఓ హోటల్‌కు వెళ్లింది. అయాజ్ మహిళ తాగే కూల్‌డ్రింక్‌లో మత్తు మందు కలిపి ఇచ్చాడు. కూల్‌డ్రింక్ తాగి మహిళ స్పృహ కోల్పోయింది. ఈ నేపథ్యంలోనే అయాజ్ ఆమె ప్రైవేట్ ఫొటోలు, వీడియోలు తీశాడు. వాటిని చూపించి మహిళపై బెదిరింపులకు పాల్పడ్డాడు. ఆమెపై పలుమార్లు అత్యాచారం చేశాడు. 4 లక్షల రూపాయలు దోచేశాడు. నిందితుడు అంతటితో ఆగలేదు. ఆమెను బలవంతంగా మతం కూడా మార్చాడు. రోజురోజుకు అతడి వేధింపులు ఎక్కువవటంతో మహిళ భరించలేకపోయింది. భర్త సాయంతో పోలీసులకు ఫిర్యాదు చేసింది. అయాజ్‌తో పాటు అమీన్ షేక్ అనే వ్యక్తిపై పోలీసులు పలు సెక్షన్ల కింద కేసు నమోదు చేసుకుని దర్యాప్తు

చేపట్టారు. మధ్యప్రదేశ్‌లో ఇద్దరు నిందితులను అరెస్ట్ చేశారు. ప్రస్తుతం సంఘటనకు సంబంధించిన వీడియో ఒకటి సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. ఆ వీడియోలో నిందితుడు మహిళను వేధిస్తున్న దృశ్యాలు ఉన్నాయి. 'నన్ను విడిచిపెట్టు' అంటూ ఆ మహిళ అయాజ్‌ను ప్రాధేయపడుతోంది. అయినా అతడు మాత్రం ఆమెను వదల్లేదు. కాగా, బాధిత మహిళ భర్త ఇండియన్ ఎయిర్‌ఫోర్స్‌లో పని చేస్తున్నట్లు తెలుస్తోంది.

# ఒడిశాలో దారుణం..
# ఎన్‌జీఓ కార్యకర్తలపై దాడి
## 21మంది అరెస్టు

ఇద్దరు ఎన్జీవో కార్యకర్తలను కిడ్నాపర్లుగా భావించి దాడి చేసిన ఘటన ఒడిశాలోని రాయగడ జిల్లాలో చోటుచేసుకుంది. ఓ ప్రాంతానికి వెళ్లాల్సిన బాధితులు పొరపాటున మరో గ్రామానికి వెళ్లారు. అక్కడ చిన్నారులతో ఆప్యాయంగా మాట్లాడి వారికి బిస్కెట్లు ఇవ్వడంతో కిడ్నాపర్లనే పుకారు షికారు చేసింది. నిమిషాల వ్యవధిలోనే అక్కడికి చేరుకున్న ఓ గుంపు వారిపై దాడి చేసి తీవ్రంగా గాయపరిచింది. యువతిని వివస్త్రను చేసి అనాగరికంగా ప్రవర్తించింది. కంధమాల్ జిల్లాలో ఇద్దరు యువతీయువకులు ఓ ఎన్జీవోలో పని చేస్తున్నారు. జూన్ 16వ తేదీన సామాజిక కార్యక్రమంలో భాగంగా వారిద్దరూ కలహండిలోని తువాముల్ రాంపూర్‌కు ద్విచక్రవాహనంపై బయలుదేరారు. అయితే, వారికి ఆ ప్రాంతం గురించి తెలియకపోవడంతో గూగుల్ మ్యాప్ వాడారు. మారుమూల ప్రాంతం కావడంతో వెళ్లాల్సిన చోటకు కాకుండా పొరపాటున రాయగడ జిల్లాలోకి ప్రవేశించారు. కల్యాణ్ సింగ్‌పూర్ పోలీస్ స్టేషన్ పరిధి ధమునిపంగ పంచాయతీ కందుల్‌గూడ గ్రామానికి చేరుకున్నారు.

దారి తప్పామని గుర్తించిన యువతీయువకులు గమ్యస్థానానికి వెళ్లేందుకు గ్రామస్థులను సమాచారం అగడాలని నిర్ణయించుకున్నారు. ఈ మేరకు వాహనాన్ని ఆపి దారి గురించిన సమాచారాన్ని స్థానికులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా అక్కడే ఉన్న పిల్లలతో కాసేపు సరదాగా ముచ్చటించి బిస్కెట్లు ఇచ్చారు. ఇదే వారు చేసిన అతి పెద్ద తప్పుగా మారింది. పిల్లలను కిడ్నాప్ చేసే వాళ్లు గ్రామానికి వచ్చారనే పుకారు నిమిషాల్లోనే కందుల్ గూడలో ప్రచారం జరిగింది. వెంటనే ఎన్జీవో కార్యకర్తల వద్దకు కొంతమంది

గ్రామస్థులు చేరుకున్నారు. ద్విచక్రవాహనం తాళం లాక్కొన్ని గుర్తింపు పత్రాలు చూపించాలని డిమాండ్ చేశారు. వాటిని చూపించినా సరే మూకుమ్మడిగా వారిపై దాడికి పాల్పడ్డారు. చేతులు, కాళ్లతో విపరీతంగా కొట్టారు. కొంతమంది కర్రలు తీసుకుని కాళ్లు, చేతులు, ముఖంపై దాడి చేశారు. బట్టలు మట్టత్తం చింపేసి యువతిని వివస్త్రను చేశారు. ఈ దాడిలో యువతీయువకులకు తీవ్రగాయాలు అయ్యాయి. మరోవైపు పలువురు గ్రామస్థులు ఈ ఘటనను తమ మొబైల్ కెమెరాల్లో చిత్రీకరించారు. అక్కడికి చేరుకున్న మరికొంతమంది గ్రామస్థులు ఆ ఇద్దరు ఎన్జీవో కార్యకర్తలను రక్షించి పోలీసులకు సమాచారం చేరవేశారు. సమాచారం అందిన వెంటనే పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని, ఇద్దరు బాధితులను స్థానిక ఆస్పత్రికి తరలించారు. అనంతరం వారిని రాయగడ జిల్లా ప్రధాన ఆస్పత్రికి తరలించారు. చికిత్స అనంతరం వారిని డిశ్చార్జ్ చేసినట్లు రాయగడ ఎస్పీ రాజ్ ప్రసాద్ తెలిపారు. మరోవైపు దాడికి పాల్పడిన 21 మందిని అరెస్టు చేసినట్లు పేర్కొన్నారు. ఘటనపై కేసు నమోదు చేశామని, దర్యాప్తు కొనసాగుతోందన్నారు. ఈ కేసులో మరికొంతమంది ప్రమేయం ఉందని, వారి కోసం గాలింపు చర్యలు కొనసాగుతున్నట్లు ఎస్పీ రాజ్ ప్రసాద్ తెలిపారు.

# క్షుద్రపూజల అనుమానంతో పని మనిషిని హత్య చేసిన డాక్టర్

దేశ రాజధాని ఢిల్లీలో దారుణ సంఘటన చోటుచేసుకుంది. క్షుద్ర పూజలు చేస్తోందన్న అనుమానంతో ఓ డాక్టర్ తన ఇంటి పని మనిషిని చంపేశాడు. క్రికెట్ బ్యాట్‌తో కొట్టి.. కత్తితో పొడిచి ప్రాణాలు తీసేశాడు. గురువారం ఉదయం ఈ సంఘటన చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. మౌంట్ కైలాశ్ ఏరియాకు చెందిన మనీశ్ గుప్తా డెర్మటాలజిస్టుగా సేవలందిస్తున్నాడు. మనీశ్ ఇంట్లో గత 15 ఏళ్ల నుంచి మీనా అనే మహిళ పని చేస్తోంది. మీనా క్షుద్ర పూజలు చేస్తోందని మనీశ్‌కు అనుమానం కలిగింది. ఆమె కారణంగా ఇంట్లో నెగిటివ్ ఎనర్జీ వ్యాపిస్తోందని భావించాడు. ఆయుర్వేదిక్ ప్రాక్టీషనర్ అయిన తన భార్యతో.. మీనాను ఉద్యోగం నుంచి తీసేయమని చెప్పాడు. ఇందుకు ఆమె ఒప్పుకోలేదు. 'మీ అమ్మ క్యాన్సర్‌తో బాధపడుతున్న సమయంలో మీనా ఎంతో సేవ చేసింది' అని భర్తతో చెప్పింది. దీంతో మనీశ్ మనస్తాపానికి గురయ్యాడు. ఇంట్లో పని మనిషికి ఉన్న విలువ కూడా తనకు లేదని అనుకున్నాడు. ఇదే విషయం అతడిలోని రాక్షసుడిని బయటకు తీసింది. భార్య డ్యూటీకి వెళ్లిన తర్వాత మనీశ్ పని మనిషితో గొడవ

పెట్టుకున్నాడు. గొడవ చిలికిచిలికి గాలివానలా మారింది. ఈ నేపథ్యంలోనే మనీశ్ బ్యాట్‌తో మీనాపై దాడి చేశాడు. అనంతరం కత్తితో విచక్షణా రహితంగా పొడిచి చంపేశాడు. ఉదయం 11 గంటల ప్రాంతంలో పోలీసులకు మీనా మర్డర్ సమాచారం అందింది. వారు హుటాహుటిన సంఘటనా స్థలానికి చేరుకున్నారు. మీనా మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తరలించారు. మనీశ్‌ను అదుపులోకి తీసుకున్నారు. మనీశ్ చేసిన నేరాన్ని అంగీకరించాడు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు. సీసీటీవీ ఫుటేజీలను పరిశీలిస్తున్నారు. అన్ని కోణాల నుంచి కేసును దర్యాప్తు చేస్తున్నారు.

# డేటింగ్ యాప్‌లో మోసపోయిన మహిళా న్యాయాధికారి!

## రూ.52 లక్షలకు ముంచిన ప్రేమికుడు
## తన పనిమనిషి పేరుతో నిందితుడిపై కేసు
## కోర్టులో అసలు విషయం చెప్పిన నిందితుడు

చండీగఢ్‌లో ఒక మహిళా న్యాయాధికారి డేటింగ్ యాప్ టిండర్ ద్వారా పరిచయం అయిన వ్యక్తి చేతిలో రూ.52 లక్షలు మోసపోయారు. తన పేరు బయటకు చెప్పుకోవడం ఇష్టంలేక తన ఇంటి పనిమనిషి దీక్షాదేవిని ఆర్థికంగా మోసం చేశాడంటూ అతనిపై పోలీసు కేసు పెట్టించారు. పోలీసులు నిందితుడిని అరెస్టు చేసి జ్యుడీషియల్ రిమాండ్‌కు పంపారు. నిందితుడి బెయిలు పిటిషన్ సెషన్స్ కోర్టులో విచారణకు వచ్చినపుడు అసలు విషయం వెలుగులోకి వచ్చింది. మోసపోయింది పనిమనిషి దీక్షాదేవి కాదని, ఆమె ఇంటి యజమాని అయిన మహిళా న్యాయమూర్తేనని తేలింది. నిందితుడు దీపక్ వాట్స్ మహిళా న్యాయమూర్తికి 2025 నవంబరులో టిండర్ యాప్‌లో అభిమన్యు పేరుతో పరిచయం అయ్యాడు. తాను భారత ప్రభుత్వంలో రహస్య విభాగంలో పని చేస్తున్నానన్నాడు. ఇద్దరి మధ్య సాన్నిహిత్యం పెరిగింది. అతడు అధిక లాభాలొస్తాయని చెప్పడంతో న్యాయాధికారి రూ.52లక్షలు నిందితుడి ఖాతాకు బదిలీ చేసింది. లాభాలు చూపకపోగా మొదటికే మోసం చేయడంతో ఆమె దీక్షాదేవి పేరుతో పోలీసులను ఆశ్రయించారు. తాజాగా, నిందితుడు బెయిలు పిటిషన్‌లో వాదనలు వినిపించినపుడు మహిళా న్యాయాధికారి, తాను కొన్ని నెలలుగా రిలేషన్‌షిప్‌లో ఉన్నామని, తానే బెట్టింగుల్లో పెట్టమని స్వచ్ఛందంగా డబ్బులు ఇచ్చిందని చెప్పాడు.

# సైబర్ స్లేవరీ కేసులో ఇద్దరు అంతర్జాతీయ ముఠా సభ్యుల అరెస్ట్

మానవ అక్రమ రవాణా, సైబర్ స్లేవరీ నెట్‌వర్క్‌పై సీబీఐ కొరడా ఝుళిపించింది. ఆగ్నేయాసియా స్కామ్ కాంపౌండ్లతో లింకులు ఉన్న ఇద్దరు కీలక నిందితులను సీబీఐ అధికారులు అరెస్టు చేశారు. ఇదే కేసులో గత మే నెలలో 4 రాష్ట్రాల్లోని 8 ప్రాంతాల్లో సోదాలు నిర్వహించి ఒకరిని అరెస్టు చేశారు. తాజాగా మరో ఇద్దరిని అదుపులోకి తీసుకుని విచారణ చేస్తున్నారు. బాధితులను బ్యాంకాక్ నుంచి మే సోట్ మీదుగా థాయిలాండ్-మయన్మార్ సరిహద్దు దాటించి స్కామ్ కాంపౌండ్లకు చేర్చిన లాజిస్టిక్స్ హ్యాండ్లర్‌ను అరెస్టు చేసినట్లు సీబీఐ అధికారులు తెలిపారు. అలాగే థాయిలాండ్-మయన్మార్ సరిహద్దు కాంపౌండ్‌లో ఉంటూ భారత్‌లోని సబ్-ఏజెంట్లను నిర్వహిస్తున్న మరో నిందితుడిని అరెస్టు చేశామన్నారు. విదేశాల్లో భారీ జీతాలతో ఉద్యోగాలంటూ భారతీయులను ఈ అంతర్జాతీయ ముఠా ట్రాప్ చేసినట్లు కేసు విచారణలో భాగంగా సీబీఐ అధికారులు గుర్తించారు. ఉద్యోగాల కోసం వచ్చిన వారిని మయన్మార్, కంబోడియా దేశాల్లోని స్కామ్ కాంపౌండ్లకు తరలించారని తెలిపారు. బాధితుల పాస్‌పోర్టులు బలవంతంగా తీసుకుని, వారితో సైబర్ నేరాలు చేయించినట్లు వెల్లడించారు. శారీరక, మానసిక వేధింపులకూ గురి చేసినట్లు చెప్పుకొచ్చారు. తమను వదిలిపెట్టాలని వేడుకున్న బాధితుల నుంచి భారీగా నగదు వసూళ్లకు పాల్పడినట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా సోషల్ మీడియా, మెసేజింగ్ యాప్స్‌లో వచ్చే విదేశీ ఉద్యోగ ప్రకటనలపై అప్రమత్తంగా ఉండాలని ప్రజలకు సీబీఐ అధికారులు విజ్ఞప్తి చేస్తున్నారు.

## ఆఫీస్‌లో యువతిని కత్తితో పొడిచి చంపిన ప్రేమోన్మాది

పంజాబ్‌లో దారుణం చోటుచేసుకుంది. ఓ యువతి మాజీ ప్రియుడి చేతిలో దారుణ హత్యకు గురైంది. మాజీ ప్రియుడు ఆ యువతిని 20 సార్లు కత్తితో పొడిచి చంపాడు. యువతిని చంపిన తర్వాత అదే కత్తితో తనను తాను పొడుచుకుని ఆత్మహత్యకు యత్నించాడు. పోలీసులు తెలిపిన వివరాల్లోకి వెళితే.. మొహాలికి చెందిన హర్విందర్ మన్ అలియాస్ హ్యారీ, డింపుల్ మూడేళ్ల క్రితం ఓ కంపెనీలో కలిసి పని చేశారు. ఈ నేపథ్యంలోనే ఇద్దరి మధ్యా పరిచయం ఏర్పడింది. ఆ పరిచయం ప్రేమగా మారింది. కొన్ని నెలల క్రితం ఇద్దరూ కొత్త కంపెనీలో చేరారు. కొత్త కంపెనీలో చేరిన కొంతకాలం వీరి బంధం సజావుగానే సాగింది. తర్వాత నుంచి గొడవలు మొదలయ్యాయి. కొద్దిరోజుల క్రితం

ఇద్దరూ విడిపోయారు. డింపుల్‌తో విడిపోవటం హ్యారీకి ఇష్టం లేదు. మళ్లీ ఆమెతో ఒక్కడవ్వడానికి ప్రయత్నాలు చేస్తున్నాడు. డింపుల్ ఇందుకు ఒప్పుకోవటం లేదు. దీంతో అతడు డిప్రెషన్‌లోకి వెళ్లిపోయాడు. గురువారం డింపుల్ డ్యూటీలో ఉండగా.. రాత్రి 7.40 గంటల ప్రాంతంలో హ్యారీ ఆఫీస్‌కు వచ్చాడు. ఆమెతో గొడవ పెట్టుకున్నాడు. ఈ నేపథ్యంలోనే కత్తితో డింపుల్‌ను 20 సార్లు అతి కిరాతకంగా పొడిచాడు. తర్వాత అదే కత్తితో తన గొంతులో 30 సార్లు పొడుచుకుని ఆత్మహత్యకు యత్నించాడు. రక్తపు మడుగులో పడి ఉన్న ఇద్దరినీ సహోద్యోగులు ఆస్పత్రికి తరలించారు. పోలీసులకు సమాచారం అందించారు. డింపుల్‌ను పరీక్షించిన వైద్యులు ఆమె చనిపోయినట్లు ధ్రువీకరించారు. హ్యారీ పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలుస్తోంది. ఈ సంఘటనపై కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేపట్టారు. హత్యకు గల కారణాలను అన్వేషిస్తున్నారు.

# దివ్యాంగురాలిపై అత్యాచారం

నగరంలోని ఎల్బీనగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఘోరమైన ఘటన వెలుగుచూసింది. ఇంట్లో ఒంటరిగా ఉన్నదివ్యాంగురాలిపై ఓ దుర్మార్గుడు అత్యాచారానికి ఒడిగట్టాడు. బాధితురాలికి మాట్లాడే, వినే శక్తి లేకపోవడాన్ని ఆసరాగా చేసుకుని ఈ దారుణానికి పాల్పడినట్లు తెలుస్తోంది. ఈ క్రమంలో మహిళ మెడ, చేతులకు స్వల్ప గాయాలయ్యాయి. గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసుకున్న ఎల్బీనగర్ పోలీసులు రంగంలోకి దిగారు. బాధితురాలిని చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. కాగా, నిందితుడిని పట్టుకునేందుకు ఆ ప్రాంతంలోని సీసీటీవీ దృశ్యాలను పోలీసులు క్షుణ్ణంగా పరిశీలిస్తున్నారు. సీసీ ఫుటేజి ఆధారంగా దర్యాప్తును ముమ్మరం చేశామని, త్వరలోనే నిందితుడిని అదుపులోకి తీసుకుంటామని పోలీసులు తెలిపారు.

# హైదరాబాద్‌లో అక్రమ లింగ నిర్ధారణ రాకెట్ భగ్నం

నగరంలోని ఎల్బీనగర్ పరిధిలో అక్రమ లింగ నిర్ధారణ రాకెట్‌ను పోలీసులు భగ్నం చేశారు. వనస్థలిపురంలోని ఓ ప్రైవేటు హాస్పిటల్‌పై పోలీసులు డెకాయ్ ఆపరేషన్ నిర్వహించారు. హాస్పిటల్ డైరెక్టర్ కొర్ర రాజు సహా ముగ్గురిని అదుపులోకి తీసుకున్నారు. మహిళా పోలీసును డెకాయ్‌గా పంపి ఆధారాలు సేకరించారు. లింగ నిర్ధారణ పరీక్షలు చేస్తామంటూ హాస్పిటల్ సిబ్బంది హామీ ఇచ్చారు. నిందితులు తుక్కుగూడలోని ఓ క్లినిక్‌కు గర్భిణులను రిఫర్ చేశారు. క్లినిక్‌లో లింగ నిర్ధారణ పరీక్షలు చేస్తున్న ల్యాబ్ టెక్నీషియన్ విజయ్ కుమార్‌ను పోలీసులు పట్టుకున్నారు. రిసెప్షనిస్ట్ లోకేశ్‌ను కూడా అరెస్ట్ చేశారు.

హాస్పిటల్ డైరెక్టర్‌తో సహా ముగ్గురిపై పీసీపీఎన్‌డీటీ చట్టం కింద కేసు నమోదు చేశారు. గర్భంలోని శిశువు లింగాన్ని వెల్లడించడం చట్టరీత్యా నేరమని పోలీసులు తెలిపారు. అక్రమ లింగ నిర్ధారణలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ అంశంపై కేసు నమోదు చేసిన వనస్థలిపురం పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

## బాలికపై హత్యాచారం కేసులో వృద్ధుడికి మరణశిక్ష

మూడేళ్ల బాలికపై హత్యాచారానికి పాల్పడ్డ 65 ఏళ్ల వృద్ధుడికి పుణెలోని ఫాస్ట్ ట్రాక్ కోర్టు మరణ శిక్ష విధించింది. ఈ కేసు అత్యంత అరుదైనదని అడిషనల్ జడ్జి ఎస్ఆర్ సాలంఖే అభిప్రాయపడ్డారు. అత్యంత పాశవిక చర్యకు పాల్పడ్డ నిందితుడు భిమ్‌రావ్ కాంబ్లేకు మరణ శిక్ష విధించక తప్పదని అన్నారు. గతంలోనూ పలు నేరాలు చేసిన చరిత్ర భీమ్‌రావ్‌ది అని పేర్కొన్నారు. ఈ కేసులో కోర్టు భీమ్‌రావ్‌ను జూన్ 25న దోషిగా తేల్చింది. తాజాగా శిక్ష ఖరారు చేసింది. మే 1న జిల్లాలోని భోర్ తెహసిల్‌లోని నస్రాపూర్ గ్రామంలో నిందితుడు దారుణానికి ఒడిగట్టాడు. చిన్నారికి మాయమాటలు చెప్పి పసువుల షెడ్డులోకి తీసుకెళ్లి దారుణానికి పాల్పడ్డాడు. చిన్నారి మృతదేహాన్ని షెడ్డులో గుర్తించిన కుటుంబసభ్యులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. కేసు నమోదు చేసిన అనంతరం పోలీసులు నిందితుడిని అదుపులో తీసుకున్నారు. గతంలోనూ నిందితుడిపై పోక్సో చట్టం కింద కేసులు నమోదయ్యాయని పోలీసులు తెలిపారు.

## ఆశారం బాపునకు బెయిల్ నిరాకరించిన సుప్రీంకోర్టు

2013లో ఓ బాలికపై అత్యాచారం కేసులో జీవిత ఖైదు అనుభవిస్తున్న స్వయంప్రకటిత ఆధ్యాత్మిక గురువు బాబా ఆశారం బాపునకు సుప్రీంకోర్టు బెయిల్ మంజూరు చేయడానికి నిరాకరించింది. తనపై విధించిన జీవిత ఖైదును సమర్థిస్తూ రాజస్థాన్ హైకోర్టు ఇచ్చిన తీర్పును ఆశారాం బాపు సుప్రీంకోర్టులో సవాలు చేశారు. ఈ పిటిషన్‌ను విచారించిన జస్టిస్ ఎం.ఎం. సుందరేశ్ నేతృత్వంలోని ధర్మాసనం రాజస్థాన్ ప్రభుత్వానికి నోటీసులు జారీ చేసింది. ఆశారాం పిటిషన్‌పై రెండు వారాల్లోగా కౌంటర్ అఫిడవిట్ దాఖలు చేయాలని ఆదేశించింది. అయితే, రాష్ట్ర ప్రభుత్వం స్పందించే వరకు ఆశారాంకు ఎలాంటి బెయిల్ మంజూరు చేయబోమని స్పష్టం చేసింది. విచారణ సందర్భంగా ఆశారాం తరపు న్యాయవాదులు వైద్య కారణాలను ప్రస్తావిస్తూ బెయిల్ మంజూరు చేయాలని సుప్రీంకోర్టును అభ్యర్థించారు. అయితే ప్రస్తుతం అలాంటి తక్షణ ఉపశమనానికి అవకాశం లేదని ధర్మాసనం తెలిపింది. ప్రాణాలకు ముప్పు కలిగించేంత తీవ్రమైన అత్యవసర పరిస్థితి

ఉన్న సందర్భాల్లో మాత్రమే బెయిల్ అంశాన్ని పరిశీలించగలమని న్యాయస్థానం వ్యాఖ్యానించింది. రాజస్థాన్ ప్రభుత్వం సమర్పించే కౌంటర్‌ను పరిశీలించిన తర్వాతే బెయిల్‌పై తదుపరి నిర్ణయం తీసుకుంటామని ధర్మాసనం స్పష్టం చేసింది. దీంతో ఆశారాం బాపు తరపున కోరిన తక్షణ బెయిల్ అభ్యర్థనను సుప్రీంకోర్టు నిరాకరించింది. కాగా, 2013లో రాజస్థాన్‌లో ఓ మైనర్ బాలికపై అత్యాచారం చేసిన కేసులో ఆసారాం బాపూ దోషిగా తేలారు. అనంతరం న్యాయస్థానం ఆయనకు జీవిత ఖైదు విధించింది. ప్రస్తుతం ఆయన జోధ్‌పూర్ జైలులో శిక్ష అనుభవిస్తున్నారు. సుప్రీంకోర్టు తాజా నిర్ణయంతో ఆసారాం బాపూ న్యాయపరమైన పోరాటం కొనసాగుతున్నప్పటికీ, తక్షణ ఉపశమనం మాత్రం లభించలేదు. ఇప్పుడు రాజస్థాన్ ప్రభుత్వం సమర్పించే సమాధానం, తదుపరి విచారణలో కోర్టు అభిప్రాయం కీలకంగా మారనున్నాయి.



# తమిళనాడులో మహిళల రక్షణకు 'సింగపెణ్'

తమిళనాడు ప్రభుత్వం మరో కీలక నిర్ణయం నిర్ణయం తీసుకుంది. మహిళల భద్రత కోసం 'సింగప్పెన్ స్పెషల్ టాస్క్ ఫోర్స్'ను ఏర్పాటు చేసింది. ఈ ప్రత్యేక మహిళా పోలీస్ విభాగాన్ని ముఖ్యమంత్రి విజయ్ ప్రారంభించారు. సింగప్పెన్ దళం చిహ్నాన్ని కూడా ఆవిష్కరించారు. ఈ బృందాల కోసం ఏర్పాటు చేసిన ప్రత్యేక గస్తీ వాహనాలను ప్రారంభించడంతో పాటు స్వయంగా ఒక వాహనాన్ని సీఎం నడిపారు. రాజరాతినం స్టేడియంలో జరిగిన ఈ కార్యక్రమంలో పలువురు పోలీసు ఉన్నతాధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి విజయ్ మాట్లాడుతూ, మహిళలపై జరిగే నేరాలను ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించేది లేదని అన్నారు. నేరాలకు శిక్ష కూడా కఠినంగా ఉంటుందని పేర్కొన్నారు. మహిళల భద్రత కోసం సింగప్పెన్ బృందం రాష్ట్రవ్యాప్తంగా డ్రోన్‌లను మోహరిస్తుందని, ఈ తరహాలో ఏర్పాట్లు చేయడం దేశంలోనే తొలిసారని చెప్పారు. డ్రోన్ల సహాయంతో ఎక్కడ ఎవరు మహిళలను వేధించినా తక్షణ చర్యలు తీసుకుంటామన్నారు. రాష్ట్రంలో డ్రగ్స్‌కు అలవాటు పడిన వారే ఇలాంటి నేరాలకు పాల్పడుతున్నారని, మహిళలు, చిన్నారులపై నేరాలకూ మాదకద్రవ్యాల వ్యాప్తికీ సంబంధం ఉందన్నారు. మాదకద్రవ్యాల బెడదను పూర్తిగా నిర్మూలించాల్సి ఉందని చెప్పారు. సమస్యను చాలాకాలంగా నిర్లక్ష్యం చేస్తున్నందున అది బలంగా వేళ్లూనుకుందని, ఈ నిర్లక్ష్యానికి కారకులెవరో తాను ప్రత్యేకంగా చెప్పనక్కరలేదని అన్నారు. సింగప్పెన్ కోసం తొలిదశలో రూ.354 కోట్లు కేటాయించనున్నామని, రెండో దశలో కొత్త యూనిట్ కోసం 2,500 కొత్త పోస్టులు కల్పిస్తామని చెప్పారు. ఈ సందర్భంగా జరిగిన పోలీస్ పరేడ్‌లో విజయ్ పాల్గొన్నారు.

# పడిపోతున్న ఉత్తరాది రాష్ట్రాల సంతానోత్పత్తి రేటు

## దక్షిణాదిలో స్వల్ప పెరుగుదల

## 'నేషనల్ ఫ్యామిలీ హెల్త్ సర్వే-6' నివేదికలో వెల్లడి

ఒకప్పుడు అత్యధిక జనాభా వృద్ధిరేటుతో దేశానికి పెద్ద సవాలుగా నిలిచిన ఉత్తరప్రదేశ్, బిహార్, ఈశాన్య రాష్ట్రాలలో సంతానోత్పత్తి రేట్లు గణనీయంగా తగ్గుముఖం పడుతున్నాయి. కేంద్ర ఆరోగ్య శాఖ విడుదల చేసిన 'నేషనల్ ఫ్యామిలీ హెల్త్ సర్వే-6' నివేదిక ప్రకారం.. ఈ రాష్ట్రాలు ఇప్పుడు జాతీయ సగటుకు అత్యంత సమీపంలోకి వచ్చాయి. బాలికల విద్య పెరగడం, బాల్య వివాహాలు తగ్గడంతో పాటు ప్రభుత్వాలు విస్తృతంగా అమలు చేస్తున్న కుటుంబ నియంత్రణ కార్యక్రమాలు ఈ మార్పునకు ప్రధాన కారణాలుగా నిలిచాయి. తాజా నివేదికలోని రాష్ట్రాల వారీ వివరాలను పరిశీలిస్తే.. దేశంలోనే అత్యధిక జనాభా కలిగిన ఉత్తరప్రదేశ్‌లో సంతానోత్పత్తి రేటు గతంలో 2.4గా ఉండగా, అది ఇప్పుడు 2.2కు పడిపోయింది. దేశంలోనే ఎల్లప్పుడూ అత్యధిక సంతానోత్పత్తి రేటు నమోదు చేసే బిహార్‌లో సైతం మార్పు కనిపించింది. అక్కడ గత సర్వేలో 3.0గా ఉన్న రేటు ఇప్పుడు 2.7కు తగ్గింది. ఇక దేశంలోనే అత్యంత వేగంగా సంతానోత్పత్తి రేటు తగ్గిన ప్రాంతంగా ఈశాన్య రాష్ట్రమైన మేఘాలయ రికార్డు సృష్టించింది. ఇక్కడ గతంలో 2.7గా ఉన్న రేటు ఏకంగా 2.2కు పడిపోయింది. అరుణాచల్ ప్రదేశ్, అసోం, మిజోరాం వంటి ఇతర ఈశాన్య రాష్ట్రాలలో కూడా జననాల రేటు సగటున 0.3 చొప్పున క్షీణించింది. ఇదే సమయంలో దేశంలోనే అత్యంత తక్కువ సంతానోత్పత్తి రేటు కలిగిన రాష్ట్రంగా సిక్కిం 1.0తో నిలిచింది. మరోవైపు, గత కొన్నేళ్లుగా సంతానోత్పత్తి రేట్లు క్రమంగా తగ్గుతూ వచ్చిన దక్షిణాది రాష్ట్రాల్లో ప్రస్తుతం స్వల్ప పెరుగదల కనిపిస్తోంది. తెలంగాణలో గతంలో 1.8గా ఉన్న రేటు, తాజా సర్వేలో అది 1.9కి పెరిగింది. ఏపీ, కర్ణాటకల్లో ఈ రేటు 1.7 నుంచి 1.8కి చేరింది. కేరళలో కూడా 1.8కి పెరిగింది. ప్రస్తుతం దేశ జాతీయ సగటు 2.0గా ఉంది.

# జైళ్లలో డీ అడిక్షన్ కేంద్రాలతో సత్ఫలితాలు

## 15,645 మంది ఖైదీలకు నివృత్తి సేవలు
## జాతీయ సదస్సులో తెలంగాణ నమూనా
## జైళ్ల శాఖ డీజీ డాక్టర్ సౌమ్య మిశ్రా

జైళ్లలో డీ అడిక్షన్ కేంద్రాల ఏర్పాటు సత్ఫలితాలను ఇస్తోందని జైళ్లశాఖ డీజీ డాక్టర్ సౌమ్య మిశ్రా తెలిపారు. మత్తుకు బానిసై వచ్చిన ఖైదీలు శిక్ష పూర్తి చేసుకుని బాహ్య ప్రపంచంలోకి వేళ్లే సమయానికి సత్ప్రవర్తన కలిగిన వారిగా తయారు చేసి సమాజానికి అందించడమే డీ అడిక్షన్ కేంద్రాల ముఖ్య ఉద్దేశ్యమన్నారు. చంచల్‌గూడ జైలులో గురువారం నిర్వహించిన అంతర్జాతీయ మాదకద్రవ్యాల దుర్వినియోగం, అక్రమ రవాణా దినోత్సవానికి డీజీ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా నివృత్తి డీ-అడిక్షన్ సెంటర్ అధికారిక లోగోను ఆవిష్కరించి, జైలు అధికారులు, ఖైదీలతో మాదకద్రవ్యాలకు దూరంగా ఉంటామని ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. తెలంగాణలోని నాలుగు కేంద్ర కారాగారాల్లో ఏర్పాటు చేసిన నివృత్తి కేంద్రాల ద్వారా ఏడాది కాలంలో 15,645 మంది ఖైదీలకు సేవలందించినట్లు వెల్లడించారు. మాదకద్రవ్యాలపై ఆధారపడినట్లు గుర్తించిన 4,200 మందికి చికిత్స, పునారావాస సేవలు అందించామన్నారు. ఈ నెల 26న యునిటైడ్ నేషన్స్ ఆఫీస్ అన్ డ్రగ్స్ అండ్ క్రైమ్ (యూఎన్‌వోడీసీ), టీవైసీఐఏ ఆధ్వర్యంలో పంజాబ్‌లో జరిగే జాతీయ సదస్సులో నివృత్తి ఉత్తమ విధానంపై డీఐజీ సంపత్‌తో కలిసి ప్రజెంటేషన్ ఇవ్వనున్నట్లు డీజీ తెలిపారు. ఈ అవకాశం రావడం నివృత్తి కార్యక్రమాలకు లభించిన జాతీయ గుర్తింపు అని అన్నారు. కార్యక్రమంలో జైళ్లశాఖ ఐజీ మురళీబాబు, జైలు సూపరింటెండెంట్ నవాబ్ శివకుమార్ గౌడ్ పాల్గొన్నారు.

# దేశంలో పెరిగిపోతున్న ఒంటరి మహిళలు

దేశంలో ఒంటరి మహిళల సంఖ్య పెరుగుతోంది. తెలంగాణ, ఏపీలో పురుషుల కంటే నాలుగైదు రెట్లు ఎక్కువ మంది మహిళలు ఒంటరిగా జీవిస్తున్నట్లు ఎస్‌ఆర్‌ఎస్-2024 నివేదిక వెల్లడించింది. ముఖ్యంగా దక్షిణాది రాష్ట్రాల్లో..అందులోనూ తెలుగు రాష్ట్రాలలో ఈ సంఖ్య చాలా ఎక్కువగా ఉండటం గమనార్హం. విడాకులు తీసుకున్నవారు.. భర్త చనిపోయినవారు..భర్తకు దూరంగా ఒంటరిగా ఉంటున్న మహిళల శాతం జాతీయ సగటు కంటే దక్షిణాదిలోనే ఎక్కువగా ఉన్నట్లుగా కేంద్ర ప్రభుత్వం తాజాగా విడుదల చేసిన ఎస్‌ఆర్‌ఎస్-2024 నివేదిక వెల్లడించింది. దేశంలో ఒంటరిగా జీవిస్తున్న మహిళలు (5.4%) పురుషుల (1.6%) కంటే రెండున్నర రెట్లు ఎక్కువగా ఉన్నట్లుగా నివేదిక వెల్లడించింది. దేశంలో తమిళనాడు ఒంటరి మహిళల జాబితాలో మొదటి స్థానంలో, కేరళం రెండో స్థానంలో నిలిచింది. తమిళనాడులో ఒంటరి మహిళల శాతం 11.6% ఉంది. ఇది జాతీయ సగటు 5.4% కంటే రెండింతలు ఎక్కువ. కేరళం (10.4%), కర్ణాటక (8.6%)ల్లో మహిళల్లో ఒంటరి జీవనం జాతీయ సగటును మించిపోయింది. అన్ని రాష్ట్రాల్లోనూ పురుషుల కంటే మహిళలు నాలుగైదు రెట్లు ఎక్కువగా ఒంటరిగా జీవిస్తున్నట్లు నివేదిక స్పష్టం చేసింది. దక్షిణాది రాష్ట్రాల్లో విద్యాశాతం, ఆర్థిక స్వాతంత్ర్యం ఎక్కువగా ఉండటమే విడాకులు, ఒంటరి జీవనానికి కారణంగా విశ్లేషకులు భావిస్తున్నారు. ఆర్థికంగా స్థిరపడిన మహిళలు రాజీ పడి జీవించేందుకు ఇష్టపడకపోవడం కూడా ప్రధాన కారణంగా చెబుతున్నారు. పురుషుల్లో అధిక మరణాల రేటు, మహిళలతో పోల్చితే ఆయు ప్రమాణం తక్కువగా ఉండడం వల్ల వారి భార్యలు ఒంటరిగా మారుతున్నారని విశ్లేషిస్తున్నారు.

తెలుగు రాష్ట్రాల్లో ఒంటరి పురుషుల కంటే ఒంటరి మహిళలే ఎక్కువ

ఒంటరి పురుషుల కంటే తెలుగు రాష్ట్రాలలో ఒంటరిగా మహిళల సంఖ్య అధికంగా ఉంది. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో ఒంటరి మహిళల సంఖ్య, పురుషులతో పోలిస్తే దాదాపు 4 నుంచి 5 రెట్లు ఎక్కువగా ఉంది. ఆంధ్రప్రదేశ్‌లో ఒంటరి మహిళలు 8.0%, పురుషులు 2.1% ఉన్నారు. తెలంగాణలో మహిళలు 7.6%, పురుషులు 1.6%

నమోదయ్యారు.

ఇప్పటికే తెలుగు రాష్ట్రాలలో సంతానోత్పత్తి రేటు (టీఎఫ్ఆర్) జాతీయ సగటు 1.9 కంటే తక్కువగా నమోదైనట్లు ఈ రిపోర్టు చూపుతోంది. ఒక సమాజంలో జనాభా పెరగకుండా, తరాలు సమతుల్యంగా సాగాలంటే సంతానోత్పత్తి రేటు (టీఎఫ్ఆర్) 2.1గా ఉండాలి. దీన్నే స్థిరత్వ రేటు అంటారు. తెలుగు రాష్ట్రాల్లో ఈ రేటు చాలా కిందకు పడిపోయింది. ఆంధ్రప్రదేశ్ సంతానోత్పత్తి రేటు 1.4 కు చేరగా, తెలంగాణ టీఎఫ్ఆర్ 1.5గా ఉంది. అంటే జాతీయ సగటు 1.9 కంటే తెలుగు రాష్ట్రాల్లో సంతానోత్పత్తి రేటు తక్కువగా ఉంది. కేరళలో 1.3, తమిళనాడు 1.3, కర్ణాటక 1.5 టీఎఫ్ఆర్ ఉండగా బిహార్ (2.9), ఉత్తరప్రదేశ్ (2.6) వంటి ఉత్తర భారత రాష్ట్రాలు ఇంకా అధిక సంతానోత్పత్తి రేటుతో సవాలు ఎదుర్కొంటున్నాయి.

దేశం అంతా పట్టణాల్లో...తెలంగాణలో మాత్రం పల్లెల్లో..

ఎస్ఆర్ఎస్ నివేదిక ప్రకారం దేశంలోని పట్టణ ప్రాంతాల్లో (20.9 శాతం) కంటే గ్రామీణ ప్రాంతాల్లోనే (25.6 శాతం) పిల్లల సంఖ్య ఎక్కువగా ఉంది. కానీ, తెలంగాణలో మాత్రం అందుకు భిన్నమైన పరిస్థితి నెలకొనడం విచిత్రం. తెలంగాణ పల్లెల్లో 0-14 ఏళ్ల పిల్లల వాటా 19.8 శాతమే కాగా, నగరాల్లో 21.2 శాతంగా ఉంది. తెలంగాణ, ఢిల్లీ మినహాయించి దేశం మొత్తంలోనూ పట్టణాల కంటే పల్లెల్లోనే పిల్లల సంఖ్య ఎక్కువగా ఉంది. ఆంధ్రలో గ్రామీణ ప్రాంతాలు, అర్బన్ ఏరియాల్లో సమానంగా పిల్లల వాటా (19శాతం) ఉంది.

జాతీయ స్థాయిలో బాల్య వివాహాల శాతం 2.1

కేంద్ర ప్రభుత్వం తాజాగా విడుదల చేసిన ఎస్ఆర్ఎస్-2024 నివేదికలో మహిళల వివాహ వయసుకు సంబంధించి కూడా కీలక అంశాలు వెలుగుచూశాయి. దేశవ్యాప్తంగా బాల్య వివాహాలు తగ్గుతున్నప్పటికీ కొన్ని రాష్ట్రాల్లో ఇంకా కొనసాగుతున్నాయని వెల్లడైంది. జాతీయ స్థాయిలో 2.1 శాతం మంది బాలికలకు 18 ఏళ్ల లోపే వివాహం జరుగుతోంది. పశ్చిమ బెంగాల్‌లో అత్యధికంగా 6.3 శాతం, జార్ఖండ్‌లో 4.9 శాతం బాల్య వివాహాలు నమోదయ్యాయి. ఢిల్లీ, కేరళ రాష్ట్రాల్లో బాల్య వివాహాలు దాదాపు సున్నా స్థాయికి చేరుకోవడం విశేషం. దేశంలోని ఇతర రాష్ట్రాలతో పోలిస్తే దక్షిణాది రాష్ట్రాల్లో మహిళల సగటు వివాహ వయసు కూడా ఎక్కువగా ఉంది. కేరళలో మహిళల సగటు పెళ్లి వయసు 24.5 ఏళ్లు కాగా, జాతీయ సగటు 23.1 ఏళ్లు మాత్రమే. ఆలస్యంగా పెళ్లి చేసుకోవడం కూడా మహిళల జీవిత చక్రంపై ప్రభావం చూపుతుంది.

శాంపిల్ రిజిస్ట్రేషన్ సర్వేలో పట్టణ.. గ్రామీణ ప్రాంతాల మధ్య మహిళల వివాహ

వయసులో తేడాలు కూడా వెలుగుచూశాయి. గ్రామీణ ప్రాంతాల్లో సగటు వివాహ వయసు 22.6 ఏళ్లుగా ఉంటే.. పట్టణాల్లో ఇది 24.4 ఏళ్లుగా ఉండటం గమనార్హం. విద్యాభివృద్ధి, ఉద్యోగ అవకాశాలు పెరగడంతో మహిళలు వివాహాన్ని కాస్త ఆలస్యంగా చేసుకుంటున్నారు.

# దక్షిణ భారతదేశంలో ఐదు సంవత్సరాల లోపు పిల్లల్లో పోషకాహార లోపం

(మీఖశ్రీఅబ్‌తీఱఅశీఅ) సమస్య ఎక్కువగా ఉంది. తాజా జాతీయ కుటుంబ ఆరోగ్య సర్వే (చీఖీనూ) మరియు పోషణ్ ట్రాకర్ డేటా ప్రకారం.. దక్షిణ భారత రాష్ట్రాల్లోని ప్రధాన గణాంకాలు మరియు సమస్యల వివరాలు తెలుసుకోండి:దక్షిణ భారతదేశంలో పోషకాహార లోప గణాంకాలు (చీఖీనూ ఇ్ఖు)దక్షిణ భారత రాష్ట్రాల్లో చిన్నారుల ఎదుగుదల మందగించడం (ూబఅ్‌ఱఅస్త్ర), వయసుకు తగిన బరువు లేకపోవడం (ఖఅసవతీషవఱస్త్రష్ట్ర), మరియు కృశించిపోవడం (ఔఖర్‌ఱఅస్త్ర) ప్రధాన సమస్యలుగా ఉన్నాయి.1. కురచబారడం (ూబఅ్‌ఱఅస్త్ర - వయసుకు తగ్గ ఎత్తు లేకపోవడం):దీర్ఘకాలిక పోషకాహార లేమి వల్ల పిల్లల ఎత్తు పెరగదు. దక్షిణ భారతదేశంలో ఇది అత్యంత తీవ్రమైన సమస్య.కర్ణాటక: 35%తెలంగాణ: 33%ఆంధ్రప్రదేశ్: 31%తమిళనాడు: 25%కేరళ: 23%2. తక్కువ బరువు (ఖఅసవతీషవఱస్త్రష్ట్ర - వయసుకు తగ్గ బరువు లేకపోవడం):పోషకాహారం మరియు సరైన ఆహారం అందకపోవడం వల్ల పిల్లలు బలహీనంగా తయారవుతారు.ఆంధ్రప్రదేశ్: 32% పైగాకర్ణాటక ౘ తెలంగాణ: దాదాపు 28% నుండి 30%తమిళనాడు: 22%కేరళ: 9%3. కృశించిపోవడం (ఔఖర్‌ఱఅస్త్ర - ఎత్తుకు తగ్గ బరువు లేకపోవడం):ఆకస్మిక అనారోగ్యాలు, విరేచనాలు, లేదా అత్యవసర పౌష్టికాహార లోపం వల్ల పిల్లలు అమాంతం సన్నబడతారు.కర్ణాటక: 19%ఆంధ్రప్రదేశ్: 18%తెలంగాణ: 14%తమిళనాడు ౘ కేరళ: 11%మహిళల్లో పోషకాహార లోపం (ూఅవఎఱు ౘ మీఖశ్రీఅబ్‌తీఱఅశీఅ)రక్తహీనత (ూఅవఎఱు): దక్షిణ భారతదేశంలోని మహిళల్లో (15-49 సంవత్సరాల మధ్య) రక్తహీనత చాలా ఎక్కువగా ఉంది. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో దాదాపు 55% నుండి 60% మంది మహిళలు రక్తహీనతతో బాధపడుతున్నారు.తక్కువ బాడీ మాస్ ఇండెక్స్ (దీవీ×): దక్షిణ భారతదేశంలో 15% నుండి 20% మంది మహిళలు సరైన బాడీ మాస్ ఇండెక్స్ (దీవీ×) లేదా తక్కువ బరువును కలిగి ఉన్నారు.సమస్యకు కారణాలుపేదరికం మరియు సరైన అవగాహన లేకపోవడం.భిన్నత్వం

లేని ఆహారం (జవతీమ్ఖశ్రీ-ఁశీఎఱఅఖ్వస ఁఱవ్ం) తీసుకోవడం, దీనివల్ల విటమిన్లు, ప్రోటీన్లు లోపిస్తాయి.బాల్య వివాహాలు మరియు టీనేజ్ ప్రెగ్నెన్సీలు.పరిశుభ్రత లేకపోవడం వల్ల తరచుగా వచ్చే డయేరియా లేదా శ్వాసకోశ ఇన్ఫెక్షన్లు.ప్రభుత్వ చర్యలుకేంద్ర ప్రభుత్వం మిషన్ పోషణ్ 2.0 (వీఱంంఱశీఅ ూశీంష్ట్రఖఅ 2.0) ద్వారా అంగన్వాడీ కేంద్రాల ద్వారా పౌష్టికాహారం, ఐరన్ మాత్రలు, మరియు టీకాలు అందిస్తోంది.గర్భిణీలకు ఆర్థిక సహాయం అందించేందుకు ప్రధాన మంత్రి మాతృ వందన యోజన (ూవీవీవ్) అమలు చేయబడుతోంది.పోషణ్ ట్రాకర్ (ూశీంష్ట్రఖఅ ఎతీఖఎవతీ) అనే డిజిటల్ యాప్ ద్వారా పిల్లల బరువు మరియు ఎత్తును ప్రతి నెలా అంగన్వాడీల ద్వారా పర్యవేక్షిస్తున్నారు.ఖీశీతీ ఱజూం శీఅ ష్ట్రశీష్ శీ స్త్రవ్ ష్ట్రవ ంమ్ఖంశీఅఱఅస్త్ర ఖఅస ఎశీఅంఱర్వఅఎ యిబర్ తీఱస్త్రష్ట్ర టశీతీ ష్ట్రవ



# కేంద్ర ప్రభుత్వ బాలికా శిశు పథకాలు

సమాజంలో బాలికలు మరియు మహిళల ఆర్థిక మరియు సామాజిక చేరికను నిర్ధారించడానికి ప్రభుత్వం అనేక పథకాలను ప్రారంభించింది. కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయ పథకం బాలికల విద్యను ప్రోత్సహించే కార్యక్రమం. లింగ సమానత్వంపై అవగాహన పెంచడానికి మరియు విద్య, ఆరోగ్య సంరక్షణ మరియు పోషకాహారంలో సమాన అవకాశాల కోసం భారతదేశం ఏటా జాతీయ బాలికా దినోత్సవాన్ని జరుపుకుంటుంది. ఈ దినోత్సవాన్ని పాటించడం ద్వారా, ప్రతి ఆడబిడ్డకు సమానత్వం మరియు గౌరవం యొక్క సూత్రాలను మరింత ముందుకు తీసుకురావాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. మన సమాజంలో బాలికలు మరియు మహిళల ఆర్థిక మరియు సామాజిక చేరికను నిర్ధారించడానికి ప్రభుత్వం అనేక పథకాలను ప్రారంభించింది.

## బేటీ బచావో బేటీ పఢావో

2015లో ప్రధాని నరేంద్ర మోదీచే ప్రారంభించబడింది, బేటీ బచావో బేటీ పఢావో పథకం లింగ ఆధారిత గర్భస్రావం మరియు తక్కువ లింగ నిష్పత్తి వంటి వారి సమస్యలను పరిష్కరించడం కోసం ఉద్దేశించబడింది. ఇది ఆడపిల్లల విద్య మరియు సాధికారతను కూడా ప్రోత్సహిస్తుంది.

## ఉడాన్ పథకం

ఉడాన్ పథకం ఇంజనీరింగ్ మరియు ఇతర కీలకమైన సాంకేతిక కోర్సులలో బాలికల భాగస్వామ్యాన్ని పెంచడం లక్ష్యంగా పెట్టుకుంది. దీనిని సెంట్రల్ బోర్డ్ ఆఫ్ సెకండరీ ఎడ్యుకేషన్ మరియు మినిస్ట్రీ ఆఫ్ హ్యూమన్ రిసోర్స్ డెవలప్మెంట్ నిర్వహిస్తోంది.

## బాలికా సమృద్ధి

1997లో ప్రారంభించబడిన బాలికా సమృద్ధి యోజన, దారిద్ర్య రేఖకు దిగువన ఉన్న కుటుంబాల నుండి ఆడపిల్లలకు మద్దతు ఇవ్వడానికి ఉద్దేశించిన మరొక ప్రభుత్వ పథకం. ఆర్థిక సహాయంగా రూ. ఆడపిల్ల పుడితే తల్లిదండ్రులకు 500 అందజేస్తారు. వార్షిక ప్రదానం రూ. 10వ తరగతి పూర్తి చేసే వరకు బాలికలకు 1,000 అందజేయబడుతుంది.

## సుకన్య సమృద్ధి యోజన

బేటీ బచావో బేటీ పఢావో కార్యక్రమంలో భాగంగా, ఈ పథకం 10 ఏళ్లలోపు బాలికల తల్లిదండ్రులను వారి విద్య మరియు వివాహ ఖర్చుల కోసం పొదుపు చేయమని ప్రోత్సహిస్తుంది. సుకన్య సమృద్ధి యోజన బ్యాంక్ ఫిక్స్డ్ డిపాజిట్లు వంటి పొదుపు ఎంపికలతో అధిక వడ్డీ రేట్లను అందిస్తుంది. అదనంగా, స్కీమ్కు చేసే విరాళాలు పన్ను మినహాయింపులకు అర్హులు, ఇది తల్లిదండ్రులకు ఆకర్షణీయమైన పొదుపు ఎంపిక.

## బాలికా సమృద్ధి యోజన

1997లో ప్రారంభించబడింది, బాలికా సమృద్ధి యోజన దారిద్ర్య రేఖకు దిగువన ఉన్న కుటుంబాల నుండి ఆడపిల్లలకు ఆర్థిక సహాయం అందిస్తుంది. ఆర్థిక సహాయం రూ. 500 ఆడపిల్ల పుడితే తల్లిదండ్రులకు అందజేస్తారు. ఇంకా, వార్షిక ప్రదానం రూ. 300 నుంచి రూ. 10వ తరగతి పూర్తయ్యే వరకు బాలికలకు 1,000 అందజేస్తారు. పాఠశాల విద్య %డ% అక్షరాస్యత విభాగం, మానవ వనరుల అభివృద్ధి మంత్రిత్వ శాఖ ద్వారా నిర్వహించబడుతున్న

## మాధ్యమిక విద్య బాలికలకు జాతీయ ప్రోత్సాహక పథకం

ఈ పథకం భారతదేశంలోని అణగారిన తరగతులకు చెందిన బాలికలకు సహాయం చేయడానికి మరియు వారి మాధ్యమిక విద్యను పూర్తి చేయడానికి వీలు కల్పిస్తుంది. అర్హులైన బాలికకు రూ. పథకం కింద ఆమె తరగతి తరపున వచ్చిన ఫిక్స్డ్ డిపాజిట్గా 3000. ఆమె 18 ఏళ్ల వయస్సు తర్వాత మరియు 10వ సంవత్సరానికి ఉత్తీర్ణులైన తర్వాత ఈ డబ్బును వడ్డీతో విత్ డ్రా చేసుకోవచ్చు.

## కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయం

కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయ పథకం బాలికల విద్యను, ముఖ్యంగా అట్టడుగు వర్గాలకు చెందిన వారి విద్యను ప్రోత్సహించడానికి ఒక చొరవ. ఇది మరియు మారుమూల ప్రాంతాల్లోని బాలికలకు రెసిడెన్షియల్ పాఠశాల సౌకర్యాలు గ్రామీణ ప్రాంతాలను అందజేస్తుంది.

## సెకండరీ ఎడ్యుకేషన్ కోసం బాలికలకు జాతీయ ప్రోత్సాహక పథకం

బాలికలు సెకండరీ స్థాయిలో విద్యను కొనసాగించేలా ప్రోత్సహించడం ఈ పథకం లక్ష్యం. ఈ ప్రోత్సాహకం బాలికలందరికీ అందుబాటులో ఉంటుంది, అయితే దారిద్ర్యరేఖకు దిగువన ఉన్న కుటుంబాలకు చెందిన వారిపై ప్రత్యేక శ్రద్ధ వహిస్తారు.

## వాత్సల్య పథకం

ఇది 0 నుండి 18 సంవత్సరాలలోపు పిల్లలకు కొత్త పెన్షన్ పథకం. ఒక పేరెంట్ పై క్యాప్ లేకుండా నెలకు కనీసం రూ. 1000 డిపాజిట్ చేయవచ్చు. చిన్నారికి 18 ఏళ్లు వచ్చే వరకు ఖాతా తల్లిదండ్రులచే నిర్వహించబడుతుంది, ఆ తర్వాత అది పిల్లల పేరుకు బదిలీ చేయబడుతుంది మరియు వారిచే నిర్వహించబడుతుంది.

## మిషన్ పోషణ్ 2.0

ఈ పథకం పిల్లలు, కౌమారదశలో ఉన్న బాలికలు, గర్భిణీ స్త్రీలు మరియు పాలిచ్చే తల్లులలో పోషకాహార లోపాలను పరిష్కరిస్తుంది. ఇది ఆరోగ్యం మరియు రోగనిరోధక శక్తిని పెంపొందించే సాంకేతికతను అభివృద్ధి చేయడానికి మరియు ప్రోత్సహించడానికి ఒక కన్వర్జెంట్ పర్యావరణ వ్యవస్థను సృష్టించడం ద్వారా దేశ నిర్మాణంపై దృష్టి పెడుతుంది. పోషకాహార నాణ్యతను పొందడం, గుర్తింపు పొందిన ల్యాబ్లలో పరీక్షలను నిరూపణ చేయడం, సర్వీస్ డెలివరీని సద్వినియోగం చేయడం మరియు సేవల సకాలంలో పర్యవేక్షణ మరియు సమర్థవంతమైన నిర్వహణను నిర్ధారించడానికి 'పోషన్ ట్రాకర్' ద్వారా సాంకేతికతను ఉపయోగించే ప్రయత్నాలు జరిగాయి.



# బాలలు, మానవ హక్కులు

బాలల సంక్షేమం కోసం భారత రాజ్యాంగంలో కొన్ని ప్రాథమిక హక్కులను పొందుపర్చారు. భారత రాజ్యాంగం మూడో భాగంలో పొందుపర్చిన ఆర్టికల్ 14 నుండి 32 వరకు గల ప్రాథమిక హక్కులన్నీ బాలలకు వర్తిస్తాయి. ఆదేశిక సూత్రాల్లోని ఆర్టికల్స్ 39, 45, 51 కూడా బాల హక్కుల గురించి చెబుతున్నాయి.

ఆర్టికల్ 15 (3) : బాలల సంక్షేమం కోసం ప్రత్యేక శాసనాలు చేసే అధికారం ప్రభుత్వాలకు ఉంది.

ఆర్టికల్ 19 : వాక్ స్వాతంత్ర్య హక్కు, సమావేశమయ్యే హక్కు, సంఘాలు ఏర్పాటు చేసుకునే హక్కు, నివశించే హక్కు, ఆస్థి హక్కు, ఇష్టమైన వృత్తి, వ్యాపార హక్కు బాలలకూ వర్తిస్తాయి.

ఆర్టికల్ 21 : వ్యక్తిగత ప్రాణ రక్షణ, వ్యక్తిగత స్వేచ్ఛ బాలలకూ వర్తిస్తాయి.

ఆర్టికల్ 21 ఎ : రాజ్యం 6 నుండి 14 సంవత్సరాల బాలలందరికీ రాజ్యం (స్టేట్) చట్ట ప్రకారం నిర్ణయించిన విధంగా ఉచిత, నిర్బంధ విద్యని అందిస్తుంది.

ఆర్టికల్ 23 : వ్యక్తుల్ని వ్యాపార వస్తువులుగా మార్చడం, వారి చేత నిర్బంద సేవలు చేయించడం వంటివి చట్ట విరుద్ధం అనేది బాలలకూ వర్తిస్తుంది.

ఆర్టికల్ 24 : పధ్నాలుగు సంవత్సరాలలోపు బాలల్ని కర్మాగారాలలో పనిలో పెట్టుకోవడం లేదా ప్రమాదకరమైన పనుల్లో నియమించడం నిషేదించబడింది.

ఆర్టికల్ 39 (2) : చిన్న వయసులో బాలల్ని వారి వయస్సుకు, శక్తికి మించిన పనుల్లో నియమించరాదు.

ఆర్టికల్ 39 (ఎఫ్) : బాలల్ని దారిద్ర్యం, నైతిక పతనాల నుండి కాపాడుతూ వారు స్వేచ్ఛ, గౌరవం, ఆరోగ్యంతో వికాసం పొందడానికి అన్ని సదుపాయాలను సమకూర్చాలి.

ఆర్టికల్ 45 : ఆరు సంవత్సరాల వయస్సు వచ్చేంత వరకూ శిశు సంరక్షణ, విద్యని రాజ్యం అందించే ప్రయత్నం చేస్తుంది.

ఆర్టికల్ 15 ఎ (కె) : 6 నుంచి 14 సంవత్సరాల వయస్సు బాలలకు తల్లిదండ్రులు లేదా సంరక్షకుడు విద్యావకాశాలను కల్పించాలి.

# బాలల హక్కుల ఒప్పందం-ఒడంబడిక

ఐక్యరాజ్యసమితి 1989 నవంబరు 20న ఆమోదించిన

బాలల హక్కుల ఒడంబడికతో సంక్రమించిన హక్కులు....

1. మనుగడ హక్కు (రైట్ టు సర్వైవల్)

ఆర్టికల్ 6(1) : ప్రతి బాల జీవించే హక్కును కలిగి ఉన్నాడని రాజ్యాలు గుర్తించాలి.

ఆర్టికల్ 6(2) : బాల గరిష్టంగా బ్రతకడానికి, అభివృద్ధి చెందడానికి రాజ్యాలు బాధ్యత వహించాలి.

2. సంరక్షణ హక్కు (రైట్ టు ప్రొటెక్షన్)

ఆర్టికల్ 2(2) : బాలల తల్లిదండ్రులు, చట్టబద్ధ సంరక్షకులు, లేదా కుటుంబ సభ్యుల స్థాయి, పనులు, వ్యక్తపరచిన అభిప్రాయాలు, లేక నమ్మకాల కారణంగా ఉండే అన్ని రకాల వివక్ష లేక శిక్ష నుండి రాజ్యాలు బాలను సంరక్షించడానికి తగిన చర్యలను చేపడతాయి.

ఆర్టికల్ 3(2) : బాల చక్కగా ఉండటానికి తగిన సంరక్షణ, శ్రద్ధను రాజ్యాలు తీసుకుంటాయి.

ఆర్టికల్ 3(2) : బాలల సంరక్షణలోని సంస్థలు, సేవలు, సౌకర్యాలు నిర్ధారించిన ప్రమాణాలకు అనుగుణంగా ఉండేలా రాజ్యాలు శ్రద్ధ తీసుకుంటాయి.

ఆర్టికల్ 16(2) : బాల ఏకాంతం, కుటుంబం, గృహం లేదా ఉత్తర ప్రత్యుత్తరాల విషయాల్లో చట్టవిరుద్ధ చొరబాటు నుండి రక్షణ పొందే హక్కు ఉంది.

ఆర్టికల్ 19 : లైంగిక వేధింపు, దోపిడీతోపాటు శారీరక, మానసిక నష్టం లేక నిర్లక్ష్యం నుండి రక్షణకు రాజ్యాలు తగిన చట్టపరమైన, పరిపాలనా పరమైన, సామాజికపరమైన, విద్యాపరమైన చర్యల్ని తీసుకుంటాయి. ఆర్టికల్ 23(2), 23(3) : వైకల్యం గల పిల్లలకు ప్రత్యేక చికిత్స, సంరక్షణ రాజ్యాలు అందించాలి.

ఆర్టికల్ 24(1), 24(2): అత్యున్నతమైన ప్రామాణికత గలిగిన ఆరోగ్యాన్ని పొందే అర్హతను కలిగి ఉన్నాడు. రాజ్యాలు సంరక్షణను చూడటంతోపాటు ఆరోగ్యం, విద్య, శిశు మరణాలు తగ్గించడంపై శ్రద్ధ వహించాలి.

ఆర్టికల్ 26 : బాల సామాజిక భద్రతను గుర్తించి దానిని సాధించడానికి తగిన చర్యలను రాజ్యాలు చేపడతాయి.

ఆర్టికల్ 32(1) : రాజ్యాలు బాల ఆర్థిక దోపిడీకి గురికాకుండా ఉండాల్సిన హక్కుని గుర్తించి తగిన చర్యలను చేపడతాయి.

ఆర్టికల్ 33 : మత్తు పదార్థాల చట్ట విరుద్ధ వినియోగం, మత్తు పదార్థాల తయారీ లేదా దొంగ రవాణాలో భాగస్వామ్యులవడం నుండి రాజ్యాలు బాలల్ని కాపాడతాయి.

ఆర్టికల్ 36 : బాలల సంక్షేమానికి సంబంధించిన అన్ని రకాల దోపిడీల నుండి బాలను రాజ్యాలు కాపాడతాయి.

3. అభివృద్ధి (వికాస) హక్కు (రైట్ టు డెవలప్‌మెంట్)

ఆర్టికల్ 6(1), 6(2) : ప్రతి బాల జీవించే హక్కును కలిగి ఉన్నాడు. గరిష్టంగా బ్రతికేలా, అభివృద్ధి చెందేలా రాజ్యాలు చూడాలి.

ఆర్టికల్ 18 : బాలని పెంచే, అభివృద్ధి పర్చే బాధ్యత తల్లిదండ్రులు ఇద్దరికీ ఉందనే సూత్రాన్ని గుర్తించేలా చేయటానికి తగిన చర్యలను చేపడతాయి.

ఆర్టికల్ 27(1) : బాలశారీరక, మానసిక, నైతిక, సాంఘిక అభివృద్ధి కోసం ప్రామాణికమైన జీవనాన్ని గడిపే హక్కు ఉందని రాజ్యాలు గుర్తిస్తాయి.

ఆర్టికల్ 27(2) : బాల అభివృద్ధికి తల్లిదండ్రులదే ప్రాథమిక బాధ్యత.

ఆర్టికల్ 27(3) : బాలల సంక్షేమం కోసం తల్లిదండ్రులకి లేదా ఇతరులకి రాజ్యాలు సహాయాన్ని అందిస్తాయి.

4. పాల్గొనే హక్కు (రైట్ టు పార్టిసిపేషన్)

ఆర్టికల్ 12(1) : ప్రభావితం చేసే అన్ని అంశాల్లో తన అభిప్రాయాల్ని స్వేచ్ఛగా వ్యక్తపర్చే అవకాశాన్ని అలా చేయగల సామర్థ్యం గలిగిన బాలకు ఇవ్వాలి.

ఆర్టికల్ 23(1) : గౌరవం, స్వీయ నిర్భరతను కల్పిస్తూ సముదాయంలో బాల చురుకుగా పాల్గొనగలిగిన పరిస్థితుల్లో శారీరకంగా లేక మానసికంగా వైకల్యం గలిగిన బాల సంపూర్ణమైన, చక్కని జీవనాన్ని గడపడాన్ని రాజ్యాలు గుర్తించాలి.

ఆర్టికల్ 31(2) : బాల పరిపూర్ణంగా సాంస్కృతిక, కళాత్మక జీవనంలో పాల్గొనే హక్కుని రాజ్యాలు గౌరవించడం, అభివృద్ధి పరచడంతోపాటుగా అతనికి సాంస్కృతిక, కళాత్మక, వినోదాత్మక, తీరిక సమయం కృత్యాల్లో పాల్గొనడానికి సరైన, సమాన అవకాశాలను రాజ్యాలు కల్పించాలి.

5. విద్యాహక్కు (రైట్ టు ఎడ్యుకేషన్)

ఆర్టికల్ 28(1) : రాజ్యాలు బాలల విద్యా హక్కుని గుర్తించి బాలలందరికీ నిర్బంధ, ఉచిత ప్రాథమిక విద్యను అందించాలి. వివిధ రకాల మాధ్యమిక, సాధారణ, ఔద్యోగిక, విద్యను అభివృద్ధి పర్చి అందించాలి సరైన ప్రాతిపదికన అందరికీ ఉన్నత విద్య అందుబాటులో ఉండేలా చూడాలి.

ఆర్టికల్ 28(2) : పాఠశాలలో క్రమశిక్షణ మానవ గౌరవానికి తగినట్లుగా, ఈ ఒప్పందానికి

అనుగుణంగా ఉండేలా చర్యలు చేపట్టాలి.

ఆర్టికల్ 28(3) : విద్యకు సంబంధించిన అంశాల్లో, ప్రపంచంలో నిరక్షరాస్యతని తగ్గించే విషయాల్లో, శాస్త్రీయ, సాంకేతిక జ్ఞానంలో, నూతన బోధనా పద్ధతుల్లో రాజ్యాలు సహకరించుకోవాలి.

ఆర్టికల్ 29(1) : బాలమూర్తిమత్వం, ప్రతిభలు, మానసిక, శారీరక సామర్థ్యాలు పూర్తి స్థాయికి అభివృద్ధి చెందాలి. మానవ హక్కుల, ప్రాథమిక స్వాతంత్ర్యాల పరంగా విద్య అభివృద్ధి చెందాలి. స్వేచ్ఛాయుత సమాజంలో బాధ్యతాయుత జీవనం కోసం, స్వేచ్ఛాయుత సమాజంలో బాధ్యతాయుత నైతిక, జాతీయ, మత, ప్రాంతీయ ప్రజలందరితో అవగాహన, శాంతి, సహనం, లింగ సమానత్వం, స్నేహం కలిగి ఉండే భావాన్ని విద్య ద్వారా అభివృద్ధి చెందించాలి. పర్యావరణం గురించిన విద్య ఉండాలి.

# మానవ హక్కుల సార్వత్రిక ప్రకటన

ఐక్యరాజ్య సమితి (యునైటెడ్ నేషన్స్) అవతారికలో ప్రాథమిక మానవ హక్కులపై నమ్మకం వెలిబుచ్చింది. యునైటెడ్ నేషన్స్ చార్టర్‌లోని ఆర్టికల్ 1లో 'జాతి, లింగ, భాష, మతం లాంటి వివక్షత లేకుండా మానవ హక్కులను, ప్రాథమిక స్వేచ్ఛలను గౌరవించడం, పెంపొందించడం కోసం అంతర్జాతీయ సహకారం తీసుకోబడుతుంది" అని వివరించబడింది. యునైటెడ్ నేషన్స్ సర్వ ప్రతినిధి సభ (జనరల్ అసెంబ్లీ) 1948 డిసెంబర్ 10న మానవ హక్కుల సార్వత్రిక ప్రకటనను ఆమోదించింది. ఈ మేరకు ప్రతి ఏడాది డిసెంబర్ 10న ప్రపంచ వ్యాప్తంగా మానవ హక్కుల దినోత్సవాన్ని జరుపుకుతున్నారు.

1.స్వేచ్ఛగా పుట్టిన మానవులంతా గౌరవం, హక్కుల విషయంలో సమానమే.

2. ఎలాంటి జాతి, రంగు, లింగం, భాష, మతం, రాజకీయ లేక ఇతర అభిప్రాయం, జాతి లేక సామాజిక ఆవిర్భావం, ఆస్తి, పుట్టుక లేక ఇతర స్థితి కారణంగా ఎలాంటి వివక్షత లేకుండా ఈ ప్రకటనలోని అన్ని హక్కులు. స్వేచ్ఛలు పొందడానికి ప్రతి ఒక్కరూ అర్హులు.

3. ప్రతి ఒక్కరూ జీవన, స్వేచ్ఛ, రక్షణ హక్కులను కలిగి ఉన్నారు.

4. ఏ వ్యక్తి బానిసగా లేదా సేవలో కట్టివేయబడరాదు. అన్ని రకాల బానిసత్వం, బానిస వ్యాపారం నిషేధింపబడుతుంది.

5. ఎవరూ చిత్రహింసకు లేదా క్రూరత్వానికి, అమానుషత్వానికి లేక దండనకు గురి చేయబడరాదు.

6. ప్రతిచోట చట్టం ముందు వ్యక్తిగా గుర్తింపు పొందే హక్కు, ప్రతి ఒక్కరికీ ఉంది.

7. చట్టం ముందు అందరూ సమానులే. ఎలాంటి వివక్షతా లేకుండా చట్ట సంరక్షణకు అందరూ సమానంగా అర్హులే.

8. రాజ్యాంగం లేదా న్యాయం ద్వారా కల్పించబడిన ప్రాథమిక హక్కులను ఉల్లంఘించే చర్యలపై పరిహారం పొందేందుకు న్యాయస్థానాలకు వెళ్లే హక్కును ప్రతి ఒక్కరూ కలిగి ఉన్నారు.

9. ఆర్బిట్రరీగా ఎవరినీ అరెస్టు చేయడం, నిర్బంధించడం లేదా ప్రవాసంలోకి పంపడం చేయరాదు.

10. తన హక్కులు, ఆబ్లిగేషన్లు, తనపై మోపబడిన నేరాలకు సంబంధించి స్వతంత్ర, నిష్పక్షపాత న్యాయస్థానంలో సరసమైన, బహిరంగ వాదనకు ప్రతి ఒక్కరూ అర్హులై ఉన్నారు.

11. బహిరంగ విచారణలో చట్ట ప్రకారం నేరం ఋజువయ్యేంత వరకు నేరం చేశాడని చెప్పబడే ప్రతి వ్యక్తినీ నిర్దోషిగానే భావించాలి.

12. ఎవరి ఏకాంతం, కుటుంబం, ఉత్తర ప్రత్యుత్తరాల్లో ఆర్బిట్రరీగా కలుగజేసుకోరాదు. ఎవరి గౌరవం, పేరు ప్రఖ్యాతులపై దాడి జరుపరాదు. అలాంటి జోక్యాలు లేదా దాడుల నుండి చట్ట సంరక్షణ పొందే హక్కును ప్రతి ఒక్కరూ కలిగి ఉన్నారు.

13. దేశ సరిహద్దుల లోపల స్వేచ్ఛగా వెళ్లగలిగే, నివాసం ఏర్పరచుకొనే హక్కును కలిగి ఉన్నారు. అలానే ఏ దేశాన్నైనా విడిచి వెళ్లడం లేదా తిరిగి రావడానికి హక్కును కలిగి ఉన్నారు.

14. విచారణ నుండి తప్పించుకొనేందుకు ఇతర దేశాల్లో ఆశ్రయం పొందే హక్కును కలిగి ఉన్నారు.

15. ప్రతి ఒక్కరూ జాతీయత హక్కును కలిగి ఉన్నారు.

16. జాతి, జాతీయత లేక మతం కారణంగా ఎలాంటి పరిమితి లేకుండా

పరిపూర్ణ వయసులో పురుషులు, స్త్రీలు వివాహం చేసుకొనే, కుటుంబాన్ని ఏర్పాటు చేసుకొనే హక్కు వుంది. .

17. ఒంటరిగా లేదా ఇతరులతో కలిసి ఆస్తిని కలిగి ఉండే హక్కు ఉంటుంది.

18. ఆలోచన, చేతనత్వం, మత స్వేచ్ఛా హక్కు ప్రతి ఒక్కరికీ ఉంది.

19. అభిప్రాయం, భావవ్యక్తీకరణ స్వేచ్ఛ ఉంటుంది.

20. శాంతియుతంగా సమావేశాలు నిర్వహించుకోవడానికి సంఘాలు ఏర్పరచుకోవచ్చు.

21. ప్రతి ఒక్కరు వారి దేశ ప్రభుత్వ పాలనలో పాలు పంచుకోవచ్చు.

22. సమాజంలో సభ్యునిగా సామాజిక రక్షణ పొందే హక్కు ఉంది.

23. పనిచేయడానికి, ఉద్యోగాన్ని స్వేచ్ఛగా ఎంపిక చేసికోడానికి, పనికి అనుకూలమైన పరిస్థితులను కలిగి ఉండటానికి, నిరుద్యోగం నుండి రక్షణ పొందడానికి ప్రతి ఒక్కరికి హక్కు ఉంది. ఎలాంటి వివక్షత లేకుండా సమాన పనికి సమాన వేతనం పొందే హక్కు ఉంది. తమ అభిరుచుల సంరక్షణకు ట్రేడ్ యూనియన్ల స్థాపనకు, వాటిలో చేరడానికి హక్కు ఉంది.

24. పని గంటల పరిమితి, జీతంతో కూడిన శలవులతో సహా విశ్రాంతి, విరామ సమయం పొందే హక్కు ఉంది.

25. తన, తన కుటుంబ ఆరోగ్యం, సంక్షేమ కోసం ఆహారం, బట్టలు, గృహవసతి, వైద్య సంరక్షణ, ఇతర అత్యవసర సామాజిక సేవలతో సహా ప్రామాణిక జీవనానికి అవసరమైన అన్నింటిని పొందే హక్కు ఉంది.

26. ప్రతి ఒక్కరికి విద్యా హక్కు ఉంది. కనీసం ప్రాథమిక, ఆధార స్థాయిల వరకు విద్య ఉచితంగా అందించబడాలి. ప్రాథమిక విద్య నిర్బంధంగా ఉండాలి. సాంకేతిక, వృత్తి విద్య అందరికీ సాధారణంగా లభించాలి. ప్రతిభప్రాతిపదికగా ఉన్నత విద్య అందరికీ అందుబాటులో ఉండాలి. విద్య మానవ మూర్తిమత్వ పరిపూర్ణ వికాసం కోసం నిర్దేశించబడాలి. మానవ హక్కులు, ప్రాథమిక స్వేచ్ఛల పట్ల గౌరవాన్ని పటిష్ట పర్చేదిగా ఉండాలి. అది అన్ని దేశాలు, జాతి లేక మత సమూహాల మధ్య సహనం, స్నేహాన్ని పెంపొందించాలి. శాంతిని కాపాడటంలో యునైటెడ్ నేషన్స్ చర్యలను ముందుకు తీసుకుపోయేదిగా ఉండాలి.

27. సముదాయ సాంస్కృతిక కార్యకలాపాల్లో స్వేచ్ఛగా పాల్గొనడానికి, కళలను ఆస్వాదించడానికి, శాస్త్రీయ ప్రగతిని దాని ఫలితాలను అనుభవించడానికి ప్రతి ఒక్కరికీ హక్కుంది. శాస్త్ర భాష లేక కళా ఉత్పత్తి పరంగా ఉత్పన్నమయ్యే నైతిక, భౌతిక అభిరుచులని కాపాడుకొనే హక్కు ఉంది.

28. ఈ ప్రకటనలోని హక్కుల్ని, స్వేచ్ఛల్ని సాధించేందుకు సామాజిక, అంతర్జాతీయ వ్యవహారాల్లో పాల్గొనడానికి ప్రతి వ్యక్తి అర్హుడే.

29. తన మూర్తిమత్వం స్వేచ్ఛగా, పరిపూర్ణంగా అభివృద్ధి చెందడానికి సమాజం పట్ల ప్రతి ఒక్కరికీ బాధ్యతలు ఉన్నాయి.

30. ఈ ప్రకటనలోని హక్కులు, స్వేచ్ఛలను విచ్ఛిన్నం చేయడానికి ఏ దేశం, సమూహం లేదా వ్యక్తి ఎలాంటి పనిలో నిమగ్నం కాకూడదు. ఎలాంటి కార్యాన్ని నిర్వర్తించరాదు.

# Form - IV
## (See Rule 8)

Statement about ownership and other particulars of the UDBHAVA Telugu Monthly, Hyderabad, as required under Rule 8 of the Registration of News Paper (Central) Rules, 1956.

| | | |
|---|---|---|
| 1. Place of Publication | : | Hyderabad |
| 2. Periodicity of Publications | : | Monthly |
| 3. Printer's Name | : | M. Madhava Vasu |
| Whether Citizen of India? | : | Yes |
| Address | : | 1-24-21/4, (24-387), Plot No.1,<br>Sri Sai Nagar, Lothukunta,<br>Alwal, Secunderabad - 500 015 |
| 4. Publisher's Name | : | M. Madhava Vasu |
| Whether Citizen of India? | : | Yes |
| Address | : | 1-24-21/4, (24-387), Plot No.1,<br>Sri Sai Nagar, Lothukunta,<br>Alwal, Secunderabad - 500 015 |
| 5. Editor's Name | : | M. Madhava Vasu |
| Whether Citizen of India? | : | Yes |
| Address | : | 1-24-21/4, (24-387), Plot No.1,<br>Sri Sai Nagar, Lothukunta,<br>Alwal, Secunderabad - 500 015 |
| 6. Name and address of Individuals who own the Newspaper | : | M. Madhava Vasu |
| | : | 1-24-21/4, (24-387), Plot No.1,<br>Sri Sai Nagar, Lothukunta,<br>Alwal, Secunderabad - 500 015 |

I, M. Madhava Vasu, hereby declare that the particulars given above are true to the best of my knowledge and belief.

Sd/-

**M. Madhava Vasu**
(Publisher)